www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 315

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా.7.23 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఆశ్లేష రా.7.35 తదుపరి మఖ; వర్జ్యం: ఉ.7.54-9.34; దుర్ముహూర్తం: మ.12.06-12.52; అమృతఘడియలు: సా.5.54-7.35; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.12

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆ ఎంజైమ్‌ను అడ్డుకుంటే క్యాన్సర్‌కు చెక్!



కీలక ఎంజైమ్‌ను గుర్తించిన దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు

దాన్ని నిరోధిస్తే క్యాన్సర్ కణాలు తిరిగి సాధారణస్థితికి

2 క్యాన్సర్ పరిశోధనల్లో కీలక మైలురాయి

జేఈఈ మెయిన్ సెషన్-1లో 14 మందికి 100 పర్సంటైల్!



వీరిలో రాజస్థాన్ నుంచే ఐదుగురు

జాబితాలో ఇద్దరు తెలుగు విద్యార్థులు

తెలంగాణ నుంచి బాని బ్రతా మాజీ, ఏపీ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ

ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు మెయిన్ సెషన్-2 పరీక్షల నిర్వహణ

10



లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన టెంపో

కుంభమేళాకు వెళ్లి వస్తూ..
ఏడుగురి దుర్మరణం

- మృతులంతా హైదరాబాద్ వాసులు.. వారు ప్రయాణిస్తున్న టెంపోను రాంగ్‌రూట్‌లో ఢీకొన్న లారీ
- మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్ వద్ద దుర్ఘటన
- మృతుల్లో ముగ్గురు బంధువులు, ముగ్గురు స్నేహితులు
- ఒకరు డ్రైవర్.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- భార్య సంవత్సరీకానికి రెండ్రోజుల ముందే భర్త మృతి
- అనాథలైన ఇద్దరు పిల్లలు

14

కుటుంబం గడవడం కష్టమనుకుంటేనే 'కారుణ్య నియామకం'!



ఉద్యోగి మరణించిన ప్రతి కేసులోనూ వారసులకు కొలువు ఇవ్వడం సరికాదు!

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఈవీఎంలలో డేటా తొలగించవద్దు.. ఈసీకి సుప్రీం ఆదేశం

మెడికల్ సీట్లలో 'స్థానికత' కేసు విస్తృత ధర్మాసనానికి..

సుప్రీంకోర్టును కోరిన తెలంగాణ ప్రభుత్వం పరిశీలించి నిర్ణయిస్తామన్న ద్విసభ్య ధర్మాసనం

2



అమెరికాలో ట్రంపొచ్చె..
మార్కెట్ పాయె!

ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల మార్కెట్లు షేక్.. 'బేర్'మంటున్న మన సెన్సెక్స్, నిఫ్టీ

ట్రంప్ అమెరికా అధ్యక్షుడైనప్పటి నుంచీ మదుపర్లకు.. రూ.23 లక్షల కోట్ల నష్టం

రోజుకు సగటున రూ.లక్ష కోట్లకుపైగా లాస్.. గత 5 రోజుల్లో రూ.17లక్షల కోట్లు ఆవిరి

"వివాహం విద్య నాశాయ.." అని నానుడి! అదే కోవలో.. "ట్రంప్ అధ్యక్షుడైతే స్టాక్‌మార్కెట్లు సర్వనాశాయ" అని ఎన్నికలకు ముందే పలువురు ఆర్థిక నిపుణులు హెచ్చరించారు. వారి అంచనాలన్నీ ఇప్పుడు నిజమవుతున్నాయి. శ్వేతసౌధంలో అడుగుపెట్టిన రోజు నుంచీ ట్రంప్ జారీ చేస్తున్న ఉత్తర్వులు, తీసుకుంటున్న నిర్ణయాలు, విధిస్తున్న సుంకాల దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు అల్లాడిపోతున్నాయి. మరీ ముఖ్యంగా మన బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీ50 కుదేలై.. ఈక్విటీ ఇన్వెస్టర్లు ఐదంటే ఐదు రోజుల్లో రూ.16.97 లక్షల కోట్లు నష్టపోయారు. 22 రోజుల్లో రూ.23 లక్షల కోట్లు ఆవిరైపోయాయి!!

అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టడం ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు అశనిపాతంగా మారింది. అధికారం చేపట్టిన రోజు నుంచి ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలు స్టాక్ మార్కెట్లను కుదేలు చేశాయి. సాధారణంగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కొంత మంది నాయకులు వరుసగా కొద్దిరోజులపాటు అత్యుత్సాహంతో నిర్ణయాలు తీసుకుంటుండడం కద్దు. కానీ.. ట్రంప్ అధికారంలోకి వచ్చి 20 రోజులు దాటిపోయినా ఆయన తీరులో ఏ మార్పూ రాలేదు! వైట్‌హౌస్‌లో అడుగుపెట్టినరోజే డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఉత్తర్వులు గుప్పించిన ట్రంప్.. ఆ తర్వాత తన, మన అనే తేడా లేకుండా పలు దేశాల, పలు ఉత్పత్తుల

మిగతా 2వ పేజీలో...

అదానీకి ఉపశమనం!

అమెరికాలో ఆయనపై నమోదైన కేసులు బలహీన పడేలా ట్రంప్ నిర్ణయం

విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమలు నిలిపివేత

మోదీ పర్యటనకు ముందు నిర్ణయం

ఆంధ్ర, ఒడిసా సహా 5 రాష్ట్రాల అధికార్లకు భారీ లంచాలిచ్చినట్లు అదానీపై ఆరోపణ

ఎఫ్‌సీపీఏ చట్టం కిందే గతంలో కేసులు



వాషింగ్టన్, ఫిబ్రవరి 11: ముడుపుల ఆరోపణలతో అమెరికాలో నమోదైన కేసులతో స్వదేశంలో, విదేశాల్లో తీవ్ర ఇరకాటంలో పడిన అదానీలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ ఊరట కలిగించారు. వ్యాపారాల కోసం అమెరికా, ఇతర దేశాల వ్యాపార సంస్థలు లంచాల ఎరచూపకుండా అడ్డుకునే విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం (ఎఫ్‌సీపీఏ-1977) అమలును నిలిపివేశారు. విదేశాల్లో వ్యాపారాలు నిలబెట్టుకునేందుకు సదరు విదేశాల అధికారులకు ముడుపులు ఇచ్చిన అమెరికన్ సంస్థల ప్రాసిక్యూషన్‌ను స్తంభింపజేస్తూ సోమవారం కార్యనిర్వాహక ఆదేశాలు జారీచేశారు. సదరు చట్టం కింద గతంలో, ప్రస్తుతం తీసుకున్న

మిగతా 2వ పేజీలో...



సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో మందకృష్ణ మాదిగ, చిత్రంలో మంత్రి పొంగులేటి, కేకే, వేం నరేందర్‌రెడ్డి

మంత్రివర్గ విస్తరణపై కదలిక

- వారం పది రోజుల్లో కొలిక్కి వచ్చే చాన్స్
- లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే!
- బెర్తులపై హైకమాండ్ తర్జన భర్జన
- సీఎం, పీసీసీ చీఫ్ అభిప్రాయాల సేకరణ
- ప్రస్తుతం నలుగురితో విస్తరించే యోచన
- తెరపైకి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేరు
- వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు చోటు!
- టీపీసీసీకి తొలుత వర్కింగ్ ప్రెసిడెంట్లు, అధికార ప్రతినిధుల నియామకం
- ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకానికి మరికొంత సమయం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణపై ఆ పార్టీ అధిష్ఠానం వద్ద మరోమారు కదలిక వచ్చింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లినప్పుడు పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్‌తో జరిగిన సమావేశంలో టీపీసీసీ కార్యవర్గంతోపాటు మంత్రివర్గ విస్తరణపైనా చర్చించారు. ఈ రెండు అంశాలపై నలుగురి అభిప్రాయాలనూ కేసీ వేణుగోపాల్ తీసుకున్నారు. వారి అభిప్రాయాలు, అధిష్ఠానం

మిగతా 12వ పేజీలో...

మాదిగలకు మేలే లక్ష్యం

అందుకే వర్గీకరణ చేపట్టాం.. మందకృష్ణతో సీఎం

కులాల కూర్పులో శాస్త్రీయత పాటించలేదు 13

ఎస్సీలను 4 గ్రూపులుగా వర్గీకరించాలి: మందకృష్ణ

బీర్ల ధరలు పెరిగాయ్

సగటున ఒక్కో బీరు ధర రూ.35 పెంపు

ప్రభుత్వానికి ప్రతి నెలా 150 కోట్ల అదనపు రాబడి



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీర్ల ధరల పెంపు అమలులోకి వచ్చింది. గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ)పై 15 శాతం పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇవ్వగా మంగళవారం నుంచే కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ధరలను 15 శాతం పెంచిన తర్వాత వచ్చిన మొత్తాన్ని దగ్గరి రూపాయికి సవరించుకోవచ్చునని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ధరలను దగ్గరి దశాంశానికి సవరించారు. దీంతో ధరలు భారీగా

మిగతా 12వ పేజీలో...



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేత టి. రాజయ్య

ఉప ఎన్నికలు ఖాయం

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఓటమి తప్పదు.. కడియంపై రాజయ్య గెలుస్తారు

త్వరలో రాష్ట్రమంతా పర్యటిస్తా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా సమయమిచ్చాం

ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలే.. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుంది: కేసీఆర్

ప్రజలు తిడుతున్నా.. రేవంత్‌కు రోషం లేదు

వేరే వాళ్లు ఎవరైనా బకెట్ నీళ్లలో దూకి చచ్చేవాడు

ప్రతి కాంట్రాక్టును ఆ మంత్రికి అప్పగిస్తున్నారు

కాంగ్రెస్ సర్కార్ బీసీలను మోసగించింది: కేటీఆర్ 12

హరీశ్‌రావు పాదయాత్ర

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల్ని పూర్తి చేయాలనే డిమాండ్‌తో..

ఆ ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో వారం రోజులు.. 130 కి.మీ.

స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఆధారంగా పాదయాత్ర తేదీలు

గ్రామాల్లో రోజుకో సభ.. చివరి రోజు కేసీఆర్ హాజరు 12

మర్కుక్/హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతోపాటు పార్టీ శ్రేణులు వచ్చారు. వారితో కేసీఆర్ మాట్లాడుతూ.. ఉప ఎన్నికల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఓటమి చవిచూడాల్సిందేనని, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరిపై రాజయ్య విజయం సాధించి మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తారని చెప్పారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారిందన్నారు. ఫిబ్రవరి చివరిలో గజ్వేల్‌లో నిర్వహించబోయే భారీ సభ మొదలుకొని రాష్ట్రమంతా పర్యటిస్తానని, నియోజకవర్గాల వారీగా ప్రజలను కలుస్తానని, నాయకులెవరూ నిరుత్సాహపడవద్దని చెప్పారు. ఇన్ని రోజులు మౌనంగా, ఓర్పుగా చూస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా సమయం ఇచ్చామని, కానీ ప్రజలకు వారు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజల గొంతుకగా మళ్లీ ప్రజల్లోకి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, బెదిరింపులకు భయపడాల్సిన పనిలేదని నూటికి నూరు శాతం మళ్లీ మన ప్రభుత్వమే వస్తుందని, ప్రజలకు ఏం కోల్పోయారో అర్థమైందని ఆయన అన్నారు.

బినామీలకు పరిహారం!



'ఫార్మా సిటీ' భూసేకరణలో వెలుగులోకి అక్రమాలు

భూ పరిహారం లబ్ధిదారుల్లో పలువురు బినామీలే!

గత ప్రభుత్వంలో అధికారులపై ఒత్తిడి చేసి బినామీలకు పరిహారం ఇప్పించిన నేతలు

సమాచారం సేకరిస్తున్న అధికారులు

పరిహారంతో పాటు ప్లాట్ల రికవరీకి చర్యలు

యాచారం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూసేకరణలో బినామీ పేర్లతో పరిహారం, ప్లాటు పొందిన వారి నుంచి రికవరీ చేయడానికి టీజీఐఐసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. అక్రమంగా లబ్ధి పొందిన వారి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఫార్మాసిటీకి భూసేకరణ సమయంలో ఆందోళనలు చేస్తూనే గుట్టుగా బినామీలు పరిహారం కింద పొందిన డబ్బు, ప్లాట్‌ను తిరిగి రాబట్టాలని రాష్ట్ర ప్రభుత్వం టీజీఐఐసీ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సంబంధిత అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లో ఫార్మా సిటీ కోసం 19,333 ఎకరాల భూములు సేకరించాల్సి ఉండగా.. యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్ నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఇప్పటికే ప్రభుత్వ అసైన్డ్ భూములు 4000 ఎకరాలను సేకరించారు. పట్టా భూములు 6000 ఎకరాలకు

మిగతా 13వ పేజీలో...

ఆరోగ్యశ్రీలో అక్రమ నియామకాలు!

నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కోఆర్డినేటర్ల భర్తీ

ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో వసూలు 13

రిటైర్డ్ వైద్యుడికీ పోస్టు

దందా వెనుక ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారుల హస్తం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా గుట్టుగా నియామకం

వైద్య మంత్రికి సమాచారం లేకుండానే వ్యవహారం

బర్డ్ ఫ్లూ భయం


ఆంధ్రప్రదేశ్‌లో వైరస్ వ్యాపిస్తున్నట్లు నిర్ధారణ

అప్రమత్తమైన తెలంగాణ

రాష్ట్రవ్యాప్తంగా 24 చెక్‌పోస్టుల ఏర్పాటు

ఏపీ నుంచి వచ్చే కోళ్లను వెనక్కి పంపుతున్న అధికార్లు

బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ అమ్మకాల తగ్గుదల



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్నట్లు అక్కడి అధికారులు నిర్ధారించడంతో తెలంగాణ సర్కారు అప్రమత్తమైంది. పౌల్ట్రీ రైతుల్లో అవగాహన కల్పించాలని, వ్యాధి సోకిన కోళ్లు రాష్ట్రంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు పశు సంవర్ధక శాఖ సూచించింది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన

మిగతా 14వ పేజీలో...



2

హెచ్ఏఎల్ మీద నమ్మకం లేదు!

ఆ సంస్థ మిషన్‌మోడ్‌తో పని చేయటం లేదు

11 తేజస్ ఎంకే1ఏలు సిద్ధం చేస్తామన్నారు

ఒక్కటీ కాలేదు.. సాఫ్ట్‌వేర్ మార్పులతో సరిపోదు

పనితీరులో సమూల మార్పు రావాలి

వాయుసేన చీఫ్ అమర్‌ప్రీత్‌సింగ్ తీవ్ర వ్యాఖ్యలు

అమెరికాలో ట్రంపొచ్చె..
మార్కెట్ పాయె!

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతులపై సుంకాల కొరడా ఝుళిపిస్తుండడంతో ప్రపంచం యావత్తూ బెంబేలెత్తిపోతోంది. కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం సుంకాలు కొరడా ఝుళిపించడం.. చైనాపై 10% అదనపు సుంకాలు వేస్తాననడం.. ఆయా దేశాలూ ప్రతిచర్యలకు దిగడం.. ఇలా ఒకదాని వెంట మరొకటిగా జరుగుతున్న పరిణామాల ప్రభావంతో.. ఒక్క అమెరికా మార్కెట్లే కాదు, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు గురవుతున్నాయి. భారీగా నష్టాల బారిన పడుతున్నాయి. గడిచిన రెండేళ్లుగా జోరుగా దూసుకుపోయిన డౌజోన్స్, ఎస్ అండ్ పీ 500, నాస్‌డాక్ సూచీలు, అమెరికా కంపెనీల షేర్ల ధరలు ఇప్పుడు కుదేలవుతున్నాయి. మన ఈక్విటీ మార్కెట్‌నే తీసుకుంటే.. ఈ ఏడాది జనవరి 20న ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మంగళవారం వరకు.. అంటే 22 రోజుల్లో నికరంగా సెన్సెక్స్ 779.84 పాయింట్లు, నిఫ్టీ 272.95 పాయింట్లు నష్టపోయాయి. దీంతో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.23.07 లక్షల కోట్లకు పైగా పతనమైంది. జనవరి 20న రూ.431.59 లక్షల కోట్లున్న మార్కెట్ విలువ మంగళవారం మార్కెట్ ముగిసే సమయానికి రూ.408.52 లక్షల కోట్లకు పడిపోయింది. ఇరవై రెండు రోజుల్లో రూ.23 లక్షల కోట్లు నష్టం అంటే.. సగటున రోజుకు లక్ష కోట్ల రూపాయలకు పైగా సొమ్ము ఆవిరైపోయింది. ఇక చిన్న, మధ్య శ్రేణి కంపెనీల షేర్లయితే 40 శాతం వరకు దిగజారాయని అంచనా.

మాగా దెబ్బకు..

ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) నినాదం అందుకున్నారు. ఇందుకోసం చైనాతో పాటు దాదాపు అన్ని దేశాల దిగుమతులపైనా సుంకాలు పెంచేశారు. తాజాగా స్టీలు, అల్యూమినియం దిగుమతులపైనా 25 శాతం సుంకం విధించారు. ఇది చాలదన్నట్టు వచ్చే రెండు మూడు రోజుల్లో కొన్ని దేశాల దిగుమతులపై ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు. సోమ, మంగళవారాల్లో మార్కెట్ పతనానికి ఈ హెచ్చరికలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. సోమ, మంగళవారాల్లోనే కాదు.. మన స్టాక్ మార్కెట్ వరుసగా ఐదు సెషన్లుగా అమ్మకాలతో హోరెత్తిపోతోంది. మంగళవారం సెన్సెక్స్ 1,018.20 పాయింట్ల నష్టంతో 76,293.60 స్థాయికి దిగజారగా... నిఫ్టీ 309.80 పాయింట్ల నష్టంతో 23,071.80 వద్ద ముగిసింది. గత రెండు వారాల్లో సెన్సెక్స్ ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 29, నిఫ్టీలోని 50 కంపెనీల షేర్లలో 44 మంగళవారం నష్టాలతో ముగిశాయి. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజే రూ.9.29 లక్షల కోట్లు కోసుకుపోయి రూ.408.52 లక్షల కోట్లకు చేరింది. గత 5రోజుల నష్టాలను పరిగణనలోకి తీసుకుంటే మొత్తం రూ.16.97 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. గత ఐదు సెషన్స్‌లో సెన్సెక్స్ 2,290.21 పాయింట్లు, నిఫ్టీ 667.45 పాయింట్లు నష్టపోయాయి.

విదేశీ మదుపర్లు వెనక్కి...

మన దేశంలో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) అమ్మకాలు కూడా మార్కెట్ పతనానికి ప్రధాన కారణం. 2024 సెప్టెంబరు త్రైమాసిక వృద్ధిరేటు నీరసించినప్పటి నుంచే ఈ సంస్థలు అమ్మకాలకు లాకులెత్తాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎఫ్‌పీఐలు దాదాపు రూ.85,841 కోట్ల పెట్టుబడులను మన మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్నట్టు అంచనా. డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒక స్థాయి వద్ద స్థిరపడే వరకూ ఈ సంస్థల అమ్మకాలు ఆగక పోవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. మార్కెట్లు ఇలా నష్టాల్లో ఉండడంతో.. తమ అవసరాలకు షేర్లు అమ్మి సొమ్ము చేసుకుందామనుకునేవారికి ఇబ్బందికర పరిస్థితి. కొత్తగా కొందామనుకునేవారికి కూడా భవిష్యత్తుపై భరోసా లేని దుస్థితి!! ఈ పరిస్థితి ఇప్పటికే పరిమితం కాదని.. ట్రంప్ అత్యుత్సాహం, తెంపరితనం తగ్గేవరకు ఇలాగే కొనసాగే ప్రమాదం ఉందనే ఆందోళన ఇన్వెస్టర్లలో వ్యక్తమవుతోంది. - బిజినెస్ డెస్క్, ఆంధ్రజ్యోతి

ఆ ఎంజైమ్‌ను అడ్డుకుంటే క్యాన్సర్‌కు చెక్!

» కీలక ఎంజైమ్‌ను గుర్తించిన దక్షిణ కొరియా శాస్త్రజ్ఞులు

సోల్, ఫిబ్రవరి 11: శరీరంలో ఉండే ఆరోగ్యవంతమైన కణాలు.. క్యాన్సర్ కణాలుగా మారకుండా ఆపే ప్రక్రియను నిరోధించే ఒక ఎంజైమ్‌ను దక్షిణ కొరియా శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఆ ఎంజైమ్‌ను నిరోధించడం ద్వారా.. క్యాన్సర్ కణాలు తిరిగి సాధారణ కణాలుగా మారుతాయని ప్రయోగశాలలో వారు చేసిన పరిశోధనల్లో తేలింది! మానవాళికి పెనుముప్పుగా మారిన క్యాన్సర్ మహమ్మారిపై ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞులు సాగిస్తున్న పోరులో కీలక మైలురాయిగా నిలిచిపోయే ప్రయోగమిది. శరీరంలో క్యాన్సర్ కణాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే.. వాటిని తొలగించడానికి ఇప్పటిదాకా ఉన్న పద్ధతులు శస్త్రచికిత్స, కీమో థెరపీ, రేడియేషన్ థెరపీ. ఇటీవలికాలంలో ఇమ్యూనోథెరపీ కూడా అందుబాటులోకి వచ్చింది. అయితే.. వీటివల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. ఆ దుష్ప్రభావాలతో పోలిస్తే.. వాటివల్ల కలిగే మేలే ఎక్కువ కాబట్టి వైద్యనిపుణులు ఈ చికిత్సలను చేస్తూ వస్తున్నారు. అయితే, దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు దీనికి భిన్నంగా ఆలోచించారు. సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారాక చికిత్స చేసే కంటే.. అసలు అవి ఎందుకు క్యాన్సర్ కణాలుగా మారుతున్నాయో గుర్తించి, అలా మారకుండా అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. పెద్దపేగు క్యాన్సర్‌కు సంబంధించిన కణాలను సేకరించి.. వాటితో ప్రయోగశాలలో చిన్నచిన్న కణితులను అభివృద్ధి చేశారు. వాటిని మినీ ట్యూమర్లు లేదా 'ఆర్గనాయిడ్'లుగా వ్యవహరిస్తారు. శరీరంలో ఉండే సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారడం అకస్మాత్తుగా జరిగిపోయే పని కాదు. ఆరోగ్యంగా ఉండే కణాల డీఎన్ఏలో క్రమంగా మార్పులు జరుగుతూ కాలక్రమంలో అవి క్యాన్సర్ కణాలుగా మారుతాయి. అయితే, సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారేలా చేసే ప్రొటీన్లను నాశనం చేసే వ్యవస్థ పనిచేయకుండా అడ్డుకుంటున్న ఎంజైమ్‌ను కొరియా శాస్త్రజ్ఞులు గుర్తించారు. ప్రయోగంలో భాగంగా తాము ల్యాబ్‌లో పెంచిన ఆర్గనాయిడ్లలో ఆ ఎంజైమ్‌ను నిరోధించారు. అంతే.. ఆ క్యాన్సర్ కణాల (ఆర్గనాయిడ్ల) పెరుగుదల ఆగడమే కాక, అవి మళ్లీ సాధారణ కణాలుగా మారాయని వారు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రయోగాల దశలో ఉన్న ఈ చికిత్స భవిష్యత్తులో క్యాన్సర్ ట్రీట్‌మెంట్ గతినే మార్చేస్తుందని అమెరికాకు చెందిన ప్రముఖ ఆంకాలజిస్టు డాక్టర్ టిఫనీ ట్రోసో శాండోవల్ అభిప్రాయపడ్డారు.

అవినీతి సూచీలో భారత్‌కు 96వ ర్యాంకు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: అవినీతి సూచీలో భారత్‌కు 96వ ర్యాంకు లభించింది. 2024లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 180 దేశాల్లో అధ్యయనం చేసి 'అవినీతి గోచరత సూచీ'ని రూపొందించింది. 100 మార్కులు వస్తే అత్యంత స్వచ్ఛమైన దేశంగా పరిగణించింది. తక్కువ అవినీతి ఉన్న దేశాల్లో... మొదటి స్థానంలో డెన్మార్క్, రెండో స్థానంలో ఫిన్‌లాండ్, మూడో స్థానంలో సింగపూర్ నిలిచాయి. భారత్ 38 మార్కులు సంపాదించి 96వ ర్యాంకు పొందింది. గత ఏడాదితో పోల్చితే అవినీతి ఒక్క పాయింటు తగ్గడం గమనార్హం. 2023లో 39 పాయింట్లు, 2022లో 40 పాయింట్లు వచ్చాయి. పాకిస్థాన్ 135, శ్రీలంక 121, బంగ్లాదేశ్ 149, చైనా 76వ ర్యాంకులు పొందాయి.

బాంబు పేలి ఇద్దరు జవాన్ల మృతి

» వీరిలో ఒకరు ఆర్మీ కెప్టెన్.. జమ్మూ-కశ్మీర్‌లో ఘటన

శ్రీనగర్, ఫిబ్రవరి 11: జమ్మూ-కశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లో మంగళవారం బాంబు పేలి ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. రాజౌరీ జిల్లా లాలెయిలీ గ్రామం సమీపంలోని సరిహద్దు కంచె వద్ద వైట్ నైట్ కార్ప్స్ విభాగానికి చెందిన జవాన్లు గస్తీ తిరుగుతున్న సమయంలో ఐఈడీ పేలుడు పదార్థంగా అనుమానిస్తున్న బాంబు పేలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు జవాన్లు మరణించినట్టు సైన్యం తెలిపింది. వీరిలో ఒకరు ఆర్మీ కెప్టెన్ కావడం గమనార్హం. చనిపోయిన వారిని కెప్టెన్ కరంజీత్ సింగ్ బక్షీ, నాయక్ ముకేష్‌గా గుర్తించారు. తీవ్రవాదులను పట్టుకునేందుకు సైన్యం గాలింపు చర్యలు చేపట్టింది. మరో సంఘటనలో.. అఖ్నూర్ సెక్టారులోనే దొరికిన మోర్టార్ షెల్‌ను బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్ నిర్వీర్యం చేసింది.

అదానీకి ట్రంప్ అండ!

(మొదటి పేజీ తరువాయి)



చర్యలను సమీక్షించాలని.. చట్టం అమలుకు కొత్త మార్గదర్శకాలు తీసుకురావాలని కొత్త అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆదేశించారు. ఈ ఆదేశాలతో స్టాక్‌మార్కెట్లలో అదానీ గ్రూపునకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ తదితర సంస్థల షేర్ల ధరలు మంగళవారం ఒక్కసారిగా పుంజుకున్నాయి. ప్రధాని మోదీ బుధవారం అమెరికా పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ట్రంప్ నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం ఆంధ్ర, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీరు అధికారులకు అదానీ గ్రీన్ సంస్థ రూ.2,100 కోట్లు ముడుపులుగా ఇచ్చిందని.. లంచాల వ్యతిరేక చట్టాలకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చి.. ఈ ప్రాజెక్టుల కోసం అమెరికాలో అదానీ గ్రూపు రుణసేకరణ చేసిందని.. ఇది వంచనే నంటూ గౌతమ్ అదానీ, ఆయన సమీప బంధువు సాగర్ అదానీ, మరో ఏడుగురు అదానీ గ్రీన్ అధికారులపై గత ఏడాది జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా న్యాయశాఖ గత ఏడాది నవంబరులో అభియోగాలు నమోదు చేయడం.. ఇవన్నీ నిరాధార ఆరోపణలని అదానీ గ్రూపు ఖండించడం.. అదానీపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)తో విచారణ జరపాలంటూ భారత పార్లమెంటును ప్రతిపక్షాలు స్తంభింపజేయడం తెలిసిందే. 2021 రెండో అర్ధభాగంలో ఈ ముడుపుల భాగోతం చోటుచేసుకుందని నాడు అమెరికా న్యాయశాఖ పేర్కొంది. అప్పట్లో ఏపీలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ఒడిశాలో బిజూ జనతాదళ్, తమిళనాట డీఎంకే, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో అంటే.. బీజేపీ పాలనలో ఉన్నట్లు లెక్క.. ఎఫ్‌సీపీఏ కింద ప్రాసిక్యూషన్‌ను ఆపేస్తూ ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం పరిధిని బట్టి అదానీ కేసులను ప్రభావితం చేసే అవకాశం ఉందని న్యాయనిపుణులు అంటున్నారు.

హిండెన్‌బర్గ్ ఆరోపణల సంగతేంటి..?

తన గ్రూపు షేర్ల ధరను పెంచుకోవడానికి అదానీ స్టాక్‌మార్కెట్లలో అవకతవకలకు, కార్పొరేట్ మోసాలకు పాల్పడ్డారని అమెరికాకు చెందిన 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ 2022లో చేసిన ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపాయి. అదానీ గ్రూపు షేర్ల ధరలు దారుణంగా పతనమయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) దర్యాప్తు కూడా చేసింది (ఇటీవలే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థను మూసివేస్తున్నట్లు ప్రకటించారు). జేపీసీతో విచారణ జరిపించాలని నాటి నుంచి విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నా.. మోదీ ప్రభుత్వం అంగీకరించలేదు. ఆ తర్వాత ముడుపుల అభియోగాలపై అదానీలపై అమెరికాలో అభియోగాలు నమోదైన తర్వాత కూడా విచారణకు సమ్మతించలేదు. హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ఎఫ్‌సీపీఏ కింద దర్యాప్తు చేయాలని అమెరికన్ అధికారులు గనుక భావిస్తూ ఉంటే.. ఇప్పుడు ట్రంప్ నిర్ణయంతో అదానీలపై చట్టపరమైన చర్యలు ఆలస్యం కావచ్చని.. లేదంటే కేసు బలహీనపడే అవకాశమూ ఉందంటున్నారు. అటు భారతీయ ఏజెన్సీలు సెబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ఈ అంశంలో ముందడుగు వేయరాదని అనుకుంటే.. న్యాయపరమైన సమస్యల నుంచి గౌతమ్ అదానీ బయటపడినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే అంత మాత్రాన ఆయన అంతర్జాతీయ స్క్రూటినీ నుంచి తప్పించుకోలేరని. బ్రిటన్, యూరోపియన్ యూనియన్, ఇతర ప్రపంచ మార్కెట్లు ఆయన గ్రూపుపై నిఘా మానవని వ్యాఖ్యానిస్తున్నారు.

ఎఫ్‌సీపీఏ అంటే..

అమెరికాలో లిస్టయిన కంపెనీలు, అధికారులు, వ్యక్తులు, విదేశీ సంస్థలు.. బిజినెస్ ఒప్పందాల కోసం విదేశీ అధికారులకు లంచాలు ఎరచూపడాన్ని నిషేధిస్తూ 1977లో అమెరికా ఎఫ్‌సీపీఏ చట్టం తీసుకొచ్చింది. దీనిప్రకారం.. మోసాలను నివారించేందుకు కచ్చితమైన ఆర్థిక రికార్డులను చూపించడం కూడా వ్యాపార సంస్థలకు తప్పనిసరి. ఈ చట్టం కింద భారీ స్థాయి కార్పొరేట్ మోసాలపై అమెరికన్ ఏజెన్సీలు ప్రాసిక్యూట్ చేశాయి కూడా. అయితే ఈ చట్టాన్ని అతిగా అమలు చేయడం వల్ల అమెరికన్ కంపెనీలకు నష్టం వాటిల్లిందని ట్రంప్ గట్టిగా భావిస్తున్నారు.

అదానీపై చర్యలొద్దు: అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు

గౌతమ్ అదానీపై అమెరికా న్యాయశాఖ మోపిన అభియోగాలపై పునరాలోచన చేయాలని ఆరుగురు అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు అటార్నీ జనరల్ పామ్ బోండీని అభ్యర్థించారు. ఆయన్ను ప్రాసిక్యూట్ చేస్తే అమెరికా-భారత్ సంబంధాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇండియాతో పటిష్ఠ ద్వైపాక్షిక సంబంధాల కొనసాగింపు ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు. బైడెన్ హయాంలో న్యాయశాఖ అదానీపై చేపట్టిన చర్యలను ప్రశ్నించారు. 'దశాబ్దాలుగా భారత్ మనకు ముఖ్యమైన మిత్రదేశం. రాజకీయాలు, వాణిజ్యం, ఎకానమీకి విఎంచి.. రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల నడుమ సామాజిక-సాంస్కృతిక బంధంగా రూపాంతరం చెందింది. ఈ చారిత్రక భాగస్వామ్యం, మిత్రుల మధ్య నిరంతర సంప్రదింపుల ప్రక్రియ.. బైడెన్ యంత్రాంగం తీసుకున్న కొన్ని తెలివితక్కువ నిర్ణయాల వల్ల ప్రమాదంలో పడింది' అని వారు పేర్కొన్నారు.

హజ్ యాత్రకు పిల్లల్ని అనుమతించం!

» హజ్ యాత్ర-2025 నిబంధనలు విడుదల చేసిన సౌదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: సౌదీ అరేబియా ప్రభుత్వం హజ్ యాత్ర-2025 నిబంధనల్లో గణనీయమైన మార్పులు చేసింది. పిల్లలు ఈ యాత్రలో పాల్గొనకుండా నిషేధం విధించింది. హజ్ యాత్రకు వచ్చే భారీ జనసందోహం వల్ల పిల్లలకు ఏ విధమైన ముప్పూ ఏర్పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు హజ్-ఉమ్రా మంత్రిత్వశాఖ తెలిపింది. అలాగే, మొదటి సారిగా వచ్చే యాత్రికులకు హజ్ యాత్ర-2025లో ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొంది. జీవితంలో కనీసం ఒక్కసారైనా హజ్‌యాత్ర చేయాలనే మతపరమైన అంశాన్ని పరిగణనలోకి తీసుకొని మరింతమందికి ఈ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. అలాగే, అనుమతి లేకుండా హజ్‌యాత్రలో పాల్గొనడాన్ని నివారించేందుకు ఈ నెల 1వ తేదీ నుంచి భారత్ సహా 14 దేశాల యాత్రికులకు సింగిల్ ఎంట్రీ వీసాలు మాత్రమే జారీ చేస్తున్నట్టు వివరించింది. దీర్ఘకాలిక వీసాతో దేశంలోకి ప్రవేశించినవారు అనుమతిలేకుండా హజ్‌యాత్రలో పాల్గొనడం వల్ల రద్దీ పెరుగుతుందని పేర్కొంది. దీంతో రద్దీ నియంత్రణ కష్టమై సురక్షా పరమైన మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, యాత్రికులు అధికారిక మార్గాల్లో(చానల్స్)నే పేర్లు నమోదు చేసుకోవాలని, సమస్యల నివారణకు నూతన మార్గదర్శకాలను అనుసరించాలని సూచించింది.. ఆ 14 దేశాలు.. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఇండోనేసియా, ఇరాక్, జోర్డాన్, యెమన్, అల్జీరియా, ఈజిప్ట్, ఇథియోపియా, మొరాకో, నైజీరియా, సూడాన్, తునీసియా దేశాల నుంచి సౌదీ అరేబియాకు వచ్చేవారికి ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సింగిల్ ఎంట్రీ వీసాలు మాత్రమే జారీ చేస్తున్నట్టు సౌదీ ప్రభుత్వం తెలిపింది.

లోకం తీరు



ప్రయాగ్‌రాజ్ నో వెహికిల్ జోన్

మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 11: ప్రయాగ్‌రాజ్ నగరం మొత్తాన్ని అధికారులు వాహన రహిత ప్రాంతం(నో వెహికిల్ జోన్)గా ప్రకటించారు. బుధవారం మాఘ పూర్ణిమను పురస్కరించుకొని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాల కోసం భక్తులు భారీ సంఖ్యలో రావొచ్చన్న అంచనాలు, ఇప్పటికే మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోవడం, ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్లే మార్గాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం 5గంటల నుంచే నో వెహికిల్ జోన్ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాల కోసం ప్రయాగ్‌రాజ్ నగరం వెలుపల ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ రూల్స్ నుంచి ఎమర్జెన్సీ, నిత్యావసర వస్తువులు తీసుకువెళ్లే వాహనాలను మినహాయించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుటుంబసమేతంగా మంగళవారం మహా కుంభమేళాలో పాల్గొన్నారు. పుణ్యస్నానం ఆచరించి యాగం నిర్వహించారు. ఇదిలా ఉండగా, మహాకుంభమేళా జనవరి 13న ప్రారంభమైంది. అప్పటి నుంచి మాఘ పూర్ణిమ మధ్య కాలంలో భక్తులు త్రివేణి సంగమం ఒడ్డునే ఉంటూ ఉపవాసం చేస్తూ, నిష్ఠతో గడుపుతారు. ఇలా చేయడాన్ని పవిత్రంగా భావిస్తారు. దీన్నే కల్పవాస్ అంటారు. ఈ ఏడాది 10లక్షల మందికి పైగా కల్పవాస్ పాటించారు.



సంగమం వద్ద అంబానీ కుటుంబం యాగం

పన్ను చెల్లింపుదారుల డబ్బు వృథా!

» లోక్‌సభలో సంస్కృత అనువాదంపై డీఎంకే ఎంపీ దయానిధి అభ్యంతరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల కోసం లోక్‌సభ ప్రొసీడింగ్స్‌ను సంస్కృతంలోకి అనువదించడం ద్వారా పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేస్తున్నారని డీఎంకే సభ్యుడు దయానిధిమారన్ మంగళవారం అభ్యంతరం తెలిపారు. '2021 జనాభా లెక్కల ప్రకారం సంస్కృతం మాట్లాడేవారు 73 వేలమంది మాత్రమే ఉన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల కోసం పన్ను చెల్లింపుదారుల డబ్బును ఎందుకు వృథా చేయాలి' అన్నారు. దీనిపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. సంస్కృతం భారతదేశ ప్రాథమిక భాష అని తేల్చిచెప్పారు. 'మీరు ఏ దేశంలో నివసిస్తున్నారో? ముందుగా తెలుసుకోండి' అని హితవుపలికారు. సంస్కృతం ఒక్కటే కాదని, గుర్తింపు పొందిన 22 భాషల్లోకి ప్రొసీడింగ్స్‌ను అనువదిస్తున్నట్టు తెలిపారు. కాగా, విభజన రాజకీయాలు చేయడమే వాస్తవంగా పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేయడం అని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఒక భాషను ప్రోత్సహించేందుకు మరో భాషను తక్కువచేసి మాట్లాడాల్సిన అవసరం లేదంటూ దయానిధి మారన్‌కు హితవుపలికారు.

500 కోట్ల మందికి మెడికల్ ఆక్సిజన్ దూరం

ఢిల్లీ, ఫిబ్రవరి 11: ప్రపంచంలో మూడింట రెండు వంతుల మందికి మెడికల్ ఆక్సిజన్ అందుబాటులో లేదు. అంటే సుమారుగా 500 కోట్ల మంది ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ ఆక్సిజన్ దొరకని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. తక్కు, మధ్య ఆదాయ దేశాల్లో ఈ అసమానతలు అత్యధికంగా ఉన్నాయని న్యూ లాన్సెట్ కమిషన్ నివేదిక పేర్కొంది. ఆరోగ్య రంగంలో రోగుల చికిత్సకు మెడికల్ ఆక్సిజన్ అత్యవసరం. సర్జరీ, ఆస్తమా, ట్రామా, చైల్డ్ కేర్ తదితర విభాగాలకు ఇది అత్యంత కీలకం. కొవిడ్ 19 వంటి మహమ్మారిని తట్టుకోవాలంటే మెడికల్ ఆక్సిజన్ నిల్వలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై లాన్సెట్ గ్లోబల్ హెల్త్ మిషన్ ఒక నివేదికను తయారు చేసింది. ప్రపంచంలో మెడికల్ ఆక్సిజన్ పంపిణీలో చోటుచేసుకున్న అసమానతలను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రథమ నివేదిక ఇది.

ఆధార్‌కు 175 కోట్లు చాలు


» 11,385 కోట్లు వృథాగా ఖర్చు పెట్టారు హాట్ మెయిల్ సహ వ్యవస్థాపకుడు సబీర్

ఢిల్లీ, ఫిబ్రవరి 11: 'ఆధార్ ప్రాజెక్టును కేవలం రూ.175.16 కోట్లతో పూర్తి చేయవచ్చు. దాని కోసం వృథాగా రూ.11,385 కోట్లు ఖర్చు చేశారు' అని హాట్ మెయిల్ సహ వ్యవస్థాపకుడు సబీర్ భాటియా అన్నారు. ప్రఖర్ గుప్తా నిర్వహిస్తున్న 'ప్రఖర్ కే ప్రవచన్' టాక్ షోలో ఆధార్ ప్రాజెక్టుపై ఆయన మాట్లాడారు. "ఈ ప్రాజెక్టును నిర్వహించిన వారు సాంకేతిక నిపుణులు కారు. వారికి ఎలాంటి టెక్నాలజీ తెలియదు. వాళ్ల జీవితంలో ఎన్నడూ కోడింగ్ చేయలేదు. అదే అసలు సమస్య" అని అన్నారు.

కుటుంబం గడవడం కష్టమనుకుంటేనే
కారుణ్య నియామకం!

» ఉద్యోగి మరణించిన ప్రతి కేసులోనూ వారసులకు కొలువు ఇవ్వడం సరికాదు!

» సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆ ఉద్యోగం లేకపోతే కుటుంబం గడవడం కష్టమనుకునే వాళ్లకే కారుణ్య నియామకం కింద వారసులకు కొలువు ఇవ్వాలని పేర్కొంది. అంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, కనీస అవసరాలకు కూడా డబ్బు లేక ఇబ్బందులు పడే కుటుంబాల వారికే కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని వ్యాఖ్యానించింది. అంతే తప్ప మరణించిన ఉద్యోగి కుటుంబ జీవన ప్రమాణాలు పడిపోతాయన్న కారణంతో కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఉద్యోగి సంపాదనతోనే కుటుంబం మొత్తం నడుస్తున్న పరిస్థితుల్లో.. ఆ ఉద్యోగి మరణిస్తే, అతని/ఆమె కుటుంబ సభ్యుల్లో అర్హులకు ఉద్యోగం ఇవ్వాలన్నది 'కారుణ్య నియామకం' ఉద్దేశమని వివరించింది. అయితే ఉద్యోగులు చనిపోయిన ప్రతి కేసులోనూ ఇదే సూత్రాన్ని అనుసరించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఉద్యోగి చనిపోయిన కుటుంబాల్లో వేర్వేరు పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు ఉంటాయని.. వాటిని తప్పనిసరిగా అంచనా వేయాలని వ్యాఖ్యానించింది. కెనరా బ్యాంకు ఉద్యోగి పదవీ విరమణ కంటే ముందు 2001లో మరణించగా.. కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగం ఇవ్వాలంటూ ఆయన కుమారుడు అజిత్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. అయితే 'మీ తల్లి గారికి పింఛను వస్తోంది. మీరు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగానికి మీ వయసు మీరిపోయింది' అంటూ బ్యాంకు ఉన్నతాధికారి ఆయన దరఖాస్తును తిరస్కరించారు. దాన్ని సవాలు చేస్తూ అజిత్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. కారుణ్య నియామకం కింద అజిత్‌కుమార్‌కు రెండు నెలల్లోగా ఉద్యోగం ఇవ్వాలని, తగిన సమయంలో ఉద్యోగం ఇవ్వనందుకుగాను పరిహారంగా రూ.5 లక్షలు చెల్లించాలని ఏక సభ్య ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై బ్యాంకు అధికారులు అప్పీలుకు వెళ్లారు. అజిత్‌కుమార్‌కు నెల రోజుల్లో ఉద్యోగం ఇవ్వాలన్న డివిజన్ బెంచ్.. రూ.5 లక్షలు కూడా చెల్లించాలని ఆదేశించింది. ఆ తీర్పుపై బ్యాంకు అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఆ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా 'కారుణ్య నియామకం' పథకం ఉద్దేశంపై చర్చ జరగడంతో పాటు న్యాయమూర్తులు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో జరిగిన తీవ్ర జాప్యాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. కారుణ్య నియామకాన్ని తిరస్కరించిన ఈ కేసులో ఇప్పటికే రెండు దశాబ్దాలు గడిచిపోయాయని పేర్కొంది. అయితే, అప్పట్లో వేసిన లెక్కలు, ఉద్యోగి మరణించిన తర్వాత ఆయన భార్యకు లభించే కుటుంబ పింఛను, మరణానంతరం అందజేసిన సొమ్ములను ధర్మాసనం పరిశీలించింది. వాటిని పరిగణనలోకి తీసుకున్న తర్వాత.. అజిత్‌కుమార్ తండ్రి చనిపోయిన తర్వాత కారుణ్య నియామకం కింద వెంటనే ఉద్యోగం ఇవ్వకపోతే వారి కుటుంబం గడవదన్న పరిస్థితులేమీ లేవని అర్థమవుతోందని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా, మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఏక మొత్తంగా నష్ట పరిహారం ఇచ్చేలా 2005లో ప్రవేశపెట్టిన పథకం కింద అజిత్‌కు రూ.2.5 లక్షలు చెల్లించాలని ధర్మాసనం కెనరా బ్యాంకును ఆదేశించింది. ఈ మొత్తాన్ని 2నెలల్లోగా ఆయనకు అందజేయాలని కోరింది.

ఈవీఎంలలో డాటా తొలగించవద్దు

» ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ఆదేశం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో డాటాను తొలగించడం లేదా జోడించడం చేయవద్దని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈవీఎంల నుంచి డాటాను తొలగించడానికి అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ పద్ధతి ఏమిటో తెలపాలని కూడా నిర్దేశించింది. ఒకవేళ ఎన్నికలలో ఓడిపోయిన అభ్యర్థి కోరితే... ట్యాంపరింగ్ జరగలేదని వివరణ ఇవ్వగలిగేలా ఉండాలని పేర్కొంది. ఏడీఆర్, పలువురు కాంగ్రెస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా ఈవీఎంల నుంచి డాటాను తొలగించవద్దని ఈసీని ఆదేశించాలని పిటిషనర్లు కోరారు.

హెచ్‌ఏఎల్ మీద నమ్మకం లేదు!

ఆ సంస్థ మిషన్‌మోడ్‌తో పని చేయటం లేదు

» 11 తేజస్ ఎంకే1ఏలు సిద్ధం చేస్తామన్నారు.. ఒక్కటీ తయారు కాలేదు

» వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ వ్యాఖ్యలు



బెంగళూరు, ఫిబ్రవరి 11: 'ప్రస్తుతానికైతే నాకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)' మీద నమ్మకం లేదు. సంస్థలో సందర్భానికి తగిన పనితీరు, వేగం (మిషన్ మోడ్) కనిపించటం లేదు'... ఈ మాటలు అన్నది ఎవరో సాధారణ వ్యక్తి కాదు.. ఏకంగా, వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ చేసిన వ్యాఖ్య ఇది. వాయుసేనకు యుద్ధవిమానాలను, హెలికాప్టర్లను అందించే ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హెచ్ఏఎల్ రూపొందించిన హెచ్‌జేటీ-36 యాషాస్ విమానాన్ని ఇటీవల ఆయన తనిఖీ చేశారు. ఆ విమానం కాక్‌పిట్‌లో కూర్చున్నారు. ఆయనతోపాటు హెచ్ఏఎల్ చైర్మన్ డీకే సునీల్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా.. హెచ్ఏఎల్‌పై అమర్‌ప్రీత్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. 'మా అవసరాలు ఏమిటో, మా ఆందోళనలు ఏమిటో మీకు తెలియజేస్తుంటాం. ఆ ఆందోళనలను దూరం చేసి మాలో ఆత్మవిశ్వాసాన్ని నింపే బాధ్యత మీదే. కానీ, ప్రస్తుతానికైతే నాకు హెచ్ఏఎల్ మీద నమ్మకం లేదు. ఇటువంటి పరిస్థితి నెలకొనటం ఎంతమాత్రం సరైనది కాదు' అని తెలిపారు. అమర్‌ప్రీత్ మాట్లాడుతున్న వీడియోను డిఫెన్స్‌న్యూస్ పోర్టల్ 'నేషనల్ డిఫెన్స్' తన యూట్యూబ్ చానల్‌లో పెట్టటంతో ఈ వివరాలు బయటకొచ్చాయి. తేజస్ యుద్ధవిమానాల ఆధునిక రూపమైన తేజస్ ఎంకే1ఏల తయారీలో నెలకొన్న జాప్యంపై ఈ సందర్భంగా అమర్‌ప్రీత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'హెచ్ఏఎల్ మనందరి సంస్థ. అందరమూ ఇక్కడ పని చేసిన వాళ్లమే. నేను ఫిబ్రవరిలో ఇక్కడికి వచ్చినప్పుడు 11 తేజస్ ఎంకే1ఏ విమానాలు సిద్ధంగా ఉంటాయని నాకు హామీ ఇచ్చారు. కానీ, ఒక్కటి కూడా సిద్ధం కాలేదు' అని నిలదీశారు. బెంగళూరు ఏరోఇండియా షోలో హెచ్ఏఎల్ ప్రదర్శించిన తేజస్ ఎంకే1ఏ తేలికపాటి యుద్ధవిమానాలు వాస్తవానికి ఎంకే1ఏ జెట్‌లు కావన్నారు. 'ఎంకే1ఏ పేరుతో నడిపిన ఆ విమానం ఎంకే1ఏ కాదు. ఏదో ఒక సాఫ్ట్‌వేర్‌ను మార్చటం ద్వారానో, లేదంటే రూపంలో కొన్ని మార్పులు చేయటం ద్వారానో అసలు విమానం మారిపోదు. ఆయుధ వ్యవస్థలను జోడించి సామర్థ్యాన్ని పెంచినప్పుడే ఎంకే1ఏ తయారవుతుంది' అని తెలిపారు. దీనికి హెచ్ఏఎల్ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. 'మీరు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. అమర్‌ప్రీత్‌సింగ్ మళ్లీ మాట్లాడుతూ, తాను చెప్పిన మాటలు తప్పని నిరూపిస్తే తనకంటే సంతోషించే వాళ్లుండరని స్పష్టం చేశారు.

ఇద్దరి ప్రాణాలను బలిగొన్న పెద్దమనుషుల తీర్పు!

» భర్తను వదిలేసి ప్రియుడితో వెళ్లిపోయిన మహిళ

» భర్తకు ఆమె 3 లక్షల పరిహారం ఇవ్వాలన్న పెద్దలు

» చెల్లించే స్థోమత లేక ఆమె, ప్రియుడి ఆత్మహత్య

ములుగు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్నవాడిని వదిలేసి, తనకు నచ్చిన వ్యక్తితో ఆమె వెళ్లిపోతే.. పరిహారంగా రూ.3 లక్షలను భర్తకు చెల్లించాల్సి ఉంటుందని ఊర్లో పెద్ద మనుషులు వెలువరించిన తీర్పు రెండు నిండు ప్రాణాలను బలిగొంది. అంత డబ్బు చెల్లించే స్థోమత లేకపోవడం, పరిహారం చెల్లించాల్సిందేనంటూ పెద్ద మనుషులు ఒత్తిడి తేవడంతో ఆ వివాహిత, ఆమె ప్రియుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఆలం అశ్విని (23)కి అదే గ్రామానికి చెందిన ఆలం కిరణ్‌తో ఐదేళ్ల క్రితం పెళ్లయింది. అదే గ్రామానికి చెందిన కిరణ్ సమీప బంధువు వరుసకు మరిది, అవివాహితుడైన ఆలం స్వామి (25)తో అశ్విని వివాహేతర సంబంధం పెట్టుకుంది. వారం క్రితం భర్త కిరణ్‌ను వదిలేసి అశ్విని ఇంట్లోంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి స్వామితో కలిసి అతడి ఇంట్లో ఉంటోంది. దీనిపై ఇటీవల కిరణ్ ఊర్లో పంచాయితీ పెట్టాడు. తనను కాదనుకొని వెళ్లిపోయిన అశ్విని తనకు కూడా అవసరం లేదని.. అయితే తనకు పరిహారంగా రూ.3లక్షలు చెల్లించాలని భర్త డిమాండ్ చేశాడు. పంచాయితీలో కూర్చున్న పెద్ద మనుషులు ఆ మొత్తాన్ని కిరణ్‌కు అశ్విని చెల్లించాలని తీర్మానించారు. తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి, అశ్విని మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. స్వామి తల్లి ఫిర్యాదు మేరకు కన్నాయిగూడెం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత.. ఉపాధ్యాయుల బాధ్యత

» విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి పదో తరగతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడం ఉపాధ్యాయుల బాధ్యత అని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా అన్నారు. విద్యార్థులందరూ పాసయ్యేలా ఉపాధ్యాయులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని కోరారు. పదోతరగతి విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించేందుకు మంగళవారం టీ-శాట్ నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారంలో యోగితా రాణా మాట్లాడారు. విద్యార్థుల బలహీనతలను ఉపాధ్యాయులు గుర్తించి, వాటిని అధిగమించేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 11,544 పాఠశాలల్లో 4,97,240 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నారని ఆమె తెలిపారు.

మే నెలాఖరుకల్లా.. నర్మెట్ట ఆయిల్‌పాం ఫ్యాక్టరీ మొదలవ్వాలి

» అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్ పాం ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తిచేసి, మే నెలాఖరు నాటికి ఆయిల్ పాం గెలల ప్రాసెసింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సహకార, ఉద్యాన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు గద్వాల జిల్లా బీచుపల్లి ఆయిల్ పాం ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విచారణలను త్వరగా పూర్తి చేసి, తేలిన మొత్తాలను వెంటనే రికవరీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఈ సందర్భంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్లు మంత్రి తుమ్మలను కలిశారు. సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ఈ నెలలో ముగియనున్న నేపథ్యంలో, పదవీకాలాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

సీతారామకు సాంకేతిక అనుమతి సాధించాలి..

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు డీపీఆర్‌కు సాంకేతిక అనుమతి సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరారు. సాంకేతిక అనుమతిపై చర్చించడానికిగాను మంగళవారం కేంద్ర జలశక్తి శాఖకు చెందిన సాంకేతిక సలహా కమిటీ సమావేశమవుతున్న నేపథ్యంలో తుమ్మల ఈ సూచన చేశారు.

కులగణనకు వ్యతిరేకంగా మార్చి 9న చలో హైదరాబాద్

వేల మందితో బీసీ కులగణన రణభేరి నిర్వహిస్తాం.. నేటి నుంచి మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు

» తప్పుల తడకగా బీసీ కులగణన లెక్కలు

» స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

» ఈ సర్కారు బీసీ వ్యతిరేకి : వకుళాభరణం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

పంజాగుట్ట, బర్కత్‌పుర, నంగునూరు, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు పోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీల అణిచివేతకు నిరసనగా, డెడికేటెడ్ కమిషన్ నివేదిక, కులగణనను వ్యతిరేకిస్తూ బుధవారం నుంచి మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని.. మార్చి 9న చలో హైదరాబాద్ పేరుతో వేల మందితో బీసీ కులగణన రణభేరి నిర్వహించి ప్రభుత్వానికి సత్తా చూపుతామని హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. తప్పుల తడకలా బీసీ కులగణన లెక్కలున్నాయని, కమిషన్ నివేదిక చిత్తు కాగితంతో సమానమన్నారు. కులగణనలో శాస్త్రీయ విధానాన్ని పాటించలేదని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ మేరకు డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పిస్తుందని ఆశించామన్నారు. బీసీల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందని.. తమతో పెట్టుకుంటే గతంలో జనార్దన్ రెడ్డి, కేసీఆర్‌లను ఇంటికి పంపించినట్టే ఈ ప్రభుత్వాన్ని, సీఎంను ఇంటికి పంపుతామన్నారు. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కె.కేశవరావు తదితరులతో 4 గంటలు చర్చించామని.. కులగణన తప్పులతడక అని వారికి ఆధారాలూ చూపామని, వారు కూడా దానికి అంగీకరించి, సీఎంతో చర్చిస్తామని చెప్పారని అన్నారు. 48 గంటలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో తాము ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామని చెప్పారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నుంచి పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థి పీ రవీందర్, కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ నియోజకవర్గం పట్టభద్రుల అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను గెలిపించి సత్తా చూపుతామన్నారు.

రహస్య నివేదికలో ఆంతర్యమేమిటి?

స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు, కులగణనపై ఏర్పాటు చేసిన భూసాని వెంకటేశం నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ రూపొందించిన నివేదికను రహస్యంగా చీఫ్ సెక్రటరీ శాంతకుమారికి అందజేయడంలో ఆంతర్యం ఏమిటి? అని బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రశ్నించారు. నివేదికను సీఎం తీసుకోకపోవడాన్ని తాము తీవ్రంగా తప్పుపడుతున్నామన్నారు. ఆ నివేదికను వెంటనే వాపసు తీసుకొని నిపుణులు, బీసీ సంఘాల నేతలతో చర్చించి సమగ్రమైన నివేదికను రూపొందించి వాటి వివరాలను బహిర్గతం చేయాలన్నారు. మంగళవారం కాచిగూడలో విలేకరులతో వారు మాట్లాడారు. కులగణనలో బీసీ జనాభా తగ్గించడం వల్ల స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గే ప్రమాదం ఉందన్నారు. బీసీలలోని కులాల వివరాలను ప్రభుత్వం రీసర్వే చేయాలన్నారు. ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తుందని, ఇది బహిర్గతం చేయకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. త్వరలో ఆర్.కృష్ణయ్య సారథ్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించి ఉద్యమ ప్రణాళికను రూపొందిస్తామన్నారు.

గుణపాఠం తప్పదు: హరీశ్ రావు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఇచ్చిన మాట నిలుపుకోకుండా ఎన్నికలకు వెళ్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



చిలుకూరులో రంగరాజన్‌తో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

దాడులను సహించం: మంత్రి శ్రీధర్ బాబు

» చిలుకూరు ప్రధానార్చకులు రంగరాజన్‌కు పరామర్శ

హైదరాబాద్, మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రామరాజ్యం పేరిట జరిగే దాడులను ప్రభుత్వం సహించదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. చిలుకూరుకు మంగళవారం వచ్చిన ఆయన ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిందితుల్లో కొందరిని పోలీసులు అరెస్టు చేశారని, చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద భద్రతను పెంచాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు రంగరాజన్‌ను పరామర్శించారు. కాగా, రామరాజ్యం ముసుగులో రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. మంగళవారం ఆయన రంగరాజన్‌ను పరామర్శించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

14న 'విజయ తెలంగాణ' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మాజీ హోం మంత్రి టి. దేవేందర్‌గౌడ్ రచించిన 'విజయ తెలంగాణ' పుస్తకావిష్కరణ ఈనెల 14 సాయంత్రం 4 గంటలకు జలవిహార్‌లో నిర్వహిస్తున్నట్లు దేవేంద్ర ఫౌండేషన్ నాయకులు, బీజేపీ నేత టి. వీరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు కె.కేశవరావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రాణం తీసిన చీప్ లిక్కర్ !

» మద్యం సేవిస్తూ దినసరి కూలీ మృతి



దౌలత్‌పీర్

గద్వాల క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు పర్మిట్ రూమ్‌లో చీప్ లిక్కర్ తాగుతూ ఓ దినసరి కూలీ అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగింది. గద్వాల మండల పరిధిలోని చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన దినసరి కూలీ దౌలత్‌పీర్ (50) మంగళవారం గద్వాల కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న వరలక్ష్మి వైన్‌షాపులో చీప్ లిక్కర్ (డీకే బ్రాండ్) క్వార్టర్ బాటిల్‌ను కొనుగోలు చేశాడు. పర్మిట్‌రూమ్‌లోకి వెళ్లి తాగుతూ కిందపడి కాళ్లు, చేతులు కొట్టుకుంటూ మృతి చెందాడు. పోలీసులు మద్యం నమూనాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య అన్ను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, కూలీ దౌలత్ పీర్ మరణానికి కల్తీ మద్యమే కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కొందరు నకిలీ మద్యం తయారు చేసి దుకాణాలకు సరఫరా చేసిన ఘటనలు గతంలో వెలుగుచూశాయి. కే.టీ.దొడ్డి మండల పరిధిలోని పాతపాలెం గ్రామానికి చెందిన కొందరు నకిలీ మద్యం తయారు చేసిన ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.

బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం

» నిధులు తేవడంలో తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు విఫలం : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని, నిధులు తెప్పించడంలో విఫలమైన తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రం నుంచి బీజేపీకి చెందిన 8మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తూ కూడా నిధులు రాబట్టలేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి తగినన్ని నిధులు విడుదల చేయించాలని, లేనిపక్షంలో ప్రజలు వెంటపడి తరిమికొడతారని కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలను హెచ్చరించారు.

ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డుల్లో తనిఖీలు చెయ్యండి

తనిఖీలకు రెవెన్యూ, పోలీసు అధికారులతో బృందాలు

» ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు పకడ్బందీ చర్యలు: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

హైదరాబాద్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అన్ని ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డుల్లో తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఇసుక లభ్యతపై ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో సీఎస్ శాంతి కుమారి మంగళవారం గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదే సందర్భంలో భూపాలపల్లి-జయశంకర్, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సరిపడా ఇసుక అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. తనిఖీ బృందాల్లో ఆర్‌డీవోలు, డీఎస్పీ స్థాయి అధికారులు ఉండాలని, ఆయా బృందాలను రీచ్‌లు, స్టాక్ యార్డులను స్వయంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రధాన ఇసుక మార్కెట్లకు వెళ్లే రహదారులను గుర్తించి పోలీసు, రవాణా శాఖ అధికారులతో రోడ్డు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల కోసం సంబంధిత శాఖలతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, మైనింగ్ డైరెక్టర్ శశాంక, టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు.. వాహనాల సీజ్, 32 మంది అరెస్టు

సంగారెడ్డి క్రైం, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, బ్యాతోల్ గ్రామ శివారుల్లోని ఇసుక ఫిల్టర్ స్థావరాలపై సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు.



ఇసుక ఫిల్టర్‌ను కూల్చివేస్తున్న పోలీసులు

ఇస్మాయిల్‌ఖాన్‌పేట శివారులోని ఇసుక ఫిల్టర్ వద్ద ఐదు ఎక్సకవేటర్లు, 5 ట్రాక్టర్లు, ట్రాలీ, పది ట్రాక్టర్ ఇంజన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాతోల్ శివారులోని ఇసుక ఫిల్టర్ వద్ద 3 ఎక్సకవేటర్లు సీజ్ చేశారు. అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్న 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా ఇసుక ఫిల్టర్ స్థావరాలను ఏర్పాటు చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని జిల్లా ఎస్పీ రూపేష్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించండి : ఇసుక లారీ సంఘాల జేఏసీ

మన్సూరాబాద్(ఆంధ్రజ్యోతి): ఇసుక లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ సంఘాల జేఏసీ కోరింది. తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ సంఘాల జేఏసీ.. మన్సూరాబాద్‌లో మంగళవారం సమావేశమైంది. నర్రి వెంకన్న అధ్యతన జరిగిన సమావేశంలో లారీ సంఘాల నాయకులు సుర్వి యాదయ్య గౌడ్, సలావుద్దీన్ మాట్లాడుతూ ఇసుక క్వారీల్లో అక్రమ వసూళ్లను అరికట్టాలని అన్నారు. ఓవర్ లోడ్ నింపే కాంట్రాక్టర్లపై కేసు నమోదు చేయాలని, ఇసుక అమ్మకాలలో బ్రోకర్ వ్యవస్థను నిర్మూలించాలని, ఇసుక రీచ్‌ల వద్ద రవాణా, మైనింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఇసుక పాలసీని కొనసాగించాలని కోరారు.

ములుగు మన్నెంలో జాతరల సందడి

మేడారంలో నేటి నుంచి చిన్న జాతర

» ఏటూరు నాగారం, కన్నాయిగూడెం, మంగపేటలో వేడుకలు

» రూ.4 కోట్లతో ప్రభుత్వం ఏర్పాట్లు

ములుగు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ములుగు ఏజెన్సీలో జాతరల సందడి నెలకొంది. ఆదివాసీలు తమ ఇలవేల్పులను కొలుచుకొనే వేడుకలతో గూడేలు పండగ వాతావరణం సంతరించుకున్నాయి. తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ చిన్నజాతర బుధవారం ప్రారంభం కానుంది. ఈ నెల 15 వరకు నాలుగు రోజులపాటు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. తొలిరోజు సమ్మక్క కొలువైన మేడారంతోపాటు సారలమ్మ కొలువుదీరిన కన్నెపల్లిలోని పూజా మందిరాలను శుద్ధిచేసి అలుకుపూతలు చేస్తారు. గ్రామాలకు ద్వారబంధనం విధించి పొలిమేర దేవతలకు పూజలు నిర్వహిస్తారు. రాత్రివేళ వనదేవతల గద్దెల వద్ద పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి జాగరణ చేస్తారు. వనదేవతలుగా కీర్తించబడుతున్న సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, నాగులమ్మ నడయాడిన అడవి పల్లెల్లో అక్కడి గిరిజనులు అనుబంధ జాతరలను జరుపుతున్నారు. సమ్మక్కకు పుట్టినిల్లయిన తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో కూడా బుధవారం నుంచే జాతర జరగనుంది. తమ ఆడబిడ్డగా కొలుచుకునే చందా వంశీయులు సమీపంలోని గుట్ట నుంచి సమ్మక్కను గద్దెపైకి చేర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఏటూరునాగారం మండలం కొండాయిలో గోవిందరాజులు, నాగులమ్మ, దొడ్లలో సారలమ్మ, కన్నాయిగూడెం మండలం ఐలాపూర్‌లో సమ్మక్క, సారలమ్మ, మంగపేట మండలం జబ్బోనిగూడెం నెమళ్లగుట్టపై సమ్మక్క జాతర బుధవారం నుంచి మొదలై నాలుగు రోజులు జరగనుంది. మేడారంలో జరిగే చిన్నజాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4కోట్లతో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్టీసీ హనుమకొండ బస్టాండు నుంచి వారంపాటు వంద ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ నేతృత్వం లో ఇద్దరు అదనపు ఎస్పీలు, డీఎస్పీ, 12 మంది సీఐలు, 30 మంది ఎస్సైలతోపాటు 600 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు.

జాతరపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్..!

మేడారం జాతరలో కోడిని గద్దెల వైపు ఎగురవేసి ఎదురుకోళ్ల మొక్కు సమర్పిస్తారు. అక్కడే విడిది చేసి వండుకొని బంధుమిత్రులతో విందు చేసుకుంటారు. అయితే.. పలు జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుండటం, ప్రభుత్వం అప్రమత్తమై కొద్దిరోజులు చికెన్ తినొద్దని సూచిస్తున్న నేపథ్యంలో చిన్న జాతరపై ప్రభావం పడనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీరేన్ తరువాత...

మణిపూర్ మండిపోతున్నప్పుడూ, ఊచకోతలు ఎడతెగకుండా సాగుతున్నప్పుడే బీరేన్ రాజీనామా చేసివుంటే మరింత బాగుండేది. విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో తమ ముఖ్యమంత్రి ఓడిపోవడం ఖాయమన్న భయంతో బీజేపీ పెద్దలు ముందే ఆయనను గద్దెదింపేశారు. అధిష్ఠానం ఆశీస్సులు ఏమాత్రం ఉన్నా తిమ్మినిబమ్మిని చేసి అధికారంలో కొనసాగగల సమర్థత బీరేన్‌కు లేకపోలేదు. కానీ, స్పీకర్ కేంద్రంగా సొంతపార్టీలో అసమ్మతి రాజుకుంటున్నప్పుడు ఎత్తులు వేయగల, ఎవరినీ నమ్మగల స్థితిలో పార్టీ అధిష్ఠానమే లేదు. మీతీలను ఆయుధాలు దోచుకోనివ్వండి, లూటీలు చేయనివ్వండి అని పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించింది నిజమేనని సుప్రీంకోర్టుకు సమర్పించిన ఫోరెన్సిక్ నివేదిక తేల్చిన తరువాత కూడా ఆయనను కొనసాగనివ్వడానికి చాలామంది బీజేపీ ఎమ్మెల్యేలు సిద్ధంగా లేరు. విపక్షంతో చేతులు కలిపి, వారంతా బీరేన్‌ను దింపివేసినపక్షంలో పార్టీ పెద్దలకు అంతకంటే అవమానం ఇంకేమీ ఉండదు. తెగల మధ్య తగవులుపెట్టి 650రోజులపాటు రాష్ట్రాన్ని రగల్చిన బీరేన్ సింగ్ చివరకు హోంమంత్రి దర్శనం కరువై, మహాకుంభమేళాలో మునిగి, బలవంతపు రాజీనామాతో నిష్క్రమించాల్సి వచ్చింది.

21నెలల హింసారిరంసల అనంతరం ఆయనను వదల్చుకున్న పార్టీ అధిష్ఠానం తెలివిగా అవిశ్వాస తీర్మానానికి ముందే ఆయనను దింపివేసి, వెనువెంటనే అసెంబ్లీ సమావేశాలనూ రద్దుచేసింది. రెండు సమావేశాల మధ్య గడువు ఆర్నెల్లకంటే ఎక్కువ ఉండకూడదని మీకు తెలియదా? అని ఢిల్లీ కాంగ్రెస్ నేతలు మణిపూర్ గవర్నర్‌ను ప్రశ్నిస్తున్నారు. సమావేశాల రద్దు రాజ్యాంగ విరుద్ధం కావచ్చునేమో కానీ, బీరేన్ రాజీనామా తరువాత కూడా రాష్ట్రమూ, రాజకీయమూ విపక్షాల చేతుల్లోకి పోకుండా బీజేపీ ఇలా జాగ్రత్తపడింది. బీరేన్ స్థానంలో ఎవరిని నియమించాలో బీజేపీ ఇంకా తేల్చుకోలేదని, సంబిత్ పాత్ర చర్చోపచర్చలు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. రాష్ట్రం చేజారిపోకుండా ముందే జాగ్రత్తపడిన అధిష్ఠానం బీరేన్‌స్థానంలో ఎవరినీ కూచోబెట్టబోవడం లేదని, అంతిమంగా రాష్ట్రపతిపాలన విధించడం ద్వారా ఈ నాటకాన్ని రక్తికట్టిస్తారని వినికిడి.

సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న టేపుల్లో బీరేన్ గొంతు 93శాతం సరిపోలిందని ట్రూత్ ల్యాబ్స్ నిర్ధారించిన ఐదురోజుల్లోనే ఆయన తప్పుకున్నారు. అది ప్రైవేటు సంస్థ కనుక, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (సిఎఫ్ఎస్ఎల్) లో పరీక్షచేయించాలని సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు చెప్పుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మరికాస్తంత సమయం సంపాదించిపెట్టారు. కానీ, జస్టిస్ ఖన్నా ఇచ్చింది మూడువారాల గడువే కనుక, సదరు ప్రభుత్వ సంస్థనుంచి ఇందుకు పూర్తివిరుద్ధమైన నివేదిక వస్తే తప్ప సుప్రీంకోర్టు నుంచి బీరేన్‌ను కాపాడటం అసాధ్యం. ఆయన ఆదివాసీ వ్యతిరేక, మీతీ అనుకూల వైఖరులు, విధానాలు పూర్తిగా ఆయన సొంతం కాదని, ఢిల్లీపెద్దల రక్షణల మధ్య ఆయన చెలరేగిపోయారని అందరికీ తెలుసు. పోలీసుల సహకారంతో, వారు అందించిన, వారినుంచి దోచుకున్న ఆయుధాలతో వారి వాహనాల్లోనే ప్రయాణిస్తూ మీతీ మిలిటెంట్ గ్రూపులు కుకీలపై అఘాయిత్యాలకు పాల్పడ్డాయన్న ఆరోపణలను ఈ ఆడియోటేపులు నిజమని నిర్ధారిస్తున్న నేపథ్యంలో, రేపు సర్వోన్నత న్యాయస్థానంలో బీరేన్ ఇరుక్కోవడం ఖాయం. కేంద్రప్రభుత్వ ప్రతినిధులకు, కమిటీలకు ఈ టేపులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో, కుకీ హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ (కోహుర్) సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సివచ్చింది. మణిపూర్‌లో 21 నెలలుగా జరుగుతున్నదేమిటో ఈ టేపులు తేల్చేశాయి. బీరేన్‌కు అండగా ఉంటున్న బీజేపీ పెద్దలను కూడా బోనులో నిలబెట్టాయి. సుప్రీంకోర్టు చొరవ లేనిదే ఈ పరిణామాలు ఉండేవి కావు.

బీరేన్ తప్పుకోవాలని ఆదివాసీ తెగలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నందున, ఇప్పుడు వాళ్ళు కాస్తంత శాంతపడవచ్చు. ఒకపక్క బర్మాలో సాగుతున్న అంతర్యుద్ధం మణిపూర్‌ను మరింత రాజేస్తుంటే, ఈ రాష్ట్రం కారణంగా ఈశాన్యమంతా ప్రమాదకరంగా తయారైందని అధ్యయనాలు చెబుతున్నాయి. వేలాదిమంది కేంద్ర బలగాలతో ఇంతకాలం సాధించలేనిది బీరేన్ నిష్క్రమణతో మొదలు కావచ్చును. కేవలం హింస ఆగినంతమాత్రాన శాంతి నెలకొన్నట్టు కాదు. బీరేన్ కారణంగా నిలువుగా చీలిపోయిన సమాజం ఒక్కటి కావాలి. వారూ వీరూ తేడా లేకుండా ప్రతీ మిలిటెంట్ గ్రూపునుంచీ ఆయుధాల స్వాధీనం జరగాలి. గాలివార్తలకు గ్రామాలు తగలబడుతూ, అనుమానాలు, భయాల మధ్య పరస్పర అవిశ్వాసంతో ఎవరికివారుగా ఉంటున్న అన్ని తెగలూ, జాతులూ సొంతిళ్ళకు చేరి, సయోధ్యతో జీవించగలగాలి. బీరేన్ వారసుడిగా ఓ కుకీని నియమించినా, గవర్నర్ ఏలుబడి సాగినా మణిపూర్‌కు కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దడం అంత సులభం కాదు.

మోదీని కాంగ్రెస్ అడ్డుకోగలదా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'రాజుకు ఒకటే నిబంధన వర్తిస్తుంది. అతడు బలంగా ఉండాలి, విస్తరిస్తూనే ఉండాలి' అని చాణక్యుడు చెప్పినట్లుగా మౌర్య సామ్రాజ్యం దేశమంతటా విస్తరించినట్లే భారతీయ జనతా పార్టీ కూడా నరేంద్ర మోదీ సారథ్యంలో దేశమంతటా విస్తరించేందుకు దండ యాత్రలు చేస్తున్నట్లు కనపడుతోంది. ఏడాది ఏడాదికీ ఆయన సారథ్యంలో ప్రతిపక్ష రాష్ట్రాల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. రెండేళ్ల క్రితం రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ బీజేపీ కైవశం కాగా క్రమంగా ఒడిషా, ఆంధ్రప్రదేశ్, హరియాణాతో పాటు ఇటీవలి కాలంలో దేశ రాజధాని ఢిల్లీ కూడా బీజేపీ లేదా బీజేపీ మిత్రపక్షాల పాలనలోకి వచ్చాయి. ప్రస్తుతం 15 రాష్ట్రాలు బీజేపీ పట్టులోకి పూర్తిగా రాగా మొత్తం 21 రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నది. మోదీ బలగాలు పశ్చిమ బెంగాల్, తెలంగాణతో పాటు సాధ్యమైనన్ని రాష్ట్రాల్లో చొచ్చుకువచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి.

నిజానికి ఢిల్లీలో బీజేపీ పూర్వరూపమైన జనసంఘ్‌ను బలోపేతం చేయడంలో అటల్ బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ ఆడ్వాణీ కీలక పాత్ర పోషించారు. 1957లో ఎంపీగా ఉన్న అటల్ బిహారీ వాజపేయికి సహాయపడేందుకు ఢిల్లీ వచ్చిన లాల్‌కృష్ణ ఆడ్వాణీ ఢిల్లీలో జనసంఘ్ బాధ్యత కూడా చేపట్టారు. 1958లో తొలిసారి ఏర్పడిన ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు ఆయన తీవ్ర కృషి చేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, జనసంఘ్ తన తొలి సంకీర్ణ రాజకీయాలు ఢిల్లీలో కమ్యూనిస్టులతో ప్రారంభించింది. మేయర్, ఉప మేయర్ పదవులను రొటేషన్ ప్రకారం పంచుకునేందుకు జనసంఘ్, సీపీఐల మధ్య ఒప్పందం కుదరడమే అందుకు నిదర్శనం. 1970వ దశకంలో కార్పొరేషన్ ఎన్నికల్లో జనసంఘ్‌ను గెలిపించేందుకు వాజపేయి, ఆడ్వాణీతో పాటు వందలాది జనసంఘ్ కార్యకర్తలు రాత్రింబగళ్లు కృషిచేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా జనసంఘ్ విజయం సాధించలేదు. ఫలితాలు వెలువడిన రోజు సాయంత్రం 'ఛలో కోయీ సినిమా దేఖ్ నే చల్తీ హై' అని అటల్, ఆడ్వాణీ పహాడ్ గంజ్‌లోని ఇంపీరియల్ సినిమా థియేటర్‌కు వెళ్లి ఒక హిందీ సినిమా చూశారు. ఆ సినిమా పేరు 'ఫిర్ సుబా హోగీ' (మళ్లీ ఉదయం వస్తుంది)! ఒకప్పుడు ఢిల్లీ సింహంగా పేరొందిన మదన్‌లాల్ ఖురానా. ఆడ్వాణీ మాదిరే పాకిస్థాన్ నుంచి కట్టుబట్టలతో వచ్చినవాడే. విజయ్‌కుమార్ మల్హోత్రా, కేదార్‌నాథ్ సహానీ లాంటి నేతలతో కలిసి ఢిల్లీలో జనసంఘ్ విభాగాన్ని స్థాపించిన ఖురానా తర్వాతి కాలంలో బీజేపీని కూడా బలోపేతం చేశారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 47.82 శాతం ఓట్లతో 49 సీట్లు సాధించి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. ఆ తర్వాత బీజేపీ అంతర్గత కలహాలతో కూరుకుపోయింది. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రాలేకపోయింది.

ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ సామ దానభేద దండోపాయాలను ప్రయోగించింది. గత పదేళ్లుగా మోదీ, షాలు ఎంత ప్రయత్నించినా కేజ్రీవాల్‌ను ఢీకొనలేకపోయారు. కాని ఈ సారి ఢిల్లీలో అధికారంలోకి వచ్చేందుకు మోదీ, షాలు చేయని ప్రయత్నమంటూ లేదు. అన్ని రకాల ఎన్నికల వ్యూహాల్ని అవలంబించడమే కాదు, కేజ్రీవాల్‌ను ప్రజల దృష్టిలో దిగజార్చేందుకు బీజేపీ తీవ్రయత్నాలు చేసింది. అతడి అవినీతి కార్యకలాపాలను బయటపెట్టి అతడు నిజాయితీపరుడన్న భ్రమలు తొలిగేలా చేసి అధికారంలోకి రాగలిగింది. నిజానికి ఢిల్లీలో బీజేపీకి చెప్పుకోదగ్గ నాయకుడు లేనేలేడు. బీజేపీ మోదీ పేరుతోనే ఎన్నికల్లో గెలిచింది. మోదీ హయాంలో బీజేపీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్న దానికి ప్రాధాన్యం లేకుండా పోయింది. కేజ్రీవాల్ లాంటి బలమైన నేతలు కూడా మోదీని ఢీకొనలేకపోవడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామం.

స్పష్టంగా చెప్పాలంటే కేజ్రీవాల్ తనకు తిరుగులేదన్న అహంతో ఎన్నో వ్యూహాత్మక తప్పిదాలకు పాల్పడ్డారు. తనపై మారుతున్న ప్రజాభిప్రాయాన్ని పసిగట్టలేకపోయారు. 'ఒక మద్యం సీసా బాటిల్ కొంటే మరో మద్యం సీసా ఉచితంగా ఇచ్చి మా సంసారాన్ని నాశనం చేశాడు సార్' అని ఒక పని మనిషి చెప్పింది. మద్యం కుంభకోణమే అన్ని అవినీతి కార్యకలాపాలకన్నా కేజ్రీవాల్ ప్రతిష్ఠను బాగా దెబ్బ తీసింది. ఈ కుంభకోణంలో తనను అరెస్టు చేసినప్పుడు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ లా రాజీనామా చేయకుండా జైలుకు వెళ్లి కూడా ముఖ్యమంత్రిగా కొనసాగడంతో కేజ్రీవాల్‌పై సానుభూతి అన్నది లేకుండా పోయింది. జైలు నుంచి రాగానే తనను తాను మళ్లీ ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. ఆయన జైలులో ఉన్నప్పుడు కేజ్రీవాల్ భార్య ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని సందేశాలివ్వడం, ముఖ్యమంత్రి అయిన అతిషీ ఆ కుర్చీలో కూర్చోకుండా మితిమీరిన భక్తి ప్రదర్శించడం తప్పుడు సంకేతాలు ఇచ్చింది. అంతే కాదు, పార్టీకోసం పనిచేసిన వారిని విస్మరించి దాదాపు 30 స్థానాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే కేజ్రీవాల్ సీట్లు ఇచ్చారు. మనీష్ సిసోడియా లాంటి వ్యక్తికి సీటు మార్చి అతడి ఓటమికి కారణమయ్యారు. రాజ్యసభ సీట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారన్న అపఖ్యాతి మూటగట్టుకున్నారు. అభివృద్ధి జనజీవనాలను మెరుగుపరచడంపై కాకుండా ఉచితాలను అధికంగా నమ్ముకున్నారు. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, మహిళలకు ఉచిత బస్‌పాస్‌లు గెలిపిస్తాయనుకున్నారు. యమునలో మురికినీరు ప్రవహిస్తున్నా, రహదారులు దెబ్బతిన్నా, వాయుకాలుష్యం పెరిగిపోతున్నా, రహదారులు, కాలనీల్లో ఆక్రమణలు పెరిగిపోతున్నా పట్టించుకోలేదు. స్వంత కాళ్ల క్రింద నేల కరిగిపోతున్నా గ్రహించకుండా ఇతర రాష్ట్రాల్లో విస్తరించి జాతీయ నాయకుడుగా ఎదగాలన్న తహతహను ప్రదర్శించారు. సహజంగా ప్రాంతీయ పార్టీల అధినేతలు చేసే తప్పులనే కేజ్రీవాల్ చేశారు. ఆ తప్పుల్ని బీజేపీ పూర్తిగా సద్వినియోగపరుచుకుంది.

తమ విస్తరణ లక్ష్యాలలో మోదీ విజయవంతం కావడం అనేక ప్రశ్నలకు తావిస్తున్నది. క్రమంగా భారతదేశమంతటా బీజేపీ విస్తరించగలుగుతుందా? బీజేపీ, కాంగ్రెస్‌లతో చేతులు కలపని ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రమాదంలో పడుతుందా? అసలు కాంగ్రెస్ ఎంత వరకు బీజేపీ ధాటిని తట్టుకుని నిలబడగలుగుతుంది? ఇప్పటి వరకూ బీజేపీని అడ్డుకోవాలంటే ప్రాంతీయ పార్టీలకే సాధ్యమన్న ప్రచారం జరిగింది. ఇప్పుడు అదికూడా జరిగేటట్లు కనపడడం లేదు. కేజ్రీవాల్ లాంటి నేతలు కాంగ్రెస్ ఓటు బ్యాంకును కబళించి అధికారంలోకి వచ్చిందని తెలిసినా ఆ ఓటు బ్యాంకును తిరిగి సాధించేందుకు కాంగ్రెస్ బలంగా ప్రయత్నించలేదు. కేజ్రీవాల్ ప్రభ తగ్గిపోతోందని గమనించినా ఢిల్లీలో కాంగ్రెస్ ఉధృతంగా పనిచేయనేలేదు.

ముఖాముఖి పోటీల్లో బీజేపీని ఓడించడం కాంగ్రెస్‌కు సాధ్యపడదని హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. కుల గణన, రాజ్యాంగం, సామాజిక న్యాయం అంటూ ఎన్ని సైద్ధాంతిక అంశాలను లేవనెత్తినా బీజేపీ ఉధృతిని కాంగ్రెస్ అడ్డుకోలేకపోతోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి అడ్డుకోగలుగుతుందా అన్న సందేహాలు కాంగ్రెస్ శిబిరంలోనే వ్యక్తమవుతున్నాయి. ఎవరితో చర్చించినా 'కాంగ్రెస్‌కు బీజేపీని ఎదుర్కోగల శక్తి ఎక్కడుంది? హరియాణాలో జరిగింది చూశారు కదా?' అన్న ప్రశ్నలు వేస్తున్నారు. నిజానికి సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు తగ్గిన తర్వాత నరేంద్రమోదీ దెబ్బతిన్న బెబ్బులిలా ప్రతి రాష్ట్రంలోనూ గెలవాలన్న కసితో సర్వశక్తులు ఒడ్డారు. వేర్వేరుగా ఎన్నికలు జరిపించి ఒక్కో రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించారు. హరియాణా, మహారాష్ట్రలను గెలుచుకోవడంతో మోదీకి తిరుగులేదన్న అభిప్రాయం కల్పించారు. ఇక ఢిల్లీ విజయంతో అనితరసాధ్యుడని నిరూపించుకున్నారు. రాజకీయాల్లో తమ సిద్ధాంతాలు, తమ ఉపన్యాసాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా ప్రత్యర్థి బలంపై దృష్టి కేంద్రీకరించి వ్యూహరచన చేయడం అవసరం. కాంగ్రెస్ ఈ విషయంలో వెనుకబడి పోతోంది.

కేజ్రీవాల్ ఇప్పుడు కనీసం ఎమ్మెల్యే కూడా కాదు. కనుక కాంగ్రెస్ ఇప్పటి నుంచే బలంగా పనిచేసి ఢిల్లీలో తాను కోల్పోయిన ఓటు బ్యాంకును మళ్లీ సంపాదించుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆఖరులో జరిగే బిహార్ ఎన్నికల్లో తమకు రావాల్సిన సీట్లను ఇప్పుడే నిర్ణయించుకుని అన్నిటిలో గెలిచే ప్రయత్నం చేయవచ్చు. ఆ రాష్ట్రంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ 70 సీట్లకు పోటీ చేసి కేవలం 19 స్థానాలలో మాత్రమే విజయం సాధించి మహాఘట్ బంధన్ సర్కార్ ఓటమిలో కీలక పాత్ర పోషించింది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించి ఒకరకంగా కాంగ్రెస్‌కు మేలే చేసారు. గత ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేకపోయిన కాంగ్రెస్ ఈసారి బెంగాల్‌లో ఓటు బ్యాంకు పెంచుకునేందుకు ఏమి చేయాలో ఇప్పటి నుంచే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఒడిషాలో బీజేడీ ఓడిపోవడం కాంగ్రెస్ బలోపేతం అయ్యేందుకు అవకాశాన్నిచ్చినట్లయింది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓడిపోయినప్పటికీ ఆ పార్టీ తమ భావి విజయానికి అడ్డురాకుండా ఏమి చేయాలో కాంగ్రెస్ దృష్టి పెట్టాలి. ప్రాంతీయ పార్టీలు బలహీనపడడం ఒక రకంగా కాంగ్రెస్‌కు సదవకాశంగా భావించాలి. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలో ఇప్పటికే ఉన్న పార్టీలతో స్నేహ సంబంధాలు పటిష్ఠం చేసుకుంటూనే కూటమి ఉనికిలో లేని రాష్ట్రాల్లో బీజేపీతో ముఖాముఖి పోరుకు కాంగ్రెస్ బలంగా సిద్ధపడితే కాని ఆ పార్టీ కోలుకునే అవకాశాలు లేవు. విచిత్రమేమంటే నరేంద్రమోదీ ఇప్పటికీ కాంగ్రెస్‌ను తన బలమైన ప్రత్యర్థిగానే భావిస్తున్నట్లున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ పార్లమెంటు ఉభయ సభల్లో చేసిన ప్రసంగాల్లో అత్యధిక సమయాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పుల్ని ఎండగట్టేందుకే వినియోగించుకున్నారు. మోదీ విమర్శలను సవాలుగా తీసుకొని బీజేపీతో బలమైన పోరుకు కాంగ్రెస్ తనను తాను సమాయత్తం చేసుకోగలదా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికీ కాంగ్రెస్‌నే తన బలమైన ప్రత్యర్థిగా భావిస్తున్నట్లున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ పార్లమెంటు ఉభయ సభల్లో చేసిన ప్రసంగాల్లో అత్యధిక సమయాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పులను ఎండగట్టేందుకే వినియోగించుకున్నారు. మోదీ విమర్శలను సవాలుగా తీసుకొని బీజేపీతో బలమైన పోరుకు కాంగ్రెస్ తనను తాను సమాయత్తం చేసుకోగలదా?

కులగణన రెండంచుల కత్తి!

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. సంక్షేమ విధానాలలో, పాలనా సమానత్వంలో ఇది సత్ఫలితాలను ఇస్తుందని దీని సమర్థకులు వాదిస్తున్నప్పటికీ, విమర్శకులు మాత్రం దీని నుండి ఉత్పన్నం కాగల సామాజిక సమస్యల గురించి హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రంలోని 96.9శాతం కుటుంబాలను కవర్ చేసిన సర్వే ప్రకారం- జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 46.25 శాతం, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.43 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.45 శాతం ఉన్నట్లు వెల్లడైంది. జనాభాలో ముస్లింలు 12.56 శాతం ఉన్నారు. వీరిలో 35,76,588 బీసీ ముస్లింలు, 8,80,424 ఓసీ ముస్లింలు ఉన్నారు. మొత్తం ఓసీలు 15.46శాతంగా ఉన్నారు.

అయితే ప్రస్తుత తెలంగాణ జనాభా 4.3 కోట్లు ఉందని అనేక గణాంకాలు చెప్తుంటే 3.70 కోట్లకే పరిమితమైన సర్వేను సమగ్రంగా ఎట్లా పరిగణిస్తారు అనే వాదన బలంగా వినపడుతుంది. దాదాపు 60 లక్షల జనాభాను ఈ సర్వే లెక్కలోకి తీసుకోలేదు అన్నది విమర్శ. తమ సంఖ్యను దురుద్దేశంతో తగ్గించినట్లు వివిధ కులాలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. ముఖ్యంగా మొన్నటి వరకు ఓసీలుగా ఉన్న 10శాతం ముస్లింలను ఏ ప్రాతిపదికన బీసీలలో కలిపారు అని బీసీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. బీసీ వర్గాలకు ఈ చర్య తీవ్ర నష్టం చేస్తుందని బీసీ నాయకులే అంటున్నారు. ఈ సర్వే సామాజిక సమస్యలకు పరిష్కారం చూపుతుందా లేక కొత్త సమస్యలను తెచ్చిపెడుతుందా అన్నది వేచి చూడాల్సిందే. ఈ సర్వే ఫలితాల ద్వారా కొన్ని సామాజిక సమస్యలు తలెత్తవచ్చు.



అందరికీ సమానత్వాన్ని, సమ న్యాయాన్ని ప్రోత్సహించడానికి కులగణన సర్వే ఫలితాలను ఉపయోగించుకుంటే తెలంగాణకు మేలు జరుగుతుంది. అట్లా కాకుండా గత ప్రభుత్వం లాగా ఈ సర్వే ఫలితాలను ఫక్తు రాజకీయాలకు వాడుకుంటే ఫలితాలు కూడా అట్లనే ఉంటాయి.

ముఖ్యంగా సర్వే ఫలితాల వల్ల అన్ని రాజకీయ పార్టీలు కుల ఆధారిత రాజకీయాలకు ప్రాముఖ్యత ఇచ్చే అవకాశం ఉంది. వివిధ కులాలు వారి వారి సంఖ్య ఆధారంగా ఎక్కువ ప్రాతినిధ్యాన్ని, ప్రయోజనాలను కోరుతున్నాయి. మరి కొన్ని కులాలు మమ్మల్ని విస్మరిస్తే మా సంగతి చెప్తాం అని హెచ్చరించే అవకాశం ఉంది. అలాగే సర్వే సమాచారం నిర్దిష్ట సమూహాలకు రిజర్వేషన్‌లను కోటాలను పెంచాలన్న డిమాండ్‌లకు దారితీయవచ్చు. తద్వారా తాము కూడా వెనుకబడి ఉన్నామని భావించే ఇతరులలో ఆగ్రహాన్ని సృష్టించే అవకాశం ఉంది. సర్వే ఫలితాలు సామాజిక అశాంతికి కూడా దారితీయవచ్చు.

ప్రత్యేకించి కొన్ని కులాలు తక్కువగా లెక్కించబడ్డామని భావించే అవకాశం ఉంది. ఇప్పటికే ఎస్సీ వర్గాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ వర్గాలు కూడా తమ సంఖ్య 51 శాతంగా ఉంటే 46శాతానికి తగ్గించారు అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బీసీ జనాభాలో కొన్ని కులాలను టార్గెట్ చేసి తగ్గించారు అనే చర్చ జరుగుతోంది. ముదిరాజ్, మున్నూరు కాపు, యాదవులు, గౌడలు, పద్మశాలిలు, ఎంబీసీల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ తగ్గించారు అనే చర్చ జరుగుతోంది. అందుకే బీసీ జనాభా దాదాపు 40లక్షల వరకు లెక్కలోకి తీసుకోలేదు అనే వాదన జరుగుతున్నది. బీసీలలో మున్నూరు కాపులు రెండవ అతిపెద్ద సంఖ్య అని సమగ్ర కుటుంబ సర్వే తేల్చింది. 28 లక్షల సంఖ్యను 13 లక్షలకు తగ్గించారు అని ఆ సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో ఈ వర్గం ఓట్లే 13 లక్షలు ఉంటే తెలంగాణ మొత్తం జనాభాలో 13 లక్షలుగా ఎట్లా పరిగణిస్తారు అని ప్రశ్నిస్తున్నారు. ఈ సామాజిక వర్గం బీజేపీకి అండగా ఉందని, అందుకే ఉత్తర తెలంగాణలో బీజేపీ ఏడు ఎమ్మెల్యే సీట్లు, నాలుగు ఎంపీ సీట్లు గెల్చుకుందని, ఆ కోపంతోనే అధికార పార్టీ ఈ వర్గాన్ని టార్గెట్ చేసి ఉంటుందని విమర్శకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా సర్వే ఫలితాలు అనేక వర్గాలను ఆందోళనకు, అభద్రతా భావానికి గురిచేస్తున్నాయి.

ఈ పరిస్థితిలో ప్రభుత్వం చొరవ చూపాలి. సర్వే ఫలితాలు ఖచ్చితంగా, పారదర్శకంగా ఉన్నాయని, వాటి ఆధారంగా విధాన రూపకల్పన చేయవచ్చని ప్రభుత్వం నిర్ధారించాలి. ఈ విషయంలో పౌర సమాజ సంస్థలు, వివిధ కుల సంఘాల నాయకులు, అట్టడుగు వర్గాలతో సహా వివిధ వాటాదారులతో ప్రభుత్వం తప్పనిసరిగా సమగ్ర సంభాషణలో పాల్గొనాలి. అఖిలపక్షం ఏర్పాటు చేసి అనుమానాలను నివృత్తి చెయ్యాలి.

అంతిమంగా, తెలంగాణలోని సంక్లిష్ట సామాజిక దృశ్యం నేపథ్యంలో సర్వే ఫలితాల్ని అర్థం చేసుకుని, అన్వయించగల ప్రభుత్వ సామర్థ్యం పైనే కుల గణన విజయం ఆధారపడి ఉంటుంది. అందరికీ సమానత్వాన్ని, సమ న్యాయాన్ని ప్రోత్సహించడానికి కులగణన సర్వే ఫలితాలను ఉపయోగించుకుంటే తెలంగాణకు మేలు జరుగుతుంది. అట్లా కాకుండా గత ప్రభుత్వం లాగా ఈ సర్వే ఫలితాలను పక్షు రాజకీయాలకు వాడుకుంటే ఫలితాలు కూడా అట్లనే ఉంటాయి. నేటి తెలంగాణ ప్రజలు అనునిత్యం పాలకుల చర్యలను గమనిస్తున్నారు. గుర్తు పెట్టుకుంటున్నారు. సమయం వచ్చినప్పుడు తడాఖా చూపిస్తున్నారు.

■ సిహెచ్. విఠల్
మాజీ టీఎస్‌పీఎస్‌సీ సభ్యులు

సంకెళ్లు వేసి పంపినా మౌనమేనా?

స్వదేశీ దోపిడీ ప్రభుత్వ విధానాలపై ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాడడానికి బదులు విదేశీ వ్యామోహంతో లక్షలాది విద్యాధిక యువతీ యువకులు అమెరికా, యూరోప్, కెనడా, ఆస్ట్రేలియా వంటి సుదూర దేశాలకు వెళ్లడం తెలిసిందే. అలా వెళ్లినవారు పరాయి నేలపై ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. అక్రమ వలసదార్ల వల్ల అమెరికన్ కార్పొరేట్లు ఇన్నాళ్లు భారీ లాభాలు గడించారు. నేడు ట్రంప్ సర్కార్ అధికారంలోకి వచ్చాక మన వాళ్ళను క్రిమినల్స్‌లా వేటాడి నిర్బంధించింది. ఏ ఉద్యోగం దొరక్క, అమెరికాలో ఏదో ఒక పని చేసుకుంటూ జీవించే వారిపైనా ట్రంప్ ప్రభుత్వం కక్షకట్టింది. సంకెళ్ళతో అమెరికా సైనిక విమానాల్లో కుక్కి అమృతసర్‌లో పడదోసి వెళ్ళింది. అది ఆ 104 మందినే కాదు, 140 కోట్ల ప్రజల్ని అవమానించడమే. భారత్‌కు అమెరికా మిత్ర దేశమని గొప్పగా చెప్పుకొంటున్న నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం భారతీయుల పట్ల ఇంత క్రూరంగా ప్రవర్తించడంపై ప్రతిపక్షాలు మోదీ ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తున్నాయి. అక్రమ వలసదారులను భారత్‌కు తిప్పి పంపనున్న విషయం కేంద్రానికి ముందే తెలుసు. అలాంటప్పుడు వారిని తీసుకురావడానికి మోదీ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉండవచ్చు కదా? అమెరికా చట్టాల ప్రకారం వలసదారుల పిల్లలు అమెరికాలో పుట్టినట్లయితే వారికి పౌరసత్వ హక్కులు లభిస్తాయి. అయినా, ట్రంప్ ప్రభుత్వం కేవలం చట్టవ్యతిరేక వలసదారులకే కాకుండా చట్టబద్ధంగా ఉన్న వలసదారుల కుటుంబాలపై కూడా ద్వేషంతో నడుచుకుంది. వలసదారుల పట్ల ద్వేషం చూపిన నేతగా ట్రంప్, వలసదారులకు అవమానకరంగా సంకెళ్లు వేసినా స్పందించని ప్రధానిగా మోదీ... ఇద్దరూ చరిత్రలో నిలిచిపోతారు.

– వెంకటేశ్, పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి

పెట్టుబడుల ప్రకటనలతో సరిపోలని ప్రగతి

ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్–డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశాలను, అంతర్జాతీయ పెట్టుబడుల అవగాహన ఒప్పందాలకు పరిమితం చేయకుండా, పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాలలో నిష్ణాతులైన పలువురు ప్రపంచస్థాయి ప్రభావశీలురైన వ్యక్తులతో దీర్ఘకాలిక పరిచయాలు నిలుపుకోవటానికీ, వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ ప్రపంచ దిశ దశ ఏమిటి అనే విషయంలో అవగాహన కలగడానికీ అవకాశంగా ఉపయోగించుకోవాలని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. ఇంచుమించు ఇదే అభిప్రాయాన్ని దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా వెల్లడించారు. ఇటీవలి డబ్ల్యుఇఎఫ్ దావోస్ వార్షిక సమావేశంలో, భారత కంపెనీలతో సహా అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలతో పెద్ద ఎత్తున అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నట్లు కొందరు ముఖ్యమంత్రుల అవాస్తవ ప్రకటనల నేపథ్యంలో ఇలాంటి విశ్లేషణలకు ప్రాముఖ్యత వున్నదనాలి.

డబ్ల్యుఇఎఫ్ స్విట్జర్లాండ్‌లోని ఒక అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థగా 1971 జనవరి 24న జర్మన్ ఇంజనీర్, ఆర్థికవేత్త క్లాస్ స్క్వాబ్ తన 33వ ఏట యూరోపియన్ మేనేజ్‌మెంట్ ఫోరమ్ పేరుతో స్థాపించారు. దీని లక్ష్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం; వ్యాపార, రాజకీయ, విద్యావేత్తలతో పాటు సమాజంలోని ఇతర ప్రతిభాశీలురైన నాయకులను ఒక ఉమ్మడి వేదిక మీదకు చేర్చి, వార్షిక సదస్సులు నిర్వహించి, ప్రపంచ, ప్రాంతీయ, పారిశ్రామిక విధానాలను రూపొందించడం. ఇటీవల ముగిసిన 54వ డబ్ల్యుఇఎఫ్ వార్షిక సమావేశం జనవరి 15–19 తేదీల మధ్య దావోస్‌లో జరిగింది.

ఇందులో అంతర్జాతీయ సంస్థల, ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారతదేశం నుండి గతంలో కంటే అత్యధిక సంఖ్యలో 133 మంది ప్రతినిధులు ('ఒకే బృందం, ఒక భారతీయ ప్రదర్శన' అనే థీమ్‌తో) హాజరయ్యారు. వీరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల ప్రతినిధులు కూడా ఉన్నారు. ఐదుగురు కేంద్ర మంత్రులు, ముగ్గురు రాష్ట్ర ముఖ్యమంత్రులతో సహా, వివిధ రంగాల నుండి సుమారు 100 మంది సీఈఓలు పాల్గొన్నారు.

యూరోపియన్ మేనేజ్‌మెంట్ నిపుణలకు, అమెరికన్ మేనేజ్‌మెంట్ మెళకువలను, విధివిధానాలను నేర్పించడమనే క్లాస్ స్క్వాబ్ ప్రారంభ ఆలోచన క్రమంగా ఆర్థిక, సామాజిక సమస్యలపై దృష్టి పెట్టడంగా మార్పు చెందింది. 1971 సంవత్సరం నాటి ప్రారంభ సమావేశానికి 400 మంది దిగ్గజ యూరోపియన్ వ్యాపారవేత్తలను, వివిధ రంగ నిపుణులను ఆహ్వానించి, స్క్వాబ్ వ్యూహాత్మకంగా తక్షణ, భవిష్యత్తు నిధులను సమీకరించాడు. స్విస్ ఫెడరల్ ప్రభుత్వ పర్యవేక్షణలో లాభాపేక్షలేని సంస్థగా స్థాపించబడిన డబ్ల్యుఇఎఫ్ వార్షిక సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీగా సాగుతున్నది.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 2015లో దాలియాన్‌లో జరిగిన అలాంటి ఒక ప్రత్యేక సమావేశంలో పాల్గొని, తనదైన ప్రత్యేక శైలిలో, తెలంగాణను పెట్టుబడుల స్వర్గంగా ప్రచారం చేయడంలో సఫలమయ్యారు. ఆ సమావేశంలో ఆయన రాజనీతిజ్ఞతతో చేసిన ఉపన్యాసంలో భారత ఆర్థిక వ్యవస్థను సమర్థించడం, చైనా అభివృద్ధిని ప్రశంసించడం, తెలంగాణ సాధించిన అభివృద్ధిని తెలియచేయడం విశేషం.

ప్రత్యేక ఆహ్వానితులకే ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో పాల్గొనే వీలుంది. ఆర్థిక, రాజకీయ రంగంలో ప్రధాన పాత్రదారులు, క్లిష్టతరమైన ప్రపంచ సమస్యలను పరిష్కరించడం లాంటి డబ్ల్యుఇఎఫ్ లక్ష్యాలను ముందుకు తీసుకుపోగలిగే వారు సమావేశాలకు ఆహ్వానితులు. పెట్టుబడుల అవకాశాల కోసం తెరవెనుక లాబీయింగ్ చేయడానికి ఈ వేదికను ఉపయోగించుకోవచ్చు. బహుశా అందువల్లనే, భారతదేశం నుండి ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఈ వేదిక వార్షిక సమావేశాలలో పాల్గొంటారు. నియంత్రణల సడలింపునకు, మార్కెట్ స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చే 'నయా ఉదారవాద విధానాల' వేదికగా డబ్ల్యుఇఎఫ్ మారుతున్నదన్న విమర్శ వస్తున్నది. బహుశా ప్రజల సార్వజనీన, విస్తృత ప్రయోజనాలకు ఈ వేదిక సరిపడకపోవచ్చునేమో. ఏదేమైనా, అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల పెట్టుబడి అవకాశాలను మెరుగుపరచుకోవడానికి ఇది ప్రధాన వేదికే.

నారా చంద్రబాబునాయుడు 1990–2000 మధ్య కాలంలో, ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో పాల్గొన్న తొలి భారతీయ ముఖ్యమంత్రులలో బహుశా ప్రథముడు కావచ్చు. ఆయన ఆ వేదికను చాకచక్యంగా ఉపయోగించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విదేశీ ప్రత్యక్ష-పరోక్ష పెట్టుబడుల కేంద్రంగా మలిచారు. హైదరాబాద్‌ను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రంగా రూపొందించి, దేశ ఐటీ వృద్ధిలో ఆయన నిర్వహించిన పాత్ర అమోఘం. ఈసారి కూడా చంద్రబాబునాయుడు వార్షిక సమావేశంలో పాల్గొన్నారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో చర్చలు జరిపారు. అలాగే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2023లోనూ, ఇప్పుడూ కూడా పాల్గొని అమెజాన్, సన్ పెట్రోకెమికల్స్, టిల్‌మన్ గ్లోబల్ హోల్డింగ్స్ వంటి హేమాహేమీ సంస్థల నుండి రూ.1.78లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను తెలంగాణకు సాధించారు. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 49,550 మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నట్లు ప్రభుత్వ అంచనా. ఇందుకు ముఖ్యమంత్రిని, ఆయన సహచర ప్రతినిధుల బృందాన్ని అభినందించాలి.

ప్రపంచ ఆర్థిక వేదిక అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించేందుకు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పెట్టుబడులను ఆకర్షించేందుకు విశిష్టమైన వేదికగా ఎదుగుతున్నప్పటికీ, ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధి కల్పన వంటి వాస్తవిక ప్రయోజనాలను ఎంతవరకు సాధిస్తున్నదీ అనేదానిపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. చంద్రబాబునాయుడు పాలన చేసిన రోజుల నుండి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తదనంతర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర నాయకులు ఈ వేదికను సద్వినియోగం చేసుకుని, బిలియన్ డాలర్లలో పెట్టుబడులు పొందినట్లు ప్రకటనలు చేస్తున్నారు. ఈ ప్రకటనలు ఎంతమేరకు దీర్ఘకాలిక అభివృద్ధి సాధించడానికి దోహదపడుతాయనేది కూడా 'బిలియన్ డాలర్ల' ప్రశ్నే! లేదా, రాజకీయ స్వప్రయోజనాలను ప్రచారం చేసుకోవడానికేనా అన్నది కూడా ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది.

ఈ నేపథ్యంలో, జనాభా సమస్యను మొట్టమొదట సూత్రీకరించిన విశ్వవిఖ్యాత బ్రిటీష్ ఆర్థికవేత్త రాబర్ట్ థామస్ మాల్థస్ 'జనాభా సిద్ధాంతాన్ని' ప్రపంచ ఆర్థిక వేదికలో రాజకీయ నాయకులు ప్రకటించే బిలియన్ డాలర్ల పెట్టుబడులతో పోల్చి చూస్తే ఆసక్తికరంగా ఉంటుంది. ఆహారధాన్యాల పెరుగుదల రేటు కంటే జనాభా పెరుగుదల రేటు హెచ్చుగా ఉంటుందని మాల్థస్ తన సిద్ధాంతంలో వివరించాడు. ఆహార ధాన్యాలు అంకశ్రేణిలో పెరిగితే, జనాభా గుణశ్రేణిలో పెరుగుతుంది. అంటే ఆహార ధాన్యాల వృద్ధి అంకశ్రేణి క్రమంలో- అంటే 1, 2, 3, 4, 5... పద్ధతిలో పెరుగుతుంటే, జనాభా వృద్ధి గుణశ్రేణి క్రమంలో- అంటే, 1, 2, 4, 8, 16... పద్ధతిలో పెరుగుతుంది. డబ్ల్యుఇఎఫ్ వేదిక ఆధారంగా జరిగే అవగాహనా ఒప్పందాలు, దరిమిలా అవి కలిగించే వాస్తవ ప్రయోజనాల మధ్య కూడా ఇలాంటి అసమానతలే ఉన్నాయి.

పెట్టుబడుల ప్రకటనలు ఆర్థిక ప్రగతి, అభివృద్ధి, భారీ ఉద్యోగ-ఉపాధి కల్పనల గురించి ఆశలు రేకెత్తిస్తాయి. కానీ ఈ ప్రకటనల స్థాయిలో వాస్తవిక ఫలితాలు ఉండటం లేదు. నిధుల విడుదల, మౌలిక ప్రాజెక్టుల అమలు, క్షేత్రస్థాయిలో ఆర్థిక ప్రయోజనాలు సాధించడంలో అనేక నియంత్రణ సమస్యలు, ఆర్థిక అనిశ్చితులు అడ్డుగా నిలుస్తున్నాయి. ఈ అసమానత కారణంగా అభివృద్ధి అంతరం ఏర్పడుతోంది. వాగ్దానాల ప్రకారం ఆర్థిక మార్పు సాధించడంలో విఫలమవ్వడం వల్ల సంశయాలు, విలంబం, విధాన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాబట్టి పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ ప్రగతితో అనుసంధానమయ్యేలా జాగ్రత్తపడాలి.



ప్రపంచ ఆర్థిక వేదిక అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించేందుకు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పెట్టుబడులను ఆకర్షించేందుకు విశిష్టమైన వేదికగా ఎదుగుతున్నప్పటికీ, ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధి కల్పన వంటి వాస్తవిక ప్రయోజనాలను ఎంతవరకు సాధిస్తున్నదీ అనేదానిపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి.

• వనం జ్వాలా నరసింహారావు



పేరు గొప్ప పాలన దిబ్బ

నామమాత్రంగానే మిగిలిన వరంగల్ జిల్లా

- పరిపాలన అంతా హనుమకొండ నుంచే..
- జిల్లా ఏర్పడి తొమ్మిదేళ్లు అయినా రూపు కరువు
- ఇప్పటికీ హనుమకొండలోనే కలెక్టరేట్
- చెల్లాచెదురుగా వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు
- అయోమయంలో ప్రజలు.. కుంటుపడుతున్న అభివృద్ధి..

హనుమకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ప్రజలు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వివిధ సమస్యలపై గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కడికి వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయం ఎక్కడ ఉందో చిరునామా దొరక్క నానా అగచాట్లు పడుతున్నారు. ఎక్కడైనా వివిధ ప్రభుత్వ శాఖల ఆఫీసులు జిల్లా కేంద్రంలోనే ఉంటాయి. విచిత్రమేమిటంటే.. అసలు వరంగల్‌కు జిల్లా కేంద్రమే లేదు. వరంగల్ జిల్లా ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా జిల్లా కేంద్రంలో ఇప్పటివరకు సొంతంగా కలెక్టర్ కార్యాలయ భవనమే లేదు. హనుమకొండ జిల్లా కేంద్రంలోనే ఓ పాత భవనంలో ఇప్పటికీ కొనసాగుతోంది. జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ కార్యాలయాలు కూడా హనుమకొండలోనే ఉన్నాయి. దీంతో పేరుకు వరంగల్ జిల్లా అయినా పరిపాలనా అంతా హనుమకొండ జిల్లా కేంద్రం నుంచే కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితి రాష్ట్రంలో ఏ జిల్లాలో లేదు ఒక్క వరంగల్‌కు తప్ప. ఫలితంగా పర్యవేక్షణ కొరవడి పరిపాలన కుంటుపడుతోంది. అభివృద్ధి పరంగా జిల్లా వెనుపడుతోంది.

జిల్లా కేంద్రం ఏక్కడ?

వరంగల్ జిల్లా కేంద్రం ఎక్కడ? అనేది ఇప్పటికీ తేలలేదు. వాస్తవానికి కలెక్టర్ కార్యాలయం ఎక్కడ ఉంటే అదే జిల్లా కేంద్రం. కానీ విచిత్రమేమిటంటే వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం హనుమకొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతోంది. జిల్లాల పునర్విభజన తర్వాత గత బీఆర్ఎస్ సర్కారు సమగ్ర జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) పేరుతో ప్రతీ జిల్లాలో అన్ని హంగులతో కూడిన కలెక్టర్ కార్యాలయాల భవనాల నిర్మాణాన్ని చేపట్టింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం పూర్తయింది. కానీ వరంగల్‌లోనే ఇప్పటి వరకు కాలేదు. కలెక్టర్ కార్యాలయ భవనాన్ని ఎక్కడ నిర్మించాలనే విషయంలో చాలా కాలం వరకు ఒక నిర్ణయానికి రాలేకపోయారు. ఎట్టకేలకు వరంగల్‌లోనే నిర్మించాలన్న నిర్ణయానికి వచ్చారు. ఇందుకు అజంజాహిమిల్లు స్థలాన్ని ఖరారు చేశారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు హనుమకొండలోని నక్కలగుట్టలోని పాత నీటిపారుదల శాఖ భవనంలో వరంగల్ కలెక్టర్ ఆఫీసును తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అలా తొమ్మిదేళ్ల గడిచిపోయాయి. ఇప్పటికీ వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం హనుమకొండలోనే కొనసాగుతోంది. అయితే కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు పురోగతి చూస్తుంటే భవనం పూర్తి కావడానికి చాలా కాలం పట్టేట్టు ఉన్నది.

జిల్లాల పునర్విభజన

2016 అక్టోబరు 11న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనను చేపట్టింది. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లిగా ఏర్పాటయ్యాయి. 2019 ఫిబ్రవరి 17న జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి విడిపోయి ములుగు జిల్లా ఏర్పడింది. 2021 ఆగస్టు 12న మార్పులు చేర్పులతో వరంగల్ రూరల్ జిల్లా వరంగల్ జిల్లాగా, వరంగల్ అర్బన్ జిల్లా హనుమకొండ జిల్లాగా మారాయి. వరంగల్ రూరల్ జిల్లాలో 16 మండలాలు ఉండగా, వరంగల్ జిల్లాగా మారిన తర్వాత 13 మండలాలు, అలాగే వరంగల్ అర్బన్ జిల్లా హనుమకొండ జిల్లాగా మార్పుతో 14 మండలాలు ఏర్పరిచారు. వరంగల్ జిల్లాలో సంగెం, గీసుగొండ, వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి, నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, వరంగల్, ఖిలా వరంగల్ మండలాలు ఉన్నాయి.


హనుమకొండలో వరంగల్ ఆఫీసులు

వరంగల్ జిల్లా పరిపాలన అంతా హనుమకొండ కేంద్రంగానే సాగుతోంది. జిల్లాకు చెందిన దాదాపు అన్ని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు హనుమకొండలోనే ఉన్నాయి. దీంతో వరంగల్ జిల్లా ప్రజలు ప్రతీ పనికి హనుమకొండకు రావలసి వస్తోంది. పైగా ఏ ప్రభుత్వ ఆఫీసు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. అడ్రస్‌లు వెతుక్కుంటూ వెళ్లలేక ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. వరంగల్ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం హనుమకొండ సుబేదారిలోని పాత జడ్పీ కార్యాలయ భవనంలోనే కొనసాగుతోంది. ఇందులోనే హనుమకొండ జడ్పీ ఆఫీసు కూడా ఉంది. వరంగల్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం కూడా ఉన్నాయి. ఆయా పనుల మీద వచ్చిన వారు ఏ ఆఫీసు ఎక్కడుందో తెలియక తికమకపడుతున్నారు.

చెప్పేవారేరి?

వరంగల్ జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ కార్యాలయాలు హనుమకొండలో ఎక్కెడెక్కడ ఉన్నాయనేది చెప్పేవారే లేరు. వీటికి సంబంధించిన సమాచారం కూడా అందుబాటులో లేదు. వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో అయినా ఈ ఆఫీసుల చిరునామాలను తెలియచేసే బోర్డునైనా ఏర్పాటు చేయలేదు. వరంగల్ జిల్లా పరిస్థితి రాజధాని లేని రాజ్యంగా మారిపోయింది. ఈ జిల్లాకు సంబంధించిన ముఖ్య కార్యక్రమాలు, సభలు, సమావేశాలన్నీ కూడా హనుమకొండ కేంద్రంలోనే జరుగుతున్నాయి. వరంగల్ జిల్లా సమస్యలపై వివిధ ప్రజా సంఘాల ఆందోళనలు, రాజకీయ సభలు, సమావేశాలు కూడా

మిగతా 8వ పేజీలో...



ఆకస్మికంగా ఖరారు..

ఆ వెంటనే రద్దు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఓరుగల్లు పర్యటనపై అయోమయం

- మూడు గంటల వ్యవధిలోనే మారిన పరిణామాలు
- ఆర్ట్స్ కాలేజీ మైదానంలో హెలిప్యాడ్.. మోహరించిన పోలీసులు
- రాహుల్‌గాంధీ రాక కోసం విస్తృత ఏర్పాట్లు చేసిన నేతలు
- బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణకు కార్యాచరణ
- వరంగల్ - చెన్నై రైల్ జర్నీలో రైల్వే ప్రైవేటు సేవలపై ప్రయాణికులతో మాటామంతీకి యోచన
- టూర్ రద్దుతో కాంగ్రెస్ శ్రేణుల డీలా

వరంగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన ఆకస్మికంగా ఖరారైంది. కానీ అంతలోనే పలు కారణాలతో రద్దు కూడా అయింది. మంగళవారం సాయంత్రం ఓరుగల్లుకు రాహుల్ రాబోతున్నారంటూ ఉదయం 10.30గంటలకు షెడ్యూల్ ఖరారైంది. దీంతో పార్టీ నేతలు, శ్రేణులు ఏర్పాట్లు చేసేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. కానీ అగ్రనేత పర్యటన రద్దయ్యిందంటూ మధ్యాహ్నం 1.30గంటలకు ప్రకటన రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో అయోమయానికి గురయ్యారు. మూడు గంటల వ్యవధిలోనే పరిణామాలు మారిపోవడం వెనుక ఏం జరిగిందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

రాహుల్ షెడ్యూల్ ఇలా..

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం వరంగల్‌కు వస్తున్నట్లుగా ఉదయం 10.30గంటలకు ప్రకటన రావటం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠను రేపింది. ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 2.45గంటలకు విమానంలో బయలుదేరి, సాయంత్రం 5గంటలకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి చాపర్ ద్వారా సా యంత్రం 6గంటలకు వరంగల్‌లోని ఆర్ట్స్ కాలేజీ మైదానానికి చే రుకునేలా షెడ్యూల్ ఖరారైంది. అయితే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వరంగల్‌లో ఎలాంటి బహిరంగ

మిగతా 7వ పేజీలో...

తేలిన ఎంపీటీసీ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల లెక్క

- జారీ అయిన తుది ముసాయిదా జాబితాల షెడ్యూల్
- ఈనెల 15న తుది జాబితా ప్రచురణ

6



మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్?

6

- వరంగల్ రీజియన్ పరిధిలో ఏడుగురిపై వేటు
- సీసీఐ కొనుగోళ్లలో అవకతవకలే కారణం

రైతులు తిరగబడతారని రాహుల్ పర్యటన రద్దు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

మట్టెవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు తిరగబడతారనే భయంతోనే కాంగ్రెస్ ఎంపీ, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని బీఆర్ఎస్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఆయన వరంగల్ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో రైతు డిక్లరేషన్ ప్రకటించారని, అందులో ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, దీంతో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిలదీస్తారనే భయంతోనే రాహుల్‌గాంధీ ముఖం చాటేశారని అన్నారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తి కాలేదని, పంటలకు బోనస్ బోగస్ అయిందని, రైతు భరోసా డబ్బులు అకౌంట్‌లలో పడలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యాలపై రహస్యంగా సమావేశం నిర్వహించేందుకు రాహుల్ వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని రాహుల్‌కు కూడా తెలుసునని, అందుకే ఈ మీటింగ్‌కు రేవంత్‌ను కూడా పిలవలేదని అన్నారు. రాహుల్ పర్యటన రద్దుకు రేవంత్ పాలనా వైఫల్యమే కారణమని పెద్ది సుదర్శన్‌రెడ్డి చెప్పారు.



ఎండల నేపథ్యంలో వనదేవతల గద్దెల వద్ద చలువ పందిళ్లు వేసిన దృశ్యం

మినీ సంరంభానికి సర్వం సిద్ధం

నేటి నుంచి మేడారం చిన్న జాతర

- మండెమెలుగు పండుగతో ఆరంభం
- వనదేవతల మందిరాలు, గద్దెల వద్ద పూజలు చేయనున్న వడ్డెలు
- నాలుగు రోజులపాటు తల్లుల చెంతకు రానున్న భక్తజనం

7

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సహకారం

- మహిళా సంఘాలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని, మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా సుబేదారి ఫారెస్ట్ ఆఫీస్ ప్రాంతంలో మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన చపాతి(రోటీ) మేకింగ్ యూనిట్‌ను మంగళవారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఓం శ్రీ భద్రకాళి గ్రూపునకు చెందిన సభ్యుల విన్నపం మేరకు చపాతి తయారీ యూనిట్‌కు మెప్మా ఆర్థిక సహాయం అందించిందని అన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోటీ మేకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ యూనిట్‌ను ఇంకా విస్తరింపజేస్తే బల్దియా నుంచి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలనుకునే ఔత్సాహికులు ఎస్‌హెచ్‌జీలను సంప్రదిస్తే రుణం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఈశ్వర్, టీఎంసీ కంజర్ల రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ స్వాతిలతో పాటు సిబ్బంది ఉన్నారు.

పన్నుల వసూళ్లతో ముందుకు సాగాలి

వరంగల్ నగరంలో నివసిస్తున్న ఇండ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల యజమానులు చాలామంది పన్నుల బకాయిలు చెల్లించాలని, బల్దియా సిబ్బంది పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. బల్దియా పరిధిలోని నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలోని సీఎల్‌సీ సెంటర్‌తో పాటు ఈ-సేవా కేంద్రాన్ని కమిషనర్ మంగళవారం



రోటీ మేకింగ్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

ఆకస్మికంగా తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లతీరుపై అక్కడ పని చేసే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి రిజిస్ట్రర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈయేడు ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో పన్నుల వసూళ్లలో వేగం పెంచి నిర్ధిష్ట లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రజలకు పన్ను చెల్లింపులకు సంబంధించిన రశీదులను అందించాలన్నారు. బిల్ నెంబర్‌లను తప్పకుండా ప్రత్యేక రిజిస్ట్రర్‌లో నమోదు చేయాలన్నారు. ఇంకా నెలవారి వసూళ్లకు సంబంధించిన ప్రత్యేక రిజిస్ట్రర్లను కేటాయించాలని అన్నారు. పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్‌తో పాటు అక్కడి సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

భూ సేకరణకు రైతులు సహకరించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు కోసం భూములు ఇచ్చేందుకు రైతులు సహకరించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పాటు గుంటూరుపల్లి, బొల్లికుంట గ్రామాల రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటైతే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నగరాల్లో వరంగల్ కూడా చేరుతుందని, ఇందుకు రైతులు సహకరించాలని కలెక్టర్ కోరారు. రైతులు కోరిన విధంగా రోడ్డు కనెక్టివిటీకి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కేసీఆర్‌ను కలిసిన రాజయ్య

ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి..

రాజయ్యకు కేసీఆర్ సూచన

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు రావడం ఖాయమని, ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ సూచించినట్లు మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు తెలిపారు. మంగళవారం నాయకులతో కలిసి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజయ్య వెంట ఓ కేసులో అరెస్టు అయ్యి 15రోజులపాటు జనగామ సబ్ జైల్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి ఉన్నారు. మనోజ్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను కేసీఆర్ తెలుసుకొని ధైర్యం కోల్పోవద్దు అని, నా సహకారం ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ధర్మసాగర్ మండల మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ నుంచి కడియంతోపాటు కాంగ్రెస్‌లో చేరారు. త్వరలోనే తిరిగి బీఆర్ఎస్‌లో చేరికపైన కేసీఆర్‌తో సంప్రదింపులు జరిపినట్లు రాజయ్య పేర్కొన్నారు. వెయ్యిమంది కార్యకర్తలతో మాజీ జడ్పీటీసీ బీఆర్ఎస్‌లో చేరనున్నారని తెలిపారు. అంతకుముందు రాజయ్య, శ్రీపతిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూష -మనోజ్‌రెడ్డి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి మనోజ్‌రెడ్డి కేసుల విషయాన్ని చర్చించినట్లు తెలిపారు.

నిశ్చితార్థం అయ్యాక పెళ్లికి నిరాకరణ..

రఘునాథపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం అయ్యాక, యువతిపైనిందలు మోపుతూ పెళ్లికి నిరాకరించిన యువకుడిని అరెస్టు చేసినట్టు ఏసీపీ భీమ్ శర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం నరహరి తండాకు చెందిన లవుడ్యా విజయ్‌కుమార్‌కు ఇటీవల నిశ్చితార్థం జరిగింది. వరకట్నం కింద రూ.లక్ష, ఇంటి నిర్మాణం కోసం రెండు లక్షలు తీసుకున్నాడన్నారు. అనంతరం అమ్మాయిని శారీరకంగా వాడుకుని, ఇప్పుడు యువతికి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నదని నింద మోపి పెళ్లికి నిరాకరించాడని వెల్లడించారు. దాంతో బాధితుల ఫిర్యాదు మేరకు విజయ్‌కుమార్‌పై చీటింగ్, పోక్సో కేసు నమోదు మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

నేటి నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క - సారలమ్మ మినీ జాతరకు బుధవారం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ్‌భాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12, 13, 14 తేదీల్లో జరిగే జాతరకు హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద భక్తుల కోసం ఉదయం 6 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సుకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.110, ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులో పెద్దలకు రూ.210, పిల్లలకు రూ.120 చార్జీలు ఉన్నట్లు తెలిపారు. అన్ని ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులలో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, జాతరకు వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అన్నారు. సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఆర్ఎం కోరారు.

తేలిన ఎంపీటీసీ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల లెక్క

- జారీ అయిన తుది ముసాయిదా జాబితాల షెడ్యూల్
- ఈనెల 15న తుది జాబితా ప్రచురణ



హనుమకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకున్నది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను మంగళవారం ప్రకటించారు. ఈనెల 15వ తేదీన తుది జాబితాను ముద్రిస్తారు. ఈ మేరకు షెడ్యూల్ జారీ అయింది. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మొత్తం జనాభా, ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా నోటిఫికేషన్‌ను మంగళవారం ప్రకటించారు. వీటిని జిల్లా పరిషత్ కార్యాలయాలతో పాటు ఆయా మండల కేంద్రాల్లో ప్రదర్శించారు. వరంగల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 3,85,163 కాగా, హనుమకొండ జిల్లాలో 372646 మంది ఓటర్లు ఉన్నారు. వరంగల్ జిల్లాలో మొత్తం 646, హనుమకొండ జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 631 ఏర్పాటు చేశారు. వీటికి రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కూడా నియమించారు. మొదటి సారిగా ఎంపీటీసీ స్థానాలను క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఇద్దరు అంతకన్నా ఎక్కువ మంది రిటర్నింగ్ అధికారులను నియమించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రచురణ షెడ్యూల్ ప్రకారం మంగళవారం పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను ప్రచురించగా, ఈనెల 11 నుంచి 13 వరకు వీటిపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈనెల 13వ తేదీన అన్ని రాజకీయ పార్టీలతో ముసాయిదా జాబితాలపై సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఈనెల 14వ తేదీన అభ్యంతరాలను పరిష్కరిస్తారు. అదే రోజు ముసాయిదా జాబితాలను ఆమోదిస్తారు. పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఈనెల 15వ తేదీన ప్రచురిస్తారు.

వరంగల్ జిల్లా..

వరంగల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 3,85,163 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,89,070 కాగా, మహిళలు 1,960,083 మంది. ఇతరులు 10 మంది. మండలాల వారిగా ఓటర్లు - చెన్నారావుపేటలో 32,062, దుగ్గొండిలో 37,357, గీసుకొండలో 28,876, ఖానాపురంలో 28,253, నర్సంపేటలో 22,501, నల్లబెల్లిలో 31,684, నెక్కొండలో 46,484 మంది, పర్వతగిరిలో 39,978, రాయపర్తిలో 46,491, సంగెంలో 41,981, వర్ధన్నపేటలో 29,496 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం జడ్పీటీసీలు 11 కాగా, ఎంపీటీసీలు 130. మొత్తం పోలింగ్ కేంద్రాలు 646. వీటిలో 400 వరకు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 29 కాగా, 401 నుంచి 500 మధ్య ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 119 ఉన్నాయి. 501 నుంచి 750 వరకు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 40 ఉండగా, 750 నుంచి 787 మంది వరకు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు మరో 44 వరకు ఉన్నాయి.

హనుమకొండల్లాలో..

హనుమకొండ జిల్లాలో మొత్తం ఓటర్లు 3,72,646 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,81,772 మందికాగా, స్త్రీలు 1,90,872 మంది ఓటర్లు ఉన్నారు. ఇతరులు ఇద్దరు ఉన్నారు. మండలాల వారిగా ఓటర్లు భీమదేవరపల్లిలో 41,771, దామెరలో 21,976, ధర్మసాగర్‌లో 38,463, ఎల్కతుర్తిలో 32,726, హసన్‌పర్తిలో 23,809, ఐనవోలులో 34,724, కమలాపూర్‌లో 56,399, నడికూడలో 27,943, పరకాలలో 15,169, శాయంపేటలో 34,300, వేలేరులో 16,522 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం ఎంపీటీసీ స్థానాలు 129. ఎంపీటీసీ క్లస్టర్లు 46. మొత్తం గ్రామ పంచాయతీలు 210. మొత్తం పోలింగ్ కేంద్రాలు 631. వీటిలో 500లోపు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 95, కాగా 500కుపైగా ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 536. పోలింగ్ నిర్వహణకు మొత్తం 58 మంది రిటర్నింగ్ అధికారులను, మరో 58 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. హనుమకొండ జిల్లా పరిధిలోని 12 రూరల్ మండలాల్లో మొత్తం జనాభా 4,34,617. వీరిలో ఎస్టీలు 11,196, ఎస్సీలు 1,04,374, ఇతరులు 3,19,047 మంది ఉన్నారు.

వర్సిటీల బలోపేతానికి మేం ముందుకు వస్తాం

- 65 ఏళ్లు నిండని ప్రొఫెసర్లను విధుల్లో కొనసాగించాలి
- వర్సిటీ ప్రొఫెసర్ల సంఘం రాష్ట్ర నేతల డిమాండ్



ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న ప్రొఫెసర్ సదానందం, వీరన్న, పంతంగి వెంకటేశ్వర్లు తదితరులు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచడంపై రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం నేతలు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ జి.వీరన్న, ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ ఓయూ, జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు వెంకటరమణాదేవి, అత్తర్ సుల్తానా, వెంకటరమణ, కృష్ణమోహన్ హర్షం వ్యక్తం చేశారు. 2025 జనవరి 28 నాటికి జీవో 3 మేరకు రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పని చేసి 65 ఏళ్ల నిండని ప్రొఫెసర్లతో పాటు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సేవలను వినియోగించుకోవాలని, మళ్లీ తమను వర్సిటీల్లో రీఎంట్రీ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతా విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు, రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణాలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా కేయూ ప్రొఫెసర్లు ఎ.సదానందం, ప్రొఫెసర్ జి.వీరన్న, ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కె.డేవిడ్, ఓయూ ప్రొఫెసర్లు మాట్లాడుతూ.. గతంలో 60 ఏళ్లకు రిటైర్డుమెంట్ పొందిన తమను 65 ఏళ్ల వరకు విధుల్లో కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ అధ్యాపకులకు 60 నుంచి 65 ఏళ్ల వరకు రిటైర్డుమెంట్ వయస్సు పెంచిందని, తమకు వర్తింపచేస్తే వర్సిటీల్లో బోధన, పరిశోధన సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు. తమ సేవలను వర్సిటీల్లో సద్వినియోగం చేయాలని, ఆ దిశగా రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వర్సిటీల్లో 2025 జనవరి 28 నాటి రిటైర్డుమెంట్ పొందిన ప్రొఫెసర్లు సుమారు 80 మంది ఉంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకుల సంఘం నేతలు ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ కె.డేవిడ్, ప్రొఫెసర్ కె.విజయబాబు, ఓయూ, జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు వెంకటరమణాదేవి, అత్తర్ సుల్తానా, వెంకటరమణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రంగరాజన్‌ను పరామర్శించిన అర్చక సమాఖ్య నాయకులు



మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి అర్చకున్ని పరామర్శిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు ఎంవీ రంగరాజన్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావులతో కలిసి తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, యాదాద్రి దేవస్థానం పూర్వ అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు, అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి తనుగుల రత్నాకర్ తదితరులతో కలిసి మంగళవారం రంగరాజన్‌ను పరామర్శించారు. రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వ పక్షాన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రంగరాజన్‌పై రామరాజ్యం పేరిట దౌర్జన్యాలకు దిగడం శోచనీయమని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ చర్యపై తీవ్రంగా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించడం హర్షించదగ్గ విషయమని గంగు ఉపేంద్రశర్మ అన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరూ ప్రయత్నించినా చర్యకు ప్రతిచర్య ఉంటుందన్నారు. హిందూ సంఘాలన్నీ ఐక్యమై అర్చక వ్యవస్థను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తరతరాలుగా సంప్రదాయంగా భారతీయ సంస్కృతికి అనుగుణంగా వంశపారంపర్యంగా దేవుడికి సేవలు నిర్వహిస్తున్న అర్చకులను కించపర్చే విధంగా వ్యవహరించే ఎవరి విషయంలోనూ వెనుకాడబోమని ఆయన పేర్కొన్నారు. హిందూ స్తంభాలైన అర్చకులపై దాడిచేస్తున్న వారిని సమాజం నుంచి వెలివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మహాకుంభమేళాకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- రామరాయిని బంగ్లాలో విషాదం
- స్వగ్రామంలో నేడు బాలరాజు అంత్యక్రియలు



కల్యాౄరి బాలరాజు(ఫైల్)

రఘునాథపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో పాల్గొని తిరుగు ప్రయాణంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని రామరాయిని బంగ్లాకు చెందిన కల్యాౄరి బాలరాజు(30) అక్కడిక్కడే మృతి చెందాడు. దాంతో బాలరాజు స్వగ్రామం రామరాయిని బంగ్లాలో విషాదం అలుముకుంది. స్థానికుల కథనం ప్రకారం. బాలరాజు మినీ బస్సు ఓనర్ కం డ్రైవర్‌గా పనిచేస్తూ, హైదరాబాద్‌లోనే నివాసముంటున్నాడు. భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు చంద్రనీల, యశ్వంత్ ఉన్నారు. కాగా, హైదరాబాద్‌లోని నాచారం కార్తీకేయ నగర్‌కు చెందిన ఎనిమిది మందిని తన మినీ బస్సులో ప్రయాగ్‌రాజ్ యాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ జిల్లా సిహోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని మొహ్లా గ్రామం-బార్గి మధ్య కాల్వ వద్ద మినీ బస్సును ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మినీ బస్సులో ఉన్న తొమ్మిది మందిలో ఏడుగురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో బాలరాజు ఉండడంతో రామరాయనిబంగ్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగే అవకాశముందని బంధువులు తెలిపారు. బతుకు దెరువుకోసం హైదరాబాద్ వెళ్లి ఇలా మృత్యువాత పడడంతో కన్నీటిపర్యంతమయ్యారు.



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన ఎస్సైలు

పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి..

సీపీ అంబర్‌కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదోన్నతితోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో ఏఎస్సైలుగా విధులు నిర్వర్తిస్తూ ఎస్సైలుగా పదోన్నతి పొందిన సంపత్, యాదగిరి, విజయ్‌కుమార్‌లు సీపీని మంగళవారం కమిషనరేట్ కార్యాయలంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వీలైనంతవరకు ప్రజలకు న్యాయం చేసేందుకు కృషిచేయాలన్నారు. పోలీసు ప్రతిష్ఠలకు భంగంకల్గించేవిధంగా వ్యవహరించవద్దన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ, నాన్ ప్రొఫెషనల్

పీజీ పరీక్షల వాయిదా

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 17 నుంచి జరుగవలసిన ఎంబీఏ, ఎంసీఏ, ఫిబ్రవరి 20 నుంచి జరిగే పీజీ నాన్ ప్రొఫెషనల్ మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, డాక్టర్ అసీం ఇక్బాల్‌లు మంగళవారం ప్రకటించారు. బ్యాంకులు, సెంట్రల్ రిజర్వు పోలీస్ కాని స్టేబుల్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌తో పాటు ఇతర పోటీ పరీక్షలదృష్ట్యా పరీక్షలను వాయి దా వేసినట్లు వెల్లడించారు. మార్చి మొదటి వారంలో ఆయా పరీక్షల నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

జనగామలో నవోదయ స్కూల్ ఏర్పాటు చేయాలి

విద్యాలయ సమితి కమిషనర్‌కు ఎంపీ కడియం కావ్య వినతి పత్రం



జనగామలో నవోదయ పాఠశాల ఏర్పాటుపై కేంద్ర పాఠశాల విద్యాశాఖ సెక్రెటరీ సంజయ్ కుమార్‌తో చర్చిస్తున్న ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర పాఠశాల విద్య విద్యాశాఖ సెక్రెటరీ సంజయ్ కుమార్, కేంద్ర నవోదయ విద్యాలయ సమితి కమిషనర్ ప్రాచీ పాండేలను కోరారు. డాక్టర్ కావ్య మంగళవారం ఢిల్లీలో సంజయ్ కుమార్, పాండేలను కలిసి ఈ విషయమై చర్చించారు. ఈ మేరకు వినతి పత్రాలను సమర్పించారు. నవోదయ విద్యాలయం ఏర్పాటుకు జనగామ జిల్లాకు అన్ని అర్హతలు ఉన్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. జనగామ జిల్లాలో అత్యధికంగా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలు ఉన్నారని, ఈ ప్రాంతంలో అక్షరాస్యతా శాతం చాలా తక్కువగా ఉందని వివరించారు. జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు.

జనగామలో నవోదయ ఏర్పాటు చేస్తే ఇక్కడికి చేరుకోవడానికి మెరుగైన రవాణా సౌకర్యం ఉందని పేర్కొన్నారు. జాతీయ రహదారితోపాటు రైలు మార్గం కూడా అందుబాటులో ఉందని గుర్తు చేశారు. ఎంపీ అభ్యర్థనకు కేంద్ర నవోదయ విద్యాల సమితి కమిషనర్ ప్రాచీపాండేతో పాటు కేంద్ర పాఠశాల విద్యాశాఖ సెక్రెటరీ సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించారు.

మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్?

- వరంగల్ రీజియన్ పరిధిలో ఏడుగురిపై వేటు
- సీసీఐ కొనుగోళ్లలో అవకతవకలే కారణం!

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోళ్లలో టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగ్గా నమోదు చేయలేదనే కారణంతో రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మంగళవారం ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. వీరిలో వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, ఆదిలాబాద్ కార్యదర్శి మధుకర్, చెన్నూర్ కార్యదర్శి రామాంజనేయులు, పెద్దపెల్లి కార్యదర్శి పృథ్వీరాజ్, జనగామ కార్యదర్శి సంగినేని శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం కార్యదర్శి శ్రీనివాస్, చిన్న కోడూరు కార్యదర్శి పరమేశ్వర్ ఉన్నట్లు తెలిసింది.

కొంపముంచిన టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఎంతమంది రైతులు పత్తి సాగు చేశారు అన్నది వ్యవసాయ శాఖ నుంచి వివరాలు సేకరించి మార్కెటింగ్‌శాఖ ఒక యాప్‌ను రూపొందించింది. దీంతో రైతులు సీసీఐ సెంటర్‌కు వెళ్లి రైతు ఆధార్‌కార్డు, ఊరు పేరు చెప్పగానే ఆ రైతు ఎన్ని ఎకరాలలో పత్తి సాగు చేశారనేది వెంటనే తెలిసిపోతుంది. దాని ఆధారంగా సీసీఐ సెంటర్‌లో రైతు పేరు.. ఎన్ని క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. తదితర వివరాలు నమోదు చేసుకుంటారు. ఆ వివరాల ఆధారంగా సీసీఐ నుంచి మూడు లేదా నాలుగు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ఇదిలా ఉంటే కొందరు రైతులు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశారు. వారి వివరాలు యాప్‌లో ఉండవు. అలాంటప్పుడు రైతు స్థానిక వ్యవసాయశాఖ అధికారి చేత ధ్రువీకరించిన పత్రాలను అందజేస్తే దానిని మార్కెట్ కార్యదర్శులు అమోదించిన తరువాత సీసీఐ సెంటర్లలో నమోదు చేసుకుని పత్తి కొనుగోలు చేస్తారు. అయితే ఇదే అదనుగా కొందరు ఎలాంటి పత్రాలు లేకుండా పత్తి కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు గుర్తించారు. దీంతో పత్తి కొనుగోళ్లలో టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగ్గా నమోదు చేయలేదనే కారణంతో రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఏడుగురు మార్కెట్ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

ఏనుమాముల మార్కెట్ కార్యదర్శిగా జి.రెడ్డికి అదనపు బాధ్యతలు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మలపై సస్పెన్షన్ వేటు పడడంతో ఆ స్థానంలో ప్రస్తుతం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పని చేస్తున్న జి.రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పోలెపాక నిర్మల కంటే ముందు ఏనుమాముల మార్కెట్ కార్యదర్శిగా పని చేసిన అనుభవం ఉంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2251	2100
పల్లికాయ (సూక)	6800	4600
పల్లికాయ (పచ్చిది)	4200	3100
కందులు	6973	5540
పెసళ్లు	7209	5645
పత్తి	7060	5800
పసుపు (కాడి)	7007	6425
పసుపు (గోల)	4629	4303
తేజ మిర్చి	13200	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	14200	11500
యూఎస్341ఏసీ	13350	11500
యూఎస్ 341 కొత్తది	-	-
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



వనదేవతల ప్రాంగణంలోని మంచెకు ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

మినీ సంరంభానికి సర్వం సిద్ధం

నేటి నుంచి మేడారం చిన్న జాతర

- మండెమెలుగు పండుగతో ఆరంభం
- వనదేవతల మందిరాలు, గద్దెల వద్ద పూజలు చేయనున్న వడ్డెలు
- నాలుగు రోజులపాటు తల్లుల చెంతకు రానున్న భక్తజనం

తాడ్వాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మేడారంలో మినీ సంరంబానికి సర్వం సన్నద్ధమైంది. బుధవారం నుంచి 15వతేదీ వరకు నాలుగురోజుల పాటు జరిగే ఈ చిన్నజాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిరోజైన బుధవారం వడ్డెలు.. సమ్మక్క, సారలమ్మలకు మండెమెలిగే పండుగను నిర్వహించనున్నారు. మేడారంలో వనదేవతల గద్దెలతో పాటు సమ్మక్క మందిరం, కన్నెపల్లిలో సారలమ్మ, కొండాయిలో గోవిందరాజులు, పునుగొండ్లలో పగిడిద్దరాజు మందిరాల వద్ద పూజలు చేయనున్నారు. గ్రామ దేవతలకు పూజారులు పూజలు చేసి దుష్టశక్తులు గ్రామంలోకి రాకుండా, తల్లులకు దిష్టి తాకకుండా ఈ పూజలు చేస్తారు. ఇది ఆదివాసీలకు అనాదిగా వస్తున్న ఆచారం. అదేవిధంగా గద్దెల వద్ద జాగారాలు, డోలు వాయిద్యాల నృత్యాలతో నాలుగు రోజులపాటు తల్లుల చెంత సందడిగా మారనుంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో మేడారం చేరుకొని మొక్కులు చెల్లించుకుంటారు. నిలువెత్తు బంగారం (బెల్లం) పసుపు కుంకుమలను సమర్పిస్తారు. మేడారం మినీ జాతరకు సుమారు 30లక్షలకు పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల సౌకర్యాల్లో భాగంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతుండగా.. రూ.5.33 కోట్లతో జిల్లా యంత్రాగం భక్తుల కోసం సౌకర్యాలను కల్పించింది. మినీ జాతర నేపథ్యంలో పోలీసు శాఖ భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర విధులు నిర్వహించనుంది.

పూజా కార్యక్రమాలు

మేడారంలో సమ్మక్క మందిరంలో సిద్దబోయిన వంశీయులు, కన్నెపల్లిలో సారలమ్మకు కాక వంశీయులు, కొండాయిలో గోవిందరాజుకు దబ్బకట్ల వంశీయులు, పునుగొండ్లలో పెనుక వంశీయులు పగిడిద్దరాజు మందిరాల్లో వడ్డెలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముందుగా గుడులను శుద్ధి చేస్తారు. అలికి ముగ్గులు వేస్తారు. అదేవిధంగా గ్రామ దేవతలను పూజిస్తారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. డోలు వాయిద్యాల మధ్య గ్రామానికి నాలుగు వైపులా దిష్టి తోరణాలను ఏర్పాటు చేస్తారు. వనదేవతల గుడుల్లో మొక్కులు చెల్లించుకుంటారు. సాయంత్రం ఇంటి ఇలవేల్పులను ఘనంగా వారి వారి మందిరాలకు చేర్చి కొలువుదీరుస్తారు. అనంతరం గద్దెలకు డోలు వాయిద్యాల మధ్య చేరుకొని రాత్రంతా జాగారం చేస్తారు.

సకల సౌకర్యాలు ఏర్పాటు

వనదేవతల మినీ జాతరకు వచ్చే భక్తులకు జిల్లా యంత్రాంగం సౌకర్యాలను కల్పించింది. తొలుత జంపన్నవాగులో పుణ్యస్నానాలకు 380 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సమకూర్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకులు, 400 బీవోటీలు, శాశ్వత మరుగు దొడ్ల మరమ్మతులు, 170 చేతి పంపుల మరమ్మతులుచేపట్టారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో 400 వందల మంది కార్మికులతో 12 ట్రాక్టర్ల ద్వారా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాల ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వనదేవతల మందిరాలను, గద్దెలను ముస్తాబు చేశారు. పూలు, మావిడి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది.



స్నానఘట్టాలపై బీవోటీల ఏర్పాటు



మేడారంలో సమ్మక్క గుడి



కన్నెపల్లిలో సారలమ్మ గుడి



జాతరకు ముస్తాబైన బయ్యక్కపేటలోని వనదేవతల గద్దెల ప్రాంగణం

వేడుకలకు సిద్ధమైన సమ్మక్క పుట్టిల్లు

తాడ్వాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చంద వంశీయుల ఆధ్వర్యంలో మండలంలోని సమ్మక్క పుట్టినిల్లయిన బయ్యక్కపేట కూడా జాతరకు సిద్ధమైం ది. బుధవారం ప్రారంభమయ్యే ఈ సంబురాల్లో భాగంగా గ్రామంలోని పురాతన గుడిని అలికి ముగ్గులు వేస్తారు. ధూపదీప నైవేద్యాలతో సమ్మక్క తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర సజావుగా జరగాలని భక్తుల కోర్కెలు తీరాలని వేడుకుంటారు. మరుసటి రోజు గురువారం సమీపంలోని దేవునిగుట్టపై కొలువైన సమ్మక్కను పూజారులు గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తారు. చంద వంశీయుల ఆధ్వర్యంలో ఈ తంతు జరుగనుంది. డోలు వాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. చంద వంశీయులు రఘుపతిరావు, పరమయ్య, గోపాల్‌రావు, కల్యాణ్‌కుమార్, కృష్ణమూర్తి, స్వామి, వడ్డెలు సిద్ధబోయిన చలమయ్య, కృష్ణరావు, ఆలెం సమ్మయ్య ఈ పండుగను నిర్వహిస్తారు. ఈ క్రమంలో బుధవారం సమ్మక్క తల్లికి పూజాలు మొక్కులు సమర్పించుకుంటారు. అనంతరం గ్రామ దేవతలకు పూజాలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. అదే విధంగా గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలను ఏర్పాటు చేసి దిష్టి తోరణాలు కడతారు. రాత్రి గుడి వద్ద జాగా రం చేస్తారు. గురువారం ఉదయం గద్దెల పైకి అడెరాలను చేరుస్తారు. సాయంత్రం 6గంటల తర్వాత డోలు వాయిద్యాల నడువ శివసత్తుల పూనకాలతో సమ్మక్క తల్లిని దేవరగుట్ట నుంచి తలపతుల ఆధ్వర్యంలో వడ్డెలు కుంకుమ భరణితో గద్దెకు చేరుకుంటారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. శుక్రవారం మొక్కులు సమర్పించి శనివారం దేవతను వన ప్రవేశం చేయిస్తారు.

మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ దివాకర

ములుగు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం నుంచి జరిగే సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తిచేశామని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవతల దర్శనానికి వచ్చే భక్తులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. గత పదిహేను రోజులుగా మేడారం పరిసరాలలో పారిశుధ్య పనులు చేపట్టామని, ప్రత్యేక వైద్యశిబిరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించడానికి బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేశామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, క్యూలైన్లు, గద్దెల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఏటూరునాగారం మండలం కొండాయి, కన్నాయిగూడెం మండలం ఐలాపూర్‌లో జరుగుతున్న జాతరలకు కూడా ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో చిన్నబోయినపల్లి నుంచి కొండాయి వరకు, తాడ్వాయి-ఊరట్టం మీదుగా కొండాయి వరకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తున్నామన్నారు.

జేఈఈ మెయిన్స్-2025 ఫలితాలలో ఎస్సార్ ప్రభంజనం



వల్లాల నాగసిద్ధార్థ | తాడిపర్తి తేజాస్ ఉద్భవ్ రెడ్డి | ఎం.రాజ వర్షిత్‌రెడ్డి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ (మెయిన్స్)-2025 (సెషన్-1)లో మంగళవారం వెలువడిన ఫలితాలలో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన విజయాలను సాధించి జాతీయ స్థాయిలో విజయ పతాకాన్ని మరోసారి ఎగురవేసినట్లు ఎస్సార్ విద్యాసంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఫలితాలను వివరించారు. ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన వల్లాల నాగసిద్ధార్థ (ఫిజిక్స్‌లో 100 పర్సంటిల్)తో 99.97 పర్సంటైల్, తాడిపర్తి తేజాస్ ఉద్భవ్‌రెడ్డి 99.83, మారం రాజవర్షిత్‌రెడ్డి 99.81, దిడ్డి ప్రజ్వల్ కుమార్ 99.77 సాధించి ఎస్సార్ కీర్తి ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో నిలబెట్టినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా వరుసగా 99.77 పర్సంటైల్, 99.66 99.66 99.66, 99.60, 99.58, 99.58 సాధించారని తెలిపారు. ఇంకా వీరితో పాటు మరో 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్లు హర్షం వ్యక్తం చేశారు. 99 పర్సంటైల్‌కు పైగా సాధించిన విద్యార్థులలో యాద భరణిశంకర్ 99.77 చల్ల అన్సిక 99.66 మేడ కార్తీక్ 99.66 జోగు అభిరామ్ 99.60, కడారి సంజయ్ 99.58 చిన్ని కమలవర్ధన్ 99.58 సాధించడంపై ఎస్సార్ విద్యాసంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్సార్ విద్యా సంస్థల ఛైర్మన్ వరదారెడ్డి, మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలు అభినందించారు.

భవిష్యత్తు లో మరింత అత్యుత్తమమైన మార్కులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. యేటా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు వరదారెడ్డి తెలిపారు.

ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌తో ఎమ్మెల్యేల భేటీ



దీపాదాస్ మున్షిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు

ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీసిన దీపాదాస్

వరంగల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షితో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల, పాలకుర్తి, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ నేత దొమ్మాటి సాంబయ్య ఆమెను మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణలో జరుగుతున్న టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆమె ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పథకాలు అర్హులైన పేదలకు చేరేలా కృషి చేయాలని ఎమ్మెల్యేలను కోరారు. అలాగే ఎమ్మెల్యే కోటాలో సీనియర్ నేత దొమ్మాటి సాంబయ్యకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆరుగురు ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు పోటీ నుంచి తప్పుకుని, పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేశారని ఎమ్మెల్యేలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ఈ విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లతానని ఆమె వారికి హామీ ఇచ్చినట్లుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.



ఐడియా ఆదిరింది.. కోతులను తరిమింది..

ఇటీవల గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. గుంపులుగుంపులుగా సంచరిస్తున్న వానరాలు నివాస ప్రాంతాలతో పాటు పొలాల్లోనూ తిరుగుతూ అందినవాటిని అందినట్టే ధ్వంసం చేస్తున్నాయి. ఈ క్రమంలో మొక్కజొన్న పంటలతో పాటు పలు పండ్లు, కూరగాల తోటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే నర్సంపేట మండలం రాజపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు కోతుల బారినుంచి తన మొక్కజొన్న చేనుకు చుట్టూ పరదా కట్టి మినీ మెగాఫోన్(మైక్) ఏర్పాటు చేశాడు. వాటిద్వారా కుక్కలు అరిచే శబ్దం వచ్చేలా సెట్ చేశాడు. తన చేనును కాపాడుకునేందుకు ఆయన వేసిన 'ఆ ఐడియా అదిరింది.. కోతులను తరిమింది' అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

బర్డ్‌ఫ్లూ.. భయం!



- పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ ప్రభావం
- ఇతర జిల్లాల్లో చనిపోతున్న బ్రాయిలర్ కోళ్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లా యంత్రాంగం అప్రమత్తం

మహదేవపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ భయం పట్టుకుంది. పలు జిల్లాల్లోని పౌల్ట్రీ ఫారాల్లో వైరస్ కారణంగా ఊహించని రీతిలో లక్షలాది బ్రాయిలర్, లేయర్ కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అయితే వైరస్ సోకిన కోళ్ల మాంసం తింటే మనుషులకు కూడా ముప్పు మారే అవకాశముందని సర్కారు హెచ్చరించిన నేపథ్యంలో పౌల్ట్రీపరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ప్రాథమికంగా మిక్స్‌డ్ వైరస్ ఆర్డీ(కొక్కెర రోగం) ప్రభావంతో కోళ్లు మృత్యువాత పడుతుండగా.. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలు గ్రామాల్లో కొక్కెర వ్యాధి బారిన పడిన ఘటనలున్నాయి. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో ఉధృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ వైరస్‌ను నివారించడం, బ్రాయిలర్ ఫారాల రైతులను చైతన్యవంతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనేపథ్యంలోనే ఉమ్మడిజిల్లా యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. వైరస్ తీవ్రత నేపథ్యంలో పౌల్ట్రీ ఫారాల నుంచి కోళ్ల రవాణాను పరిశీలించేందుకు 24 చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే దాణా, పౌల్ట్రీ కోళ్ల దిగుమతిని నిరోధించాలని పోలీసు శాఖను, వలస పక్షుల కదలికలను పర్యవేక్షించాలని అటవీశాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పక్షులు, కోళ్లు, బాతుల ద్వారా బర్డ్ ఫ్లూ మనుషులకు సంక్రమించే ప్రమాదం ఉన్నందున పౌల్ట్రీలో పనిచేసే వ్యక్తులు, కోళ్ల పెంపకం చేపట్టేవారు అప్రమత్తంగా ఉండాలి. పౌల్ట్రీ పరిశ్రమలో పనిచేసే వ్యక్తులు మాస్కులు, గ్లౌస్ ధరించి, చేతులను కడుక్కోవాలి.


బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాండి

బర్డ్ ఫ్లూ అనుమానిస్తే వ్యాధి సంక్రమించిన లేదా చనిపోయిన కోళ్లను వెంటనే వేరు చేసి మాకు సమాచారం ఇవ్వాలి. మహదేవపూర్ వెటర్నరి డాక్టర్ 9121213145, వెటర్నరి జేవీవో 9441596628లో సంప్రదించాలి. రోగం వచ్చిన కోళ్లను తినొద్దు.. ప్రస్తుతం చికెన్ తినే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది.

- డాక్టర్ రాజబాబు, వెటర్నరీ డాక్టర్

మేడారం మినీజాతరపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

నాటుకోళ్ల వైపు భక్తుల మొగ్గు



మేడారంలో ఏర్పాటైన నాటు కోళ్ల దుకాణం

ములుగు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మేడారం మినీ జాతరపై బర్డ్‌ఫ్లూ ప్రభావం కనిపిస్తోంది. వనదేవతలకు ఆదివాసీ సంప్రదాయ పూజలు ఎంత ముఖ్యమో మొక్కుబడిగా జంతు బలులు సమర్పించే తంతు కూడా అంతే ముఖ్యమైంది. కోడిని గద్దెల వైపు గాలిలో ఎగురవేసి ఎదురుకోళ్ల మొక్కు సమర్పిస్తారు. జాతర పరిసరాల్లో విడిదిచేసి వండుకొని బంధుమిత్రులతో విందు చేసుకుంటారు. ఈ క్రమంలో ఎక్కువశాతం మంది బ్రాయిలర్ కోళ్లను, చికెన్‌ను కొనుగోలు చేస్తుంటారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి మృత్యువాతపడుతుండటం, ప్రభుత్వం కూడా అప్రమత్తమై కొద్దిరోజులు చికెన్ తినొద్దని సూచిస్తున్న నేపథ్యంలో చిన్న జాతర భక్తులు నాటుకోళ్లవైపు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో మేడారంలో పలుచోట్ల నాటుకోళ్ల దుకాణాలు కూడా ఏర్పాటయ్యాయి. అయితే ఇప్పటికే మేడారంలో వందకుపైగా బ్రాయిలర్ కోళ్ల దుకాణాలు ఉండగా.. రెండురోజుల క్రితం పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కొమురయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కోళ్ల రక్తం, మల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. చుట్టుపక్కల గ్రామాలలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు వెలుగు చూశాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చికెన్, మటన్ వ్యాపారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆకస్మికంగా ఖరారు.. ఆ వెంటనే రద్దు..

5వ పేజీ తరువాయి



రాహుల్ వస్తారనే సమాచారంతో ఆర్ట్స్ కళాశాల మైదానంలో హెలిపాడ్ వద్ద అధికారులు, పోలీసులు

సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం లేదు. ఈ క్రమంలో రాహుల్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణపై సంబంధిత వర్గాలతో మాట్లాడుతారని పార్టీ వర్గాలకు సమాచారం అందింది. దానికి అనుగుణంగా వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణికి చెందిన సుప్రభ హోటల్‌లో కావాల్సిన ఏర్పాట్లు కూడా చేశారు. సుమారు 75నిమిషాలు ఆయా వర్గాలతో మాట్లాడిన తరువాత, ఉత్తర తెలంగాణలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలపైన పార్టీ నేతలతో కొద్దిసేపు మాట్లాడే అవకాశం ఉంటుందని పార్టీవర్గాలు భావించాయి. ఆ తర్వాత రాహుల్‌గాంధీ రాత్రి 7.15గంటలకు హోటల్ నుంచి బయలుదేరి వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి రాత్రి 7.50గంటలకు తమిళనాడు ఎక్స్‌ప్రెస్ (12622) కోచ్ ఏ1లో చెన్నైకి వెళ్లాల్సి ఉంది. ఈ రైలు జర్నీలో వరంగల్, ఖమ్మం, విజయవాడ మధ్యలో ప్రయాణికులతో రైళ్లలో భద్రత, అందుతున్న ప్రైవేట్ సేవలపై రాహుల్‌గాంధీ చర్చిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కానీ అనూహ్యంగా రాహుల్‌గాంధీ పర్యటన రద్దు కావటం కాంగ్రెస్ వర్గాలను విస్మయానికి గురి చేశాయి.

కాంగ్రెస్ శ్రేణుల డీలా...

తమ నేత రాహుల్‌గాంధీ పర్యటన ఖరారైందని తెలిసిన వెంటనే కాంగ్రెస్ నేతలు విస్తృత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రకటించిన వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే రాహుల్‌గాంధీ హెలికాప్టర్ దిగుతారని తెలియడంతో అక్కడే భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేశారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై రాహుల్‌గాంధీతో మాట్లాడేందుకు ఎమ్మెల్యేలతో పాటు కొంతమంది విద్యావంతులను కూడా ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. వరంగల్‌లో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలోనే రాహుల్‌గాంధీ పర్యటన రద్దయిందంటూ ప్రకటన రావడంతో కాంగ్రెస్ శ్రేణులు అయోమయానికి గురయ్యాయి. ఉదయం 10.30గంటలకే పర్యటన ఖరారై.. మధ్యాహ్నం 1.30గంటలకే రద్దయినట్టుగా సమాచారం రావడంతో వారంతా డీలా పడ్డారు. మూడు గంటల్లోనే ఏం జరిగిందో తెలియక కాంగ్రెస్ కేడర్‌లో అయోమయానికి గురైంది. తన సమీప బంధువు పెళ్లి వేడుకలకు వెళ్లిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆగమేఘాల మీద వరంగల్‌కు తిరిగొచ్చారు. తన అనుచరులతో ఏర్పాట్లు చేయించారు. కానీ రాహుల్ పర్యటన రద్దవడంతో నాయినితో పాటు ఆయన అనుచరులు కూడా డీలా పడ్డారు. అలాగే మరికొందరు ఎమ్మెల్యేలు కూడా హైదరాబాద్ నుంచి వరంగల్‌కు చేరుకునే లోపే పర్యటన రద్దయింది.

పర్యటన రద్దుపై కేడర్‌లో చర్చ

రాహుల్‌గాంధీ పర్యటన రద్దుపై అనేక కారణాలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్‌లో బుధవారం కీలకమైన అంశాలపై చర్చ ఉండటంతో రాహుల్‌గాంధీ అకస్మాత్తుగా తన వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నట్టుగా కాంగ్రెస్ నేతలు చెబుతు న్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగి 31మంది మావోయిస్టులు మరణిం చిన ఘటన నేపథ్యంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో రాహుల్‌గాంధీ రాత్రి జర్నీకి భద్రత వర్గాలు అంగీకరించలేదని, ఆ కారణంగానే రాహుల్ పర్యటన రద్దయిందనే ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల మూలంగానే ఆయన తన పర్యటనను అకస్మాత్తుగా రద్దు చేసుకున్నారనే ప్రచారం కూడా ఉంది. కాగా, రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన నేపథ్యంలో ఆర్ట్స్‌కాలేజీ మైదానంలో పోలీసు బలగాను భారీగా మోహరించారు. లోక్‌సభలో ప్రధానప్రతిపక్ష నేత హోదా ఉండటంతో రాహుల్‌గాంధీ భద్రతపై కేంద్ర బలగాలు దృష్టి పెట్టాయి. ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. సుప్రభా హోటల్‌తో పాటు వరంగల్ రైల్వే స్టేషన్‌లోనూ విస్తృతంగా తనిఖీలు చేశారు. రాహుల్ పర్యటన రద్దు కావడంతో సాయంత్రం 6 గంటలకు కేంద్ర బలగాలు వెనుతిరిగాయి. మొత్తానికి అకస్మాత్తుగా ఖరారై.. అంతలోనే రాహుల్ పర్యటన రద్దు కావటం ఓరుగల్లులో చర్చనీయాంశంగా మారింది.

నేషనల్ జర్నల్ పుస్తకావిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి మహిళా కళాశాల హిస్టరీ విభాగం రూపొందించిన యూజీసీ కేర్ జర్నల్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పింగిళి కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు, అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ సామ్యూల్, ప్రవీణ్ కుమార్, పద్మ తదితరులు పాల్గొన్నారు.



నేషనల్ జర్నల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో రానున్న రోజుల్లో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ శతజయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ఇటీవల దేశంలో అనేక రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బీజేపీని ఓడించడంలో చతికిలపడిందన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని, భారతదేశంలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజాస్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలన్నారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగిపోతున్నాయని, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందని, ఈ క్రమంలో ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారన్నారు. దేశంలో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలిచారని, తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, కొట్టిపాక రవి, బత్తిని సదానందం తదితర నాయకులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే డివిజన్, బస్టాండ్ ఏర్పాటు చేయాలి

రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసి విన్నవించిన ఎంపీ కావ్య

కాజీపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌ను మంగళవారం ఢిల్లీలో వరంగల్ ఎంపీ కడియం కావ్య కలిసి వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రంలో కాజీపేటను రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని, రైల్వే ఆవరణలో నూతనంగా బస్టాండ్ నిర్మించడానికి స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. నూతనంగా బస్టాండ్ ఏర్పాటు చేస్తే వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు, చిన్న తరహా పరిశ్రమలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటీవల వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఏడీఆర్ఎం, జిల్లా కలెక్టర్, మునిసిపల్ అధికారులు ఆర్టీసీ అధికారులు కాజీపేటలో పర్యటించి భూమిని గుర్తించారన్నారు. రైల్వే సంబంధించిన ఎకరం స్థలం ఇస్తే బస్టాండ్ నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొత్తగా ప్రతిపాదించిన నష్కల్ నుంచి చింతలపల్లి, నష్కల్ నుంచి హసన్‌పర్తి గూడ్స్ లైన్ నిర్మాణంపై పునరాలోచించాలని కోరారు. వినతిపత్రం స్వీకరించిన రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్ రైల్వే జీఎంతో ఫోన్‌లో మాట్లాడి రైల్వే బస్టాండ్ నిర్మాణ దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఎంపీ కడియం కావ్య తెలిపారు.



రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ కావ్య

నేటి నుంచి కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 17న మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నుంచి హనుమకొండ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైవీ గణేష్

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ సూచించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు మంగళవారం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ)ఆధ్వర్యంలో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బందికి సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో వైవీ గణేష్, జిల్లా సమాచార అధికారి(డీఐఓ) సుధీర్ మాట్లాడుతూ.. ఇంటర్నెట్‌ను జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా, భద్రంగా ఉపయోగించడం ద్వారా సైబర్ ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఇంటర్నెట్‌ను సురక్షితంగా ఉపయోగించుకునే మార్గాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, నివారణ వ్యక్తిగత డేటా రక్షణపై ప్రతీ ఒక్కరు అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి గౌరీశంకర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ అనంత రామకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత చేతుల్లో దేశ భవిష్యత్

హసన్‌పర్తి ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని హసన్‌పర్తి ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ అధ్యక్షతన రెండు రోజుల పాటు నిర్వహించిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజేతల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత లక్ష్యం వైపు సాగాలన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గం వైపుగా పయణించాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగునంగా సమాజంలో గౌరవంగా జీవించాలని యువతను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునిత, ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలల హెచ్ఎం విజయ లక్ష్మి, సుమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు శీలం పార్థసారథి, వాసుదేవ రావు, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం అధికారి బానోతు దేవిలాల్, ఆఫీస్ సిబ్బంది సీహెచ్ రాజేశ్వర్‌రావు, పూర్వపు వాలంటీర్ మంద రాజేష్, వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో ఆర్‌వోల పాత్ర కీలకం

ఆర్‌డీవో రమేష్ రాథోడ్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్ర అని ఆర్‌డీవో రమేష్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డీవో శిక్షణ తరగతులను అకస్మికంగా తనిఖీ చేసి శిక్షణ పొందుతున్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ఆర్‌వోలదే తుది నిర్ణయమన్నారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్ నుంచి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు ఎన్నికల నిబంధనలకనుగుణంగా పనిచేయాలన్నారు.

ఎటువంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సందేహాలు కలిగినప్పుడు ఆర్‌డీవో స్థాయి అధికారులకు సమాచారం అందించి తుది నిర్ణయం తీసుకోవచ్చన్నారు. ఎన్నికల నిర్వహణలో చిన్న చిన్న సమస్యలు తలెత్తినప్పుడు, శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, నామినేషన్ దరఖాస్తులలో ఇంటి పేరు ముందు వెనకా ఉన్నప్పటికీ ఆర్‌వోలు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ ఎన్నిక కీలకమని తుది ఫలితాల విడుదల సమయంలో ప్రతీ వార్డు మెంబరు నియామక పత్రం అందజేసి ఆర్‌వోల సమక్షంలోనే ఉపసర్పంచ్ ఎన్నిక జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహసీల్దారు చల్ల ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ప్రణయ్, కిరణ్, తిరుపతి, ట్రైనర్లు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో రమేష్ రాథోడ్

ప్రాణాంతక వ్యాధులు ప్రమాదకరం

కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకమైన వ్యాధులతో మానవ మనుగడకు ప్రమాదకరంగా మారకూడదని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రెడ్ రిబ్బక్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన హెచ్ఐవీ, ఎస్‌టీఐ అవగాహన సదస్సులో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందు జాగ్రత్తలు, అవగాహనతోనే వ్యాధుల నివారణ సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరి మానవ జీవితానికి సార్థకత ఉండాలని చెప్పారు. ప్రజల్లో వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండాలని సూచించారు. అవగాహనతో ఎంతటి సమస్యలనైనా దూరం చేయవచ్చని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు. మాదకద్రవ్యాలు, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని సూచించారు. జీవిత లక్ష్యాలను సాధించుకోవాలని ఉద్బోధించారు. తల్లిదండ్రుల కలను నేరవేర్చాలని అన్నారు. ఈ సదస్సులో స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వప్న మాధురి, పి.భవాని జాతీయ సేవా పథకం పీవోలు డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, రిపిక రాజ్‌కుమార్, డాక్టర్ పి.కుమార్, డాక్టర్ గణ్‌సింగ్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా..

టీజేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

న్యూశాయంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గం నుంచి తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని టీజేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ములుగురోడ్‌లోని ఎల్బీకళాశాలలో మంగళవారం హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం చేశారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే 2007, 2013, 2019లో ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయని, అప్పుడు ఇవే సంఘాలు, ఆ అభ్యర్థులే గెలిచారు కానీ.. ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఏమి చేయలేకపోయారన్నారు. ఏమి చేయలేని వీరే మళ్లీ పోటీలో ఉండి మరోసారి ఉపాధ్యాయులను, అధ్యాపకులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని ఉపాధ్యాయులు గమనించాలన్నారు. తనను గెలిపిస్తే ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ వచ్చే దసరా నాటికి సాధించి అర్హత కలిగిన ప్రతీ ఉపాధ్యాయుడు, జూనియర్ లెక్చరర్, డైట్ లైక్చరర్, ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డిప్యూటీ ఐవో పదోన్నతుల అవకాశం కల్పిస్తానన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్‌టీలకు మినిమం టైమ్ స్కేల్స్ ఇప్పిస్తూ ఆరోగ్య కార్డులు, మహిళలకు ప్రసూతి సెలవులు ఇప్పిస్తానని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కూడా 2, 3 జీవో ప్రకారం అప్‌గ్రేడేషన్ చేయిస్తానని, మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.



ఎల్బీ కళాశాలలో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టడీ మెటీరియల్ అందజేత

మడికొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మడికొండ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుండబత్తిన జయరాజ్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం మడికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 50 మంది పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి

మోషన్ జూనియర్ కళాశాల చైర్మన్ వేణుగోపాల్ గౌడ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని మోషన్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అనేది చాలా కీలకమైందని అన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలంటే ప్రతీ విద్యార్థి ఇప్పటి నుంచే క్రమశిక్షణ, సమయ పాలన, ప్రణాళికబద్ధంగా చదవాలని అన్నారు. ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ బరుపాటి గోపి మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో మానసిక ఆందోళనకు గురికాకుండా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపెల్లి సురేందర్ తన సినీ జానపద గేయాలతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో మోషన్ కళాశాల డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వడ్లకొండ వేణు గోపాల్‌గౌడ్

పేరు గొప్ప.. పాలన దిబ్బ..

(5వ పేజీ తరువాయి)

హనుమకొండ కేంద్రంగానే జరుగుతున్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లా అధికారుల ఉమ్మడి సమీక్షా సమావేశాలు కూడా హనుమకొండ కలెక్టరేట్‌లోనే జరుగుతున్నాయి. దీంతో వరంగల్ జిల్లా ఉనికి నామావశిష్టంగా మారిపోయింది.

హనుమకొండలో కొనసాగుతున్న వరంగల్ జిల్లా ఆఫీసులు

- వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయం కాజీపేట దర్గా 100 ఫీట్ల రోడ్డులో ఉంది.
- పౌరసరఫరాల జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం హనుమకొండ రెవెన్యూకాలనీలో కొనసాగుతోంది. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆఫీసు కాజీపేట తారాగార్డెన్ సమీపంలోని గల్లీలో ఉంది.
- జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం కూడా ఇదే ప్రాంతంలో పనిచేస్తోంది.
- జిల్లా షెడ్యూల కులాల సేవా సహకార సంస్థ కార్యాలయం హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీలో నడుస్తోంది.
- తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ ఆఫీసు కూడా ఇక్కడే ఉంది.
- జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం వడ్డెపెల్లిలో నడుస్తోంది.
- బీసీ కార్పొరేషన్, బీసీ వెల్ఫేర్ ఆఫీసుతో పాటు బీసీ స్టడీ సర్కిల్ హనుమకొండ లష్కర్‌బజార్‌లో పనిచేస్తున్నాయి.
- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం హనుమకొండ అంబేద్కర్ భవనానికి ఎదురుగా గల పాత భవనంలో నడుస్తోంది.
- వరంగల్ జిల్లా ట్రెజరీ ఆఫీసు హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో కొనసాగుతోంది.
- జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో ఉంది.
- వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం హనుమకొండ సుబేదారిలోని హనుమకొండ డీఈవో ఆఫీసు పక్కనే కొనసాగుతోంది.
- నీటి పారుదల శాఖ వరంగల్ సర్కిల్ ఆఫీసు కూడా ఇదే చోట ఉంది.
- రోడ్లు భవనాల శాఖ వరంగల్ సర్కిల్ కార్యాలయం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌కు ఎదురుగా గల వీధిలో నడుస్తోంది. పలు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కూడా హనుమకొండలోనే కొనసాగుతున్నాయి.

ఇది కల కాదు చిత్రానికి అవార్డు



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న పిట్టల మధుసూదన్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీదర్శకుడు, రచయిత, నిర్మాత, నటుడు అదీబ్ నజీర్ నిర్మించిన 'ఇది కల కాదు' చిత్రానికి ఉత్తమ చిత్రం అవార్డు రావడం అభినందనీయమని మధుమిత్ర కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వ్యవస్థాపకుడు పిట్టల మధుసూదన్ తెలిపారు. మంగళవారం బాల సముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ కళాకారుడు, టెక్నీషియన్స్‌తో కలిసి నిర్మించిన 'ఇది కల కాదు' చిత్రం విశేషమైన విజయాన్ని సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తారకరామారావు ఆడిటోరియంలో అంతర్జాతీయ సినీ ఉత్సవాల్లో 'ఇది కల కాదు' చిత్రానికి ప్రతిష్ఠాత్మకమైన అవార్డును నిర్మాత అదీబ్ నజీర్‌కు నిర్వాహకులు ప్రదానం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధుమిత్ర ఆర్ట్స్ కల్చరల్ సొసైటీ ప్రతినిధులు బిటవరం శ్రీమన్నారాయణ, గొలిశాల అంజలి, బి.నాగరత్నంతో పాటు నిర్మాత, నటుడు, దర్శకుడు అదీబ్ నజీర్ పాల్గొన్నారు.

కేయూ దూరవిద్య కేంద్రానికి పునర్వైభవం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రానికి పునర్వైభవం తెచ్చేందుకు ఉద్యోగులందరూ కలిసి సమష్టిగా పనిచేయాలని ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బానోతు సురేశ్ లాల్ ఉద్బోధించారు. మంగళవారం ఎస్డీఎల్‌సీఈ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నుంచి నూతన డైరెక్టర్‌గా సురేశ్‌లాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సురేశ్‌లాల్‌ను పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

ప్లాస్టిక్ వస్తువులను విక్రయించొద్దు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బల్దియా ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ హెచ్చరించారు. మంగళవారం గ్రేటర్ పరిధిలోని వరంగల్ పిన్నవారి స్ట్రీట్, కాశీబుగ్గ, దేశాయిపేట, పోచమ్మమైదాన్‌తోపాటు హనుమకొండలో టైలర్‌స్ట్రీట్, కుమార్‌పల్లి, కొత్తూరు, వడ్డెపల్లి, సుబేదారి ప్రాంతాల్లో ప్లాస్టిక్ షాపులపై దాడులు నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్లతో పాటు శానిటరీ జవాన్లతో కలిసి ప్లాస్టిక్ షాపులను తనిఖీ చేశారు. సుమారు రూ.50వేల విలువ గల ప్లాస్టిక్‌ను గుర్తించి షాపుల యజమానులకు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెన్నూరి శ్యాంరాజ్, పోలెపాక అనిల్‌కుమార్, సంపత్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు బొక్క నరేశ్, మరుపల్లి శివకుమార్‌లతో పాటు శానిటరీ జవాన్లు ఉన్నారు.

కులగణన నివేదిక ఆమోదయోగ్యం కాదు

బాలసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కులగణన నివేదికలో బలహీనవర్గాల జనాభాకు సంబంధించిన సమాచారం అశాస్త్రీయంగా ఉండడం వల్ల బీసీలకు నష్టం జరుగుతుందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో వివిధ కుల సంఘాలు, బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కులగణన రిపోర్టులో, 2015లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీల జనాభా 46 శాతానికి ఎలా తగ్గిందని ఆయన ప్రశ్నించారు. అందుకు సరైన వివరణ ఇవ్వకుండా బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. కుల గణన రిపోర్ట్‌పై బీసీ సామాజిక వర్గాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా పునఃసమీక్ష చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. రాహుల్‌గాంధీ సమయం ఇస్తే కులగణనపై ఉన్న అభ్యంతరాల పూర్తి సమాచారం ఆయనకు అందజేస్తామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ నాయకులు దారిబోయిన సతీష్, నూతనకంటి ఆనందం, నేదునూరి రాజమౌళి, ప్రతాపగిరి విజయ్‌కుమార్, సోమిడి అంజన్‌రావు, ఐలాపురం వేణుచారి, డాక్టర్ పాలడుగుల సురేందర్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తిరునహరి శేషు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 12 ఫిబ్రవరి 2025



ఫ్యాషన్

ఝుంకా మెరుపుల్

చెవులకు చిట్టిపొట్టి పోగులు ధరించే రోజులు పోయాయి. ఇప్పుడంతా భారీ ఝుంకాల ఫ్యాషనే! పెళ్లిళ్ల సీజన్లో ఇలాంటి భారీ ఝుంకాలకు గిరాకీ ఎక్కువ. కాబట్టి తాజాగా మహిళలను ఆకట్టుకుంటున్న ఈ ఫ్యాషన్ గురించి తెలుసుకుందామా?



దక్షిణ భారత మూలాలు కలిగిన సంప్రదాయ ఆలయ ఆభరణాలైన ఝుంకాలు గుడి గంట ఆకారంలో తయారవుతూ ఉంటాయి. ఆకారంలో పెద్దవిగా, బరువుగా ఉండే ఈ ఆభరణాలు కాలక్రమేణా కొత్త హంగులు అద్దుకుంటూ వినూత్నమైన డిజైన్లతో రూపొందడం మొదలుపెట్టాయి. ప్రారంభంలో దక్షిణ భారత దేశంలోని భరతనాట్య కళాకారిణులు చంప సరాలతో కలిపి వీటిని ధరించడం మొదలుపెట్టారు. ప్రాంతాన్ని బట్టి భిన్నమైన పేర్లను పొందిన ఈ ఆభరణాలను రాజస్థాన్‌లో మీనాకారి ఝుంకాలుగా పిలుస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో ఇవి పూలు, నెమలి డిజైన్లతో రూపొందుతూ ఉంటాయి. బంగారం, వెండి, వజ్రాలతో రూపొందే ఝుంకాలు వేర్వేరు పరిమాణాలు, డిజైన్లలో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

వేర్వేరు నమూనాల్లో...

గుంఢ్రని, గంటాకారపు, చంద్రాకారపు, శంఖాకార ఝుంకాలు తయారవుతూ ఉంటాయి. వీటిలో పెద్దవీ, చిన్నవీ ఉంటాయి. అయితే ఆకారంలో పెద్దవిగా ఉండే వాటిని అన్ని సందర్భాల్లో ధరించడం వీలు కాదు కాబట్టి వాటిని స్టడ్‌గా, ఝుంకాగా వేర్వేరుగా విడదీసే వీలుండే డిటాచబుల్ నమూనాలు కూడా దొరుకుతున్నాయి. వీటికి మ్యాచ్ అయ్యే చంపసరాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. కాబట్టి పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో భారీ ఝుంకాలనూ, రోజువారీ వాడుక కోసం తేలికపాటి ఝుంకాలను ఎంచుకోవచ్చు. మరీ ముఖ్యంగా సంప్రదాయ వేడుకల్లో టెంపుల్ జ్యువెలరీ విభాగానికి చెందిన ఝుంకాలు చాలా బాగుంటాయి.

నప్పేవాటిని ఎంచుకుని...

ఝుంకాలు భారీగా ఉన్నప్పుడు మెడలో తేలికపాటి ఆభరణాలు ధరించాలి. మెడలో వేసుకునే నెక్లెస్ లేదా చోకర్ భారీగా ఉన్నప్పుడు తేలికపాటి ఝుంకాలు పెట్టుకోవాలి. అలాగే వస్త్రధారణను బట్టి అందుకు తగిన ఝుంకాలను ఎంచుకుంటూ ఉండాలి. ఇలా వేడుక, సందర్భం, వస్త్రధారణల ఆధారంగా తగిన ఝుంకాలను ధరిస్తే చూపరులను ఇట్టే ఆకట్టుకోవచ్చు.





నూనె వాడకం తగ్గించాలంటే..!

వంటకాల్లో అధికంగా నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. నూనె వాడకాన్ని ఎలా తగ్గించాలో తెలుసుకుందాం!

- వంట చేసేటప్పుడు నూనెను నేరుగా బాటిల్‌తో కాకుండా చెంచాతో కొలిచి వేయడం అలవాటు చేసుకోవాలి. కూరలు చేసేటప్పుడు, పచ్చళ్ల తాలింపులో ఎక్కువ నూనెని ఉపయోగించవద్దు.
- మూకుడు నిండుగా నూనె పోసి చేసే వంటకాలకు బదులు ఆవిరి మీద ఉడికించి చేసే అల్పాహారాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వేపుళ్లు తగ్గించాలి. తాలింపు కూరలు చేసుకుంటే శరీరానికి ఎ, డి, కె విటమిన్లు బాగా అందుతాయి.
- అప్పడాలను నూనెలో వేయించకుండా సన్నని మంట మీద కాల్చుకుని తినవచ్చు.
- డీప్ ఫ్రైకి బదులు షాలో ఫ్రై, రోస్ట్, బేకింగ్, గ్రిల్లింగ్, స్టీమింగ్ పద్ధతులను అనుసరించాలి.
- గ్రేవీ ఆధారిత కూరలు, తొందరగా మగ్గే కూరలను తక్కువ నూనెతో చేసుకోవచ్చు. మాంసాహార కూరలు చేసేటప్పుడు అవసరమైనంతే నూనె వాడాలి.
- దోశలు చేసేటప్పుడు పెనం మీద చెంచాతో నూనె రాయడానికి బదులు ఒక పెద్ద ఉల్లిపాయను మధ్యకు కోసి దానితో రుద్దితే చాలు. కావాలనుకుంటే దోశమీద బ్రష్‌తో కొద్దిగా నూనె రాసుకోవచ్చు. చపాతీలు కాల్చేటప్పుడు కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి.
- కూరగాయల ముక్కలను ముందుగానే ప్రెజర్ కుక్కర్ లేదా ఓవెన్‌లో ఉడికించి తరవాత తేలికపాటి తాలింపుతో కూరలు చేసుకుంటే ఆరోగ్యానికి మంచిది.
- నెలకి ఎంత నూనె వాడుతున్నామో ఒక పుస్తకంలో రాసి పెట్టుకోవాలి. దీనివల్ల నూనె వాడకంపై ఒక అవగాహన వస్తుంది.



అది అపురూప ఘట్టం

విజేత



పేదరికమనే అడ్డుగోడలు దాటి... ఒకరికి ఒకరు స్ఫూర్తిగా ఎదిగిన నేపథ్యం. కష్టాన్ని పెట్టుబడిగా పెట్టి... స్వయంకృషితో సాధించిన విజయం. కానిస్టేబుల్ అయిన గురువుకు... అదే పోలీసు స్టేషన్‌కు ఎస్ఐగా వచ్చి అపురూప కానుక ఇచ్చారు ఓ శిష్యురాలు. ఆమే... రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ప్రొబెషన్)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జబీనా బేగం. ఈ ప్రయాణంలో తనకు ప్రేరణగా నిలిచిన గురువు గురించి... సమస్యలు, సవాళ్లను అధిగవించి అందుకున్న లక్ష్యం గురించి ఆమె 'నవ్య'తో సంభాషించారు.

'సమస్యలు, సవాళ్లు అందరికీ ఎదురవుతాయి. వాటిని తట్టుకొని నిలబడితేనే జీవితం ముందుకు సాగుతుంది. ఈ తత్వం నాకు చిన్నప్పుడే బోధపడింది. అందుకే పేదరికం ప్రతిబంధకంగా మారినా... దాన్ని సాకుగా చూపి వెనకడుగు వేయదలుచుకోలేదు. ఎవరో వచ్చి ఏదో చేస్తారనీ ఎదురుచూడలేదు. నా కాళ్లపై నేను నిలబడాలని నిశ్చయించుకున్నాను. అనుకున్నది సాధించాను. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మక్త వెంకటాపూర్‌లో ఓ నిరుపేద కుటుంబం మాది. మా అమ్మ దౌలత్‌బేగం. నాన్న మహమ్మద్ షరీఫ్. మేం ముగ్గురు సంతానం. అన్నయ్య మహమ్మద్ సలీం, చెల్లెలు ఆఫ్రీన్‌బేగం. ఊళ్లో ఉన్న చిన్న కిరాణా దుకాణం మినహా మాకంటూ మరే ఆధారం లేదు. షాపు మీద వచ్చే కొద్దిపాటి ఆదాయంపైనే మా కుటుంబం అంతా ఆధారపడేది. ఈ పేదరికం నుంచి బయటపడాలంటే నాకున్న ఒకేఒక్క దారి చదువు. ఈ విషయం గ్రహించి, మానకుండా రోజూ బడికి వెళ్లేదాన్ని. ఏడో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. ఎనిమిదో తరగతి రాజేంద్రనగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చేరాను. పదో తరగతిలో మంచి మార్కులు రావడంతో... పరిగిలోని ప్రతిభ ప్రైవేటు జూనియర్ కాలేజీవారు ఉచితంగా సీటుతో పాటు స్కాలర్‌షిప్ కూడా ఇచ్చారు. ఇంటర్ తరువాత హైదరాబాద్‌లో డిగ్రీ చదివాను.

పాఠాలు చెబుతూ...

వెంకటాపూర్ మారుమూల గ్రామం. చిన్న తండా. అక్కడ కిరాణా దుకాణంపై వచ్చే ఆదాయం ఏ మూలకూ సరిపోయేది కాదు. ఆపై మా చదువులు. అమ్మానాన్నలకు తలకు మించిన భారమైంది. ఆర్థిక ఇబ్బందులనుంచి బయటపడడానికి మా ఊరు వదిలి, హైదరాబాద్ గౌలిదొడ్డికి వచ్చాం. అమ్మానాన్న... ఆ ప్రాంతంలోని రోడ్డు పక్కన చిన్న హోటల్ పెట్టారు. కానీ మా అందరి చదువులకూ ఆ సంపాదన సరిపోయేది కాదు. అమ్మానాన్న మా కోసం ఇంత కష్టపడుతున్నారు. వాళ్ల శ్రమ కొంతైనా తగ్గించాలన్న ఉద్దేశంలో డిగ్రీ అవ్వగానే నార్సింగిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో పాఠాలు చెప్పాను. ఆ డబ్బు నా గ్రూప్స్ కోచింగ్‌కు ఉపయోగపడింది.

ఆ తపనతోనే...

నా చుట్టూ ఉన్నవారితో పోలిస్తే నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని కోరుకొంటాను. బడి వయసులో అయినా... చేసే ఉద్యోగంలో అయినా! చదువుకొనే రోజుల్లో నేను స్కూల్ లీడర్‌ని. అంతేకాదు.. టీచర్లు చెప్పే పాఠాలు అర్థం కాని కొందరు తోటి విద్యార్థులకు వివరించి చెప్పేదాన్ని. పాఠ్యాంశాలపై పట్టు సాధించడానికి అది నాకు ఉపయోగపడింది. అన్నిటికీ మించి మా అమ్మకు నాపై నమ్మకం. నేను ఏంచేసినా ముందు అమ్మకు చెబుతాను. అన్నయ్య కూడా ఎంతో సహకారం అందించాడు. వారి ప్రోద్బలంవల్లే కట్టుబాట్లను దాటి నేను లక్ష్యం వైపు వెళ్లగలిగాను.

పెళ్లి ప్రస్తావన పక్కన పెట్టి...

నాలుగేళ్ల కిందటి మాట ఇది. ఇంటర్ చదువుతున్న రోజుల్లో నాకు పెళ్లి చేద్దామని నిర్ణయించారు మా ఇంట్లోవాళ్లు. సంబంధం కూడా కుదిరింది. అయితే అప్పుడే పెళ్లి చేసుకొంటే నా జీవితం అంతటితోనే ఆగిపోతుందని భావించాను. నాకంటూ కొన్ని లక్ష్యాలున్నాయి. వాటిని చేరాకే పెళ్లయినా... మరేదైనా అనుకున్నాను. ఇదే విషయం అమ్మానాన్నలకు చెప్పాను. విషయం మా లెక్చరర్ లాల్యానాయక్‌కు తెలిసింది. ఆయనది కూడా నిరుపేద కుటుంబం. వికారాబాద్ జిల్లా పరిగి మండలం చౌదరిగూడ స్వస్థలం. నేను బాగా చదువుతానని నన్ను ఎంతో ప్రోత్సహించారు. నా పెళ్లి గురించి తెలియగానే ఆయన మా ఇంటికి వచ్చి అమ్మానాన్నలతో మాట్లాడారు. నేను, అన్నయ్య కూడా నచ్చజెప్పడంతో, అమ్మావాళ్లు ఒప్పుకున్నారు. నా పెళ్లి ప్రస్తావన పక్కన పెట్టారు.

స్నేహితుల సహకారం...

పెళ్లయితే ఆగింది. కానీ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ఖర్చుతో కూడుకున్నది. అంత డబ్బు సమకూర్చే వెసులుబాటు మా ఇంట్లో లేదు. తినడానికి తిండి కూడా లేని సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నా స్నేహితులు మమత, షహనాజ్ నన్ను ఆదుకున్నారు. ఏడాదిపాటు వాళ్ల ఇళ్లల్లోనే ఉన్నాను. ఓయూలో మరో స్నేహితురాలు అనూష దగ్గర కొన్ని నెలలు ఉన్నాను. తన కార్డు మీదే భోజనం చేసేదాన్ని. తెలిస్తే బాధపడతారని ఈ విషయం ఇవాల్టి వరకు ఇంట్లోవాళ్లకు చెప్పలేదు. అలా మా ఇంటికి వెళ్లకుండా ఏడాదికి పైగా గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యాను. ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది నా పట్టుదల. అయితే పోలీసు కొలువు కోరుకోలేదు. కానీ గత ఏడాది పరీక్షలు రాస్తే ఎస్ఐ ఉద్యోగం వచ్చింది. అంతే... మా ఇంట్లోవాళ్ల ఆనందానికి అవధులు లేవు. దీని వెనుక నా పట్టుదల, కృషి మాత్రమే కాదు... మా గురువు గారు ఇంటర్ తరువాత, ఉద్యోగం వచ్చేవరకు నాకు మార్గదర్శనం చేశారు. నా స్నేహితులు నాకు అండగా నిలిచారు. వారందరి ప్రోత్సాహం, సహకారం వల్లే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం మా చెల్లెలు కూడా కానిస్టేబుల్‌గా ఎంపికైంది.

ఉద్వేగ క్షణం...

మా గురువు లాల్యానాయక్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఎంఏ, బీఎడ్ పూర్తి చేశారు. కొన్నాళ్లు లెక్చరర్‌గా పని చేశారు. కరోనా సమయంలో కళాశాల మూతపడటంతో ఉపాధి కోల్పోయారు. పోటీ పరీక్షలకు సిద్ధమై, 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం మొయినాబాద్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్నారు. ఇప్పుడు నేను ఏడాది శిక్షణ పూర్తి చేసుకొని అదే పోలీసు స్టేషన్‌కు ఎస్ఐ (ప్రొబెషన్)గా వచ్చాను. స్టేషన్‌లోకి అడుగుపెట్టే సమయంలో... ప్రధాన ద్వారం వద్ద కానిస్టేబుల్‌గా మా గురువు నాకు సెల్యూట్ కొట్టినప్పుడు ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. తన శిష్యురాలిని తనకంటే ఉన్నత స్థానంలో చూసి ఆయన మురిసిపోయారు. ఎంతో గర్వపడ్డారు. నా జీవితంలోనే అపురూప ఘట్టం అది. ఇద్దరి నేపథ్యం ఒక్కటే... పేదరికం. దృఢ సంకల్పంతో దాన్ని అధిగమించి అనుకున్నది సాధించాం. నాలాంటి అమ్మాయిలకు చెప్పేది ఒక్కటే... నిబద్ధతతో కష్టపడితే ఏదీ అసాధ్యం కాదు."



- ఆర్.యాదయ్య, మొయినాబాద్

సోఫా కవర్ల మట్టి వదిలించాలంటే...

సోఫా కవర్లను కాటన్, మైక్రోఫైబర్, పాలిస్టర్, లినెన్, వెల్వెట్ ఫాబ్రిక్‌లతో రూపొందిస్తూ ఉంటారు. ఫాబ్రిక్‌ని బట్టి వీటిని శుభ్రం చేసే విధానం మారుతూ ఉంటుంది. వివిధ రకాల సోఫా కవర్లను ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం!

- ముందుగా సోఫాపై ఉన్న లేబుల్‌ను పరిశీలిస్తే కవర్‌ను ఏ మెటీరియల్‌తో రూపొందించిందీ తెలుస్తుంది. దాన్ని శుభ్రం చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఒక అవగాహన వస్తుంది.



- కాటన్, పాలిస్టర్, లినెన్, వెల్వెట్ కవర్లను వాషింగ్ మెషిన్‌లో వేసేకన్నా చేతితో ఉతకడం మంచిది. దీనివల్ల ఫాబ్రిక్ నాణ్యత పాడవకుండా ఉంటుంది. ముందుగా వీటిని మంచినీళ్లలో ముంచి తీయాలి. తరవాత సర్ఫ్, షాంపూ, డిటర్జెంట్ కలిపిన నీళ్లలో ఇరవై నిమిషాలు నానబెట్టాలి. చేతులతో సున్నితంగా ఉతికి గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి. గట్టిగా పిండకుండా నీడలో ఆరేయాలి. ఇవి పూర్తిగా ఆరిన తరవాత వెల్వెట్ వినహా అన్నింటినీ తక్కువ వేడితో ఇస్త్రీ చేస్తే కొత్తవాటిలా మెరుస్తాయి.
- మైక్రోఫైబర్ కవర్లు చాలా సున్నితంగా ఉంటాయి. ముందుగా వీటిని బాగా దులిపి దుమ్ము, ధూళి వదిలించాలి. తరవాత డిటర్జెంట్ లేదా షాంపూ కలిపిన నీళ్లలో ముంచి తీయాలి. మరోసారి చల్లని నీళ్లలో ముంచి తీసి నీడలో ఆరేయాలి.
- లెదర్ కవర్ల మీద దుమ్ము నిలవదు. కాబట్టి వీటిని శుభ్రం చేయడం తేలిక. పలుచని బట్ట లేదా స్పాంజ్‌ని డిటర్జెంట్ నీళ్లలో ముంచి పిండాలి. దీనితో కవర్‌ను శుభ్రంగా తుడవాలి. తరవాత ఫ్యాన్ గాలికి ఆరనిస్తే సరిపోతుంది.
- సోఫా కవర్లను తరచూ వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేస్తూ ఉంటే వాటిపై పేరుకునే దుమ్ము పోతుంది. మరకలు పడితే వెనిగర్, ఆల్కహాల్, శానిటైజర్ వేసిన దూదితో రుద్ది తొలగించాలి. దీంతో కవర్లను వెంట వెంటనే డ్రైక్లీనింగ్ లేదా ఉతికే అవసరం రాదు.

శిరోజాల అందానికి...

కాఫీ పొడిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్నేకాదు శిరోజాలను కూడా ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడతాయి. కాఫీ పొడితో హెయిర్ మాస్క్ తయారు చేసుకుని వాడితే శిరోజాలు అందంగా పెరుగుతాయి.

- ఒక గిన్నెలో రెండు చెంచాల కాఫీ పొడి, ఒక కప్పు పెరుగు వేసి బాగా కలపాలి. పెరుగు స్థానంలో కలబంద గుజ్జును కూడా కలపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని మాడుకు, శిరోజాల కుదుళ్ల నుంచి చివరి వరకు పట్టించాలి. గంటసేపు ఆరిన తరవాత మైల్డ్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే జుట్టు సమస్యలన్నీ తొలగి పోతాయి. కుదుళ్లు బలంగా మారతాయి. తల వెంట్రుకలు నల్లగా పొడవుగా పెరుగుతాయి.
- ఒక గ్లాసు నీళ్లలో రెండు చెంచాల కాఫీ పొడి వేసి బాగా మరిగించండి. తరవాత వడకట్టి చల్లారనివ్వండి. ఈ నీటిని తలంతా పట్టించి ఇరవై నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో తలస్నానం చేయండి. ఇలా పదిరోజులకోసారి చేస్తూ ఉంటే శిరోజాలు నల్లగా మెరుస్తాయి. మాడు మీద చర్మానికి తేమ అంది చుండ్రు రాదు.



"రెండొందలు సంపాదిస్తే అయిదొందలు డాక్టర్‌కి ఇవ్వాల్సి వస్తోంది. బీడీ చుట్టే పని నిజంగా మంచిదేనంటారా?"... ప్రతి కార్యక్రమంలో బీడీ కార్మికులకు 35 ఏళ్ల అజీజీ బీబీ సూటిగా వేసే ప్రశ్న. "ఇది మా బతుకులకు అద్దంపట్టే ప్రశ్న" అంటున్న ఆమె... బీడీ కార్మికురాలి నుంచి సామాజిక ఆరోగ్య కార్యకర్తగా మారి, ఎన్నో జీవితాల్ని బాగు చేస్తున్నారు.

ఆమె లక్ష్యం... పొగాకు లేని గ్రామం



"పెళ్లిచూపుల్లో మా అత్తింటివారు నాతో మాట్లాడిన మొదటిమాట.. "నువ్వు రోజుకు ఎన్ని బీడీలు చుట్టగలవు" అని. అలా అడగడం అసంబద్ధం కాదు, ఆశ్చర్యకరం అంతకన్నా కాదు. ఎందుకంటే ఇంటి పనులతో పాటు బీడీలు వేగంగా చుట్టడం మా ప్రాంతంలోని ఆడపిల్లలకు తప్పనిసరి అర్హత. నేను నా పన్నెండో ఏట మొదటి బీడీని చుట్టాను. మాది పదిమంది పిల్లలున్న కుటుంబం. నాన్న రైతు. ఆయన సంపాదనతో ఇల్లు గడపడం కష్టమయ్యేది. మా అమ్మ, మిగిలిన పిల్లలం బీడీలు చుట్టేవాళ్ళం.

ప్రమాదమని తెలీదు...

మాది పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లా దోహితపూర్ గ్రామం. దేశంలో ప్రముఖ బీడీ తయారీ కేంద్రంగా మా ప్రాంతం ప్రసిద్ధి. మా ఒక్క గ్రామంలోనే 3వేల మంది బీడీలు చుట్టేవారు. వారిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలే. వెయ్యి బీడీలు చుడితే రూ.200 ఇస్తారు. రోజంతా పని చేస్తే మూడు వేల బీడీల వరకూ చుట్టొచ్చు. పెట్టుబడి లేకుండా, వేరే చోటికి వెళ్ళాల్సిన పని లేకుండా... డబ్బు సంపాదించడం, తద్వారా వచ్చే ఆర్థిక స్వాతంత్ర్యం బాగా ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు. నేను బడిలో చదువుతున్నప్పుడు... బీడీలు చుట్టడం అమ్మ నాకు నేర్పింది. ఖాళీ సమయంలో ఆ పని చేసేదాన్ని. వచ్చిన డబ్బులు మా చదువులకి ఉపయోగపడేవి. బాగా చదువుకోవాలనీ, ప్రభుత్వోద్యోగం చెయ్యాలనీ నేను కలలు కనేదాన్ని. కానీ పదహారేళ్ళు రాగానే... చదువు మాన్పించేసి పెళ్ళి చేశారు. కొన్నాళ్ళకు ఇద్దరు పిల్లలు పుట్టారు. పెరుగుతున్న ఇంటి ఖర్చులు భరించాలన్నా, పిల్లలను బాగా చదివించుకోవాలన్నా బీడీలు చుట్టడం తప్ప నాకు మరో అవకాశం లేదు. అందుకే అది కొనసాగించాను. కానీ ఎన్నో ఏళ్ళు ఈ పని చేస్తున్నా.. అది ఎంత ప్రమాదకరమైనదో నాకు తెలీదు.



ప్రత్యామ్నాయం ఏమిటని అడిగేవారు...

మా గ్రామంలో... మా అబ్బాయిలతో సహా చాలా మంది పిల్లలకు శరీరం మీద దద్దుర్లు రావడం ప్రారంభమయింది. కొన్నాళ్ళకు మా మేనత్తకు వైద్య పరీక్షల్లో క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. అప్పటికి కూడా దీనికి కారణం ఏమిటో గ్రహించలేకపోయాను. 2014లో... తోటి మహిళల ప్రోత్సాహంతో 'అంబుజా ఫౌండేషన్'లో సామాజిక ఆరోగ్య కార్యకర్తగా చేరాను. వాళ్ళు నిర్వహించిన అవగాహన కార్యక్రమం నా కళ్ళు తెరిపించింది. పొగాకుతో, బీడీ ఆకులతో పని చెయ్యడం వల్ల వాటి దుమ్ము, సూక్ష్మ కణాలు శరీరంలోకి ప్రవేశిస్తాయనీ, ఆస్మా, క్షయ లాంటి ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్, చర్మ వ్యాధులు, వంధ్యత్వం, తరచూ గర్భస్రావాలు, ప్రసవ సమయంలో తల్లుల మరణాలు, మృత శిశు జననాల లాంటివాటికి కారణమవుతాయని ఆ సంస్థ ప్రతినిధులు వివరిం చినప్పుడు ఎంతో భయంవేసింది. ఎలాంటి పెట్టుబడీ లేకుండా చేస్తున్న ఈ పనికి మేము చెల్లిస్తున్న మూల్యం మా ప్రాణాలని అర్థమయింది. ఆరోగ్య కార్యకర్తగా ఇంటింటికీ తిరిగాను. వందల్లో సంపాదన ఉందని ఈ పని కొనసాగిస్తే... క్యాన్సర్ లాంటి వ్యాధుల చికిత్సకు లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందనీ, బతికే అవకాశాలు చాలా తక్కువనీ వివరించాను. నేను చెప్పిన విషయాలు విని ప్రజలు ఆందోళనకు గురయ్యేవారు. ఒకవైపు బీడీల తయారీ మానుకోలేని పరిస్థితి. మరోవైపు దానివల్ల వచ్చే అనారోగ్యాలకు వేలు, లక్షల రూపాయలు ఖర్చు చేయలేని దుస్థితి. "దీనికి ప్రత్యామ్నాయం ఏమిటి?" అని ప్రతి ఒక్కరూ అడిగేవారు. దానికి నా దగ్గర సరైన సమాధానం లేదు.


చేయాల్సింది ఎంతో ఉంది...

ఎందుకంటే ముఖ్యంగా మహిళలకు మా ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు తక్కువ. ప్రభుత్వ పథకాల గురించి అవగాహన లేదు. వారి కోసం ఏదైనా చేయాలని.. అంబుజా ఫౌండేషన్ సహకారంతో ప్రయోగాత్మకంగా గ్రామంలోని మహిళలు మేకలు, కోళ్ళ పెంపకం ప్రారంభించాం. 150 మందికి పైగా మహిళలు దానిద్వారా ఉపాధి పొందుతున్నారు. మరికొందరికి కుట్టు మిషన్ల కోసం, చిన్న వ్యాపారాల కోసం సాయం అందించాం. ఇప్పుడు మా ఊర్లో బీడీలు చుట్టే పని 67 శాతం మేర తగ్గిపోయింది. గతంలో ఇంటికే పరిమితమైనవారు ఇప్పుడు కొత్త ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ బయటకు వస్తున్నారు. మరోవైపు మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం కూడా పని చేస్తున్నాను. 350 మందికి పైగా మహిళలకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రసవాలు జరిపించాను. అయితే గ్రామంలో ఆరోగ్య పరీక్షలు జరిపించినప్పుడు... సగటున ప్రతి కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని తేలింది. వారికి ఆసుపత్రులు, ఇతర సంస్థల సాయంతో సేవలు అందిస్తున్నాం. దీనంతటికీ కారణం పొగతాగడం, పొగాకు నమలడం. అవి మానకపోతే ఎదురయ్యే ప్రమాదాలపై ప్రచారం చేస్తున్నాను. పొగాకు వాడకం పూర్తిగా లేని గ్రామంగా మా ఊరు నిలవాలన్నదే నా కోరిక. దానికోసం చేయాల్సిన కృషి ఇంకా ఎంతో ఉంది."

ఏఐ విషయంలో దేశాలు కలిసికట్టుగా పనిచేయాలి

» పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు మోదీ సహాధ్యక్షత

» తదుపరి ఏఐ సదస్సు భారత్‌లో నిర్వహిస్తామని ప్రకటన


మేక్రాన్‌తో ప్రధాని మోదీ

పారిస్, ఫిబ్రవరి11: కృత్రిమ మేధ విషయంలో ప్రపంచ దేశాలు కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధాని మోదీ చెప్పారు. పారదర్శకతను, నమ్మకాన్ని పెంపొందించే ఓపెన్ సోర్స్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, పక్షపాతం, అంక్షలు లేని ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అవసరమని నొక్కి చెప్పారు. పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్‌తో కలిసి సహాధ్యక్షత వహించారు. పలు దేశాధినేతలు, ఏఐ నిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తదుపరి ఏఐ సదస్సు భారత్‌లో నిర్వహిస్తామని మోదీ ప్రకటించారు. పరిపాలన అంటే ప్రత్యర్థులను ఎదుర్కోవడం, ప్రమాదాలు రాకుండా చూసుకోవడం మాత్రమే కాదని, ఆవిష్కరణలను ప్రోత్సహించి ప్రపంచ ప్రయోజనాలకోసం అమలు చేయాలని మోదీ సూచించారు. సైబర్ సెక్యూరిటీ, డీప్ ఫేక్స్ తప్పుడు సమాచారానికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించాలన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే అపోహ ఉందని, కేవలం పనిచేసే పద్ధతుల్లో మార్పులు వస్తాయని, కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందని మోదీ చెప్పారు.

బెంగాల్‌లో టీఎంసీ ఒంటరిపోరు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కాంగ్రెస్‌కు మరో 'ఇండీ' కూటమి పార్టీ ఝలక్ ఇచ్చింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జట్టుకట్టే ప్రసక్తే లేదని టీఎంసీ అధినేత, సీఎం మమతా బెనర్జీ తేల్చేశారు. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్లో జరిగే ఈ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు. దరిమిలా టీఎంసీ ఎంపీలు మంగళవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునాదే లేదని.. సొంత పార్టీని పణంగా పెట్టి కూటమి బలోపేతానికి ప్రయత్నించబోమన్నారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమికి కాంగ్రెస్ కారణమని బర్ధమాన్-దుర్గాపూర్ టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ మండిపడ్డారు. విత్రపక్షాలకు ఆ పార్టీ వెన్నుపోటు పొడుస్తోందన్నారు. అసలు ఇండీ కూటమిలో ఉండే హక్కే కాంగ్రెస్‌కు లేదన్నారు. 'కాంగ్రెస్ మునిగిపోయే నావ. దురహంకారంతో వ్యవహరిస్తోంది. కూటమికి మమత సారథిగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు' అని వ్యాఖ్యానించారు. మమతకు సమాజ్‌వాదీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ కూడా మద్దతు ప్రకటించారు. రాజకీయాల్లో ఎప్పటికప్పుడు సమీకరణలు మారుతుంటాయని, ఎన్నికల ముందు పరిస్థితులు మారవచ్చని జేఎంఎం ఎంపీ మహువా మాజీ అన్నారు.

రాజ్యసభలో రాజ్యాంగంపై వాడీవేడి చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: పార్లమెంట్ చేసిన సవరణలతో పాటు 22 సూక్ష్మ చిత్రాలను కలిగి ఉన్న, దాని రూపకర్తలు సంతకం చేసిన రాజ్యాంగాన్ని మాత్రమే ప్రామాణికమైనదిగా ప్రకటించాలని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగ విరుద్ధంగా తొలగించిన ఒరిజినల్ చిత్రాలను తిరిగి చేర్చాలని ధన్‌ఖడ్ డిమాండ్ చేశారు. దేశంలో అత్యధికంగా అమ్ముడుపోయిన రాజ్యాంగ ప్రతుల్లో 22 సూక్ష్మచిత్రాలు గల్లంతయ్యాయనే అంశాన్ని బీజేపీ ఎంపీ రాధామోహన్ దాస్ అగర్వాల్ ప్రస్తావించారు. వాటిలో రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, మహావీరుడు, సామ్రాట్ విక్రమాదిత్య, ఝాన్సీ లక్ష్మీబాయి, ఛత్రపతి శివాజీ, మహాత్మాగాంధీ తదితర చిత్రాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ఖర్గే మాట్లాడుతూ 'రాజ్యాంగంపై వివాదాన్ని సృష్టించడానికే బీజేపీ ఈ అంశాన్ని అనవసరంగా లేవనెత్తుతోందన్నారు. అంబేడ్కర్, పటేల్, ఇతరులు జీవించి ఉన్నప్పుడు దీనిపై ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు కొత్త సమస్యలు తెస్తున్నారు. ఇది అంబేడ్కర్‌ను కించపరిచే ప్రయత్నం' అని ఆరోపించారు. నిరసనగా కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

పంజాబ్ సీఎంగా కేజ్రీవాల్?

» లూధియానా ఉప ఎన్నికలో పోటీ చేసే అవకాశం

» మాన్‌పై ఆప్ ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ పంజాబ్ సీఎం కావాలని యోచిస్తున్నారా? అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. త్వరలో లూధియానాలో జరగబోయే ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, మాన్‌ను తప్పించి...కేజ్రీవాల్ పంజాబ్ సీఎం అయ్యే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే ఢిల్లీలోని కపుర్తలా హౌస్‌లో పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ సమావేశమయ్యారని ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ ఎన్నికల్లో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపేందుకే సమావేశం నిర్వహించారని పైకి చెబుతున్నా కేజ్రీవాల్ మనసులో మాట పంజాబ్ సీఎం పదవేనని తెలుస్తోంది. మరోవైపు, పంజాబ్‌లో కనీసం 40 మంది ఎమ్మెల్యేలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బాజ్వా చెప్పడం కలకలం రేపింది. పంజాబ్ ఆప్‌లో చీలిక తప్పదనే వదంతులకు ఆయన వ్యాఖ్యలు ఆజ్యం పోశాయి. చాలామంది ఆప్ ఎమ్మెల్యేలు సీఎం మాన్ వ్యవహారశైలిపై అసంతృప్తిగా ఉన్నారని, నిజానికి చీలికను తప్పించేందుకే కేజ్రీవాల్ ఢిల్లీలో సమావేశం నిర్వహించారని ప్రచారం జరిగింది. అయితే కాంగ్రెస్ నేతల ప్రచారాన్ని సీఎం మాన్ కొట్టిపారేశారు. ఆప్ ఎమ్మెల్యేలు ప్రలోభాలకు లొంగరని, వేరే పార్టీల్లోకి వెళ్లరని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, పదవి లేనిది కేజ్రీవాల్‌కు దిక్కుతోచదని, అధికారం లేకుండా ఆయన ఉండలేరని బీజేపీ ఎమ్మెల్యే మణిందర్ సింగ్ సిర్సా చెప్పారు. పంజాబ్ సీఎం కావాలని ఆయన పగటి కలలు కంటున్నారని, అయితే పంజాబ్ ఎమ్మెల్యేలు ఆత్మగౌరవం ఉన్న వాళ్లని, కేజ్రీవాల్‌ను పంజాబ్ సీఎం కానీయరని సిర్సా చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌జీందర్ సింగ్ రంధావా కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ కనుక పంజాబ్ సీఎం అయితే రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు తప్పవని ఆయన జోస్యం చెప్పారు. ఒకవేళ పంజాబ్ సీఎం పదవి కాదనుకున్న పక్షంలో పార్టీని కాపాడుకునే క్రమంలో కేజ్రీవాల్ పంజాబ్ నుంచి రాజ్యసభకు వెళ్లేందుకు అవకాశముంది. ఇందుకోసం ఆప్ జాతీయ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్‌తో రాజీనామా చేయించి ఆయన స్థానంలో పోటీ చేసే అవకాశముంది. రాజ్యసభకు వెళ్తే వివిధ పార్టీల జాతీయ స్థాయి నేతలతో సంప్రదింపులు జరిపేందుకు అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన?

మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ రాజీనామా చేసి రెండు రోజులు గడిచినా.. కొత్త ముఖ్యమంత్రిని బీజేపీ ఇంకా ఎంపిక చేయలేకపోతోంది. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధిస్తారన్న ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి బీరేన్‌సింగ్ రాజీనామా చేసిన రోజు నుంచే బీజేపీ తమ ఎమ్మెల్యేలతో ఇంఫాల్‌లో క్యాంపు నిర్వహిస్తోంది. ఆ పార్టీ ఈశాన్య రాష్ట్రాల ఇన్‌చార్జి సంబిత్ పాత్రా ఆధ్వర్యంలో ఈ క్యాంపు కొనసాగుతోంది. కానీ, కొత్తగా ముఖ్యమంత్రిగా ఎవరిని ఎన్నుకోవాలన్న అంశంపై పార్టీలో ఇంకా ఏకాభిప్రాయం రాలేదు. దీంతో సంబిత్ పాత్రా మంగళవారం రాష్ట్ర గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాను కలిసి పరిస్థితిని వివరించారు. వీరి భేటీ నేపథ్యంలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తారన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి.

జేఈఈ మెయిన్ సెషన్-1లో 14మందికి 100 పర్సంటైల్!

వీరిలో రాజస్థాన్ నుంచే ఐదుగురు.. జాబితాలో ఇద్దరు తెలుగు విద్యార్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (జేఈఈ) మెయిన్ 2025 సెషన్-1 (పేపర్-1 బీఈ, బీటెక్) ఫలితాల్లో దేశవ్యాప్తంగా 14 మంది విద్యార్థులు '100 పర్సంటైల్' తో సత్తా చాటారు. వీరిలో ఇద్దరు తెలుగు విద్యార్థులు ఉన్నారు. తెలంగాణ నుంచి బాని బ్రతా మాజీ, ఏపీలోని గుంటూరుకు చెందిన సాయి మనోజ్ఞ గుత్తికొండ 100 పర్సంటైల్ సాధించారు. జేఈఈ మెయిన్ సెషన్-1 తుది కీని సోమవారం వెల్లడించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మంగళవారం ఫలితాలను విడుదల చేసింది. ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, బీఈ/బీటెక్, కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా 22, 23, 24, 28, 29 తేదీల్లో మెయిన్ సెషన్-1లో భాగంగా పేపర్-1, పేపర్-2 పరీక్షలు జరిగాయి. హండ్రెడ్ పర్సంటైల్ సాధించిన విద్యార్థుల్లో అత్యధికంగా రాజస్థాన్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఉండటం విశేషం. ఆ తర్వాత ఢిల్లీ, యూపీ నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులు హండ్రెడ్ పర్సంటైల్ సాధించారు. ఈడబ్ల్యూఎస్ జనరల్ విభాగంలో ఏపీకి చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 99.9968125 పర్సంటైల్‌తో టాపర్‌గా నిలిచారు. జేఈఈ మెయిన్ కోసం 13,11,544 మంది రిజిస్టర్ చేసుకోగా, 12,58,136 మంది హాజరయ్యారు. జేఈఈ మెయిన్‌ను ఏడాదిలో రెండు సెషన్లుగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సెషన్-2 పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ రెండింటిలో అభ్యర్థుల అత్యుత్తమ స్కోరును జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం పరిగణనలోకి తీసుకుంటారు. కాగా మెయిన్ సెషన్-1లో వికారాబాద్ జిల్లా పరిగి విద్యార్థి ప్రణవ్ తేజ్ 99.9 పర్సంటైల్ సాధించాడు. కాగా బీ-ఆర్కిటెక్చర్, బీ-ప్లానింగ్‌కు సంబంధించి పేపర్-2 పరీక్ష ఫలితాలు త్వరలో విడుదల చేస్తామని ఎన్టీఏ తెలిపింది.

జేఈఈ మెయిన్-2025 సెషన్-1 టాపర్స్

1. ఆయూష్ సింఘాల్ (రాజస్థాన్) 2. కుశాగ్ర గుప్తా (కర్ణాటక) 3. దక్ష్, ఢిల్లీ (ఎన్సీటీ) 4. హర్షిందూ, ఢిల్లీ (ఎన్సీటీ) 5. రజిత్ గుప్తా, రాజస్థాన్ 6.శ్రేయాస్ లోహియా (యూపీ) 7. సక్షమ్ జిందాల్, (రాజస్థాన్) 8. సౌరవ్ (యూపీ) 9. విశాద్ జైన్ (మహారాష్ట్ర) 10. అర్ణవ్ సింగ్ (రాజస్థాన్) 11. శివేన్ వికాస్ తోష్నివాల్ (గుజరాత్) 12. సాయి మనోజ్ఞ గుత్తికొండ (ఏపీ) 13. ఓం ప్రకాశ్ బెహ్రా (రాజస్థాన్) 14. బనీ బ్రత మాజీ (తెలంగాణ)


బనీ బ్రత మాజీ

ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌పై ఆసక్తి

జేఈఈ మెయిన్ తొలిసెషన్‌లో టాపర్‌గా నిలిచిన బనిబ్రాతా మాజీ తనకు బాంబే లేదా ఢిల్లీ ఐఐటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదవాలని ఉందని పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌లో టాప్-2 ర్యాంకు సాధించడాన్నే లక్ష్యంగా పెట్టుకొని సిద్ధమవుతున్నానని చెప్పాడు. బని బత్రా తల్లిదండ్రుల స్వస్థలం పశ్చిమ బెంగాల్ అయినా 20 ఏళ్ల క్రితమే ఈ కుటుంబం హైదరాబాద్‌కొచ్చి స్థిరపడింది. తండ్రి స్వరూప్ మాజీ హైదరాబాద్‌లోనే కేంద్ర ప్రభుత్వ రక్షణ శాఖలో పనిచేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో టాపర్‌గా భాష్యం విద్యార్థిని

» నూరుశాతం పర్సంటైల్‌తో అగ్రస్థానంలో సాయి మనోజ్ఞ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాల్లో గుంటూరులోని భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమి విద్యార్థిని గుత్తికొండ సాయి మనోజ్ఞ నూరుశాతం పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచినట్లు సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం తెలిపారు. దాదాపు 13 లక్షల మంది పోటీపడిన జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థి టాపర్‌గా నిలవడం తెలుగు రాష్ట్రాలకే గర్వకారణమన్నారు. ప్రత్యేక శ్రద్ధతో పాటు భాష్యం ఐఐటీ ఫౌండేషన్ కరిక్యులం పటిష్ఠంగా అమలు చేయడం వల్లే జాతీయ స్థాయి పరీక్షల్లో తమ విద్యార్థులు ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు.

జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్- 2025 సెషన్-1 ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ఆ సంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. ఫలితాల్లో తమ విద్యాసంస్థలకు చెందిన వల్లాల నాగసిద్ధార్థ (ఫిజిక్స్‌లో 100 పర్సంటిల్)తో 99.97 పర్సంటైల్, తాడిపర్తి తేజాస్ ఉద్భవ్‌రెడ్డి 99.83, మారం రాజవర్షిత్‌రెడ్డి 99.81, దిడ్డి ప్రజ్వల్ కుమార్ 99.77 పర్సంటైల్ సాధించారని ఆయన వెల్లడించారు. వీరితో పాటు మరో 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో ఎస్సార్ విద్యాసంస్థలు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు వరదారెడ్డి తెలిపారు.

జేఈఈలో నారాయణ ఆల్‌టైమ్ రికార్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-2025 మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డు సాధించారని ఆ సంస్థల డైరెక్టర్లు పి. సింధూర నారాయణ, పి. శరణి నారాయణ తెలిపారు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 14 మంది విద్యార్థుల్లో 5గురు తమ విద్యాసంస్థలకు చెందిన వారే ఉన్నారని వెల్లడించారు. తమ విద్యార్థులు బనిబ్రత మజీ, ఆయుష్ సింఘాల్, కుషాగ్ర గుప్తా, విషద్ జైన్, షివిన్ వికాస్ 100 పర్సంటైల్ సాధించారని వారు తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ కోసం తమ విద్యాసంస్థల్లో అమలు చేస్తున్న ప్రత్యేక పాఠ్య ప్రణాళికతోనే ఈ విజయం సాధ్యమైందని సింధూర నారాయణ, శరణి నారాయణ పేర్కొన్నారు.

జేఈఈలో శ్రీ చైతన్య సంచలన రికార్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలు సంచలన రికార్డు సాధించిందని ఆ సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ పేర్కొన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ పాఠ్యాంశాల్లో తమ విద్యార్థులు 42 మంది 100 శాతం పర్సంటైల్ సాధించారని ఆమె వెల్లడించారు. అలాగే మల్టీపుల్ సబ్జెక్టుల్లో 8 మంది 100 శాతం పర్సంటైల్ సాధించారని చెప్పారు. విద్యార్థుల నిరంతర కృషితోపాటు ప్రత్యేక ప్రణాళికలు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్ వల్లే ఈ విజయం సాధ్యమైందని సుష్మ వెల్లడించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నవ్వుల్లో ముంచేత్తే సినిమా



- రామ్‌నారాయణ్

దర్శకుడు రామ్‌నారాయణ్ తెరకెక్కించిన చిత్రం 'లైలా'. విష్వక్ సేన్ కథానాయకుడిగా సాహు గారపాటి నిర్మించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు రామ్‌నారాయణ్. "హీరో లేడీ గెటప్ వేయడం అనేది ఓ విభిన్న కథాంశం. ఈ మధ్య కాలంలో ఇలాంటి కథతో సినిమాలు రాలేదు. అందుకే ఈ కథతో సినిమా చేయాలని అనుకుని చాలా మంది కథానాయకులని పరిశీలించా. ఆ క్రమంలోనే విష్వక్‌ను సంప్రదించా. ఆయన విన్న వెంటనే ఒప్పుకున్నారు. ఇందులో హీరో ఓల్డ్ సిటీలో బ్యూటీ పార్లర్ నడుపుతుంటాడు. అనుకోని సమస్యల వల్ల ఆయన 'లైలా' గెటప్ వేయాల్సి వస్తుంది. సినిమా చాలా వినోదాన్ని ఇస్తుంది. ప్రేక్షకులను ఆద్యంతం నవ్వుల్లో ముంచేత్తే ఈ సినిమాలో మనసుకు హత్తుకునే భావోద్వేగాలూ ఉంటాయి. క్లాస్, మాస్ అన్న తేడా లేకుండా అందరికీ నచ్చేస్తుంది. విశ్వక్ సినిమాల నుంచి ఏమి ఆశిస్తారో.. అది ఈ సినిమాలో పదిరెట్లు ఎక్కువగా ఉంటుంది" అని చెప్పారు.

ఆస్తిని రాసిచ్చిన అభిమాని



బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌కు ఓ వీరాభిమాని తన ఆస్తిని మొత్తం రాసిచ్చేశారు. నిషా పటేల్(62) అనే మహిళకు సంజయ్ నటనంటే అభిమానం ఎక్కువ. మరణానంతరం తన ఆస్తి మొత్తం సంజయ్‌కు దక్కేలా ఆమె 2018లో వీలునామా రాశారు. ఇందుకు కావాల్సిన బ్యాంకు పనులన్నీ పూర్తి చేశారు. రూ.49 లక్షల క్యాష్.. కొన్ని ప్రాపర్టీస్‌తో కలిపి ఆ ఆస్తి విలువ రూ.72 కోట్లు. ఇది తెలిసి సంజయ్ ఆశ్చర్యపోయారు. ఆయనను అంతలా అభిమానించిన నిషా పటేల్‌ను కలుసుకోలేకపోయినందుకు బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె రాసిచ్చిన ఆస్తిని మాత్రం సున్నితంగా తిరస్కరించారు. అది వారి కుటుంబసభ్యులకు లేదా ప్రభుత్వానికి చెందేలా చేయమని తన లాయర్‌ను కోరారు.

మరో ప్రపంచంలోకి తీసుకెళ్లే చిత్రం



జీవా, అర్జున్ సర్జా, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అగత్యా'. ఈ ఫ్యాంటసీ హారర్ థ్రిల్లర్‌కు గీత రచయిత పా.విజయ్ దర్శకుడు. ఇషారి కే.గణేశ్, అనీష్ అర్జున్‌దేవ్ నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ హారర్ ప్రియులను ఆకట్టుకునేలా ఉంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ప్రేక్షకులను మరో ప్రపంచానికి తీసుకుళ్లే సినిమా ఇది అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్:షాన్ లోకేశ్, సంగీతం:యువన్ శంకర్ రాజా.



మళ్లీ రాజకీయాల్లోకి రాను

● రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ప్రచారాన్ని ఖండించిన చిరంజీవి

● నా రాజకీయ ఆశయాలను పవన్ కల్యాణ్ నెరవేరుస్తాడు

"పెద్దవాళ్లందరికీ దగ్గరవుతున్నాడు, వాళ్లు కూడా దగ్గరకు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు, చిరంజీవి మళ్లీ రాజకీయాల్లోకి వస్తాడేమో అని చాలామంది అనుకుంటున్నారు. కానీ అలాంటిదేం లేదు. ఇక ముందు పొలిటికల్‌గా వెళ్లడమనేది లేదు. మీరు మరో ఆలోచన పెట్టుకోవద్దు" అని చిరంజీవి అన్నారు.

బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'బ్రహ్మ ఆనందం' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాల్లోకి పునరాగమనం చెయ్యబోతున్నారంటూ తన గురించి జరుగుతున్న ప్రచారాన్ని చిరంజీవి ఖండించారు. 'చాలామందికి చాలా అనుమానాలు వస్తున్నాయి. ఎవరితో సన్నిహితంగా మెసిలినా సినీరంగానికి నా వంతు సేవలందించడానికే తప్ప దానివెనుక రాజకీయ ఆలోచన లేదు. పొలిటికల్‌గా ముందుకెళ్లడానికీ, నేనను కున్న లక్ష్యాలు, సేవలను కొనసాగించడానికి పవన్ కల్యాణ్ ఉన్నాడు. ఇక ఈ జన్మంతా రాజకీయాలకు దూరంగా ఉంటూ, సినిమాలకు అతి దగ్గరగా ఉంటూ, అభిమానులను అక్కున చేర్చుకొని ఆ కళామతల్లితోనే ఉంటాను' అని స్పష్టం చేశారు. 'బ్రహ్మానందంతో తన అనుబంధాన్ని వివరిస్తూ 'బ్రహ్మానందం ఎవరో కాదు, నా సోల్‌మేట్. ఆయన్ను విపరీతంగా ప్రేమించిన సందర్భాలున్నాయి. ఏడిపించిన సందర్భాలున్నాయి. కోప్పడిన సందర్భాలున్నాయి. వయసులో చిన్నవాణ్ణే అయినా అవేవి ఆయన మనసులో పెట్టుకోలేదు. బ్రహ్మానందం సినిమాల్లోకి తన కొడుకులు రాజా, గౌతమ్‌ను కూడా తీసుకురావాలని రెండు మూడు సినిమాలు చేసినా అనుకున్న ఫలితమివ్వలేదు. అయినా మళ్లీ ఈ సినిమాతో ఓ ప్రయత్నం చేస్తున్నప్పుడు నావంతుగా సహకారం అందించాలనుకున్నాను. నేనే స్వయంగా ఫోన్ చేసి ఈ కార్యక్రమానికి వస్తాను అని చెప్పాను. బ్రహ్మానందంతో నా స్నేహం కలకాలం ఇలాగే కొనసాగాలి. ఈ సినిమా బాగా ఆడుతుంది. బ్రహ్మానందానికి పుత్రోత్సాహం కలుగుతుంది. దర్శకుడు నిఖిల్ ప్రెషథాట్‌తో ఈ సినిమా చేశాడు. ఈ సినిమాతో అందరికీ బ్రేక్ రావాలి. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని చిరంజీవి కోరారు. బ్రహ్మానందం మాట్లాడుతూ 'చిరంజీవిగారితో నాది నాలుగు దశాబ్దాల అనుబంధం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయనది. మా దర్శకుడు నటీనటుల నుంచి అద్భుతమైన నటనను రాబట్టుకున్నారు. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ' అని చెప్పారు. ప్రేమ, డబ్బు మానవ జీవితాలను ప్రభావితం చేస్తున్న తీరును దర్శకుడు హృద్యంగా తెరకెక్కించారు అని రాజా గౌతమ్ చెప్పారు. వినోదం, సందేశం మేళవింపుగా ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు నిఖిల్ చెప్పారు. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నామని నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం రహదారికి నేమ్ బోర్డు ఆవిష్కరణ

● డిప్యూటీ సీఎం ఉదయనిధి, పలువురు మంత్రుల హాజరు



దివంగత సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కీర్తివిశేషాలు, సేవలకు గుర్తుగా ఆయన నివసించిన రోడ్డుకు ఆయన పేరే పెడుతూ తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రోడ్డుకు 'నేమ్ బోర్డు'ను మంగళవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి లాంఛనంగా ఆవిష్కరించారు. ఎస్పీబీ జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కం, కామ్‌ధర్ నగర్ మెయిన్ రోడ్డులో నివసించేవారు. ఆయన మరణించిన తర్వాత ఆయన జ్ఞాపకార్థం కామ్‌ధర్ మెయిన్ రోడ్డుకు తన తండ్రి పేరు పెట్టాలని ఎస్పీబీ తనయుడు ఎస్పీ చరణ్ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై సీఎం స్టాలిన్ సానుకూలంగా స్పందించి ఆ రోడ్డుకు ఎస్పీబీ పేరు పెడుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ రోడ్డు పేరు తెలుపుతూ ఏర్పాటు చేసిన నేమ్ బోర్డును డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, నగర మేయర్ ఆర్ ప్రియ, నగర కమిషనర్ కుమారగురుభరణ్, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, ఎస్పీ సతీమణి ఎస్పీబీ సరస్వతి, కుమారుడు ఎస్పీ చరణ్, కుమార్తె ఎస్పీ పల్లవి, సోదరి ఎస్పీ శైలజ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సహజంగా తమిళుల పేర్లకు చివరన 'ఎన్' అక్షరం వుంటుంది. సుబ్రమణ్యం అని వుంటే సుబ్రమణ్యన్ అని గానీ, లేదా సుబ్రమణియం అని గానీ వుండడం కద్దు. ఆంగ్ల అక్షరాల్లోనూ అలాగే వుంటుంది. కానీ ఎస్పీబీ కుటుంబ సభ్యుల వినతి మేరకు ప్రభుత్వం ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం రోడ్ అనే పెట్టింది. అంతేగాక తమిళనాట పేర్ల మధ్యలో సహజంగా 'హెచ్' కూడా ఉండదు. కానీ బాలసుబ్రహ్మణ్యం మధ్యలో ఆంగ్ల అక్షరం 'హెచ్' కూడా పెట్టడం విశేషం.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

చైతూని చూస్తుంటే నాన్నగారు గుర్తొచ్చారు

అక్కినేని నాగార్జున

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా 'తండేల్ లవ్ సునామీ సెలబ్రేషన్స్'ను నిర్వహించింది చిత్రబృందం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అక్కినేని నాగార్జున మాట్లాడుతూ "ఇలా ఓ సక్సెస్ మీట్‌కు వచ్చి చాలా రోజులైంది. అరవింద్‌గారు కథ విని చందు దర్శకత్వంలో తీద్దామనుకున్న ఆలోచన.. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం జతకావడం.. బన్నీవాసు సరైన టీమ్‌ను సెట్ చేయడం నుంచి.. నాగచైతన్య శోభితాను పెళ్లి చేసుకున్న సందర్భం అన్నీ కలగలసి 'తండేల్' విజయానికి దోహదపడ్డాయి. ఈ విజయం చాలా ఆనందాన్ని



ఇస్తోంది. చందు దర్శకత్వం అంటే నాకు చాలా ఇష్టం. ఇందులో చైతన్యని చూస్తుంటే నాన్నగారు గుర్తుకువచ్చారు. సాయి పల్లవి నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. సినిమాలోని తన పాత్రలో జీవించారు" అని చెప్పారు. "ఒక నటుడికి ఇలాంటి పాత్ర చాలా అరుదుగా దొరుకుతుంటుంది. ఈ సినిమా రిలీజ్‌కు ముందు నేను బయపడితే అరవింద్‌గారు ధైర్యం చెప్పారు. నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అవుతుంది అని అన్నారు. అదృష్టవశాత్తూ అదే జరిగింది" అని నాగచైతన్య చెప్పారు. "చందు సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమాలో చైతన్య నటన అద్భుతంగా ఉండబోతోందని ఎడిటింగ్ రూమ్‌లోనే అర్థమైపోయింది" అని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. "అక్కినేని నాగేశ్వరరావుగారి 'తెనాలి రామకృష్ణ' సినిమాను నాగచైతన్యతో తెరకెక్కిస్తాను" అని చందూ అన్నారు. "నేను పరిశ్రమలో ఎక్కువ సినిమాలు తీసింది నాగార్జునతోనే. ఆయనతో తీసినట్లే నాగచైతన్యతోనూ సినిమాలు తీయాలనుకుంటున్నాను" అని నిర్మాత అశ్వనీదత్ అన్నారు.

సముద్ర తీరాన సేద తీరుతూ..



'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయారు బాలీవుడ్ నటి త్రిప్తి డిమ్రి. గతేడాది విడుదలైన 'బ్యాడ్ న్యూస్', 'భూల్ భులయ్యా-3' చిత్రాలు బ్లాక్ బస్టర్ అయ్యాయి. దీంతో అటు బాలీవుడ్‌లో, ఇటు టాలీవుడ్‌లో ఈ బ్యూటీకి వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రభాస్ - మారుతి కాంబినేషన్‌లో రానున్న 'ది రాజా సాబ్'లో స్పెషల్ సాంగ్ చేయనున్నట్లు సమాచారం. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించనున్న చిత్రం 'డ్రాగన్'లోనూ ప్రత్యేక పాటతో అలరించబోతున్నారట. అటు బాలీవుడ్‌లో పర్వీన్ బాబీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న వెబ్ సిరీస్, అదేవిధంగా సందీప్‌రెడ్డి వంగా - రణ్‌బీర్ కపూర్ కాంబినేషన్‌లో రానున్న 'యానిమల్ పార్క్' చిత్రంలోనూ త్రిప్తి డిమ్రి నటించనున్నారు. కాగా, వెకేషన్ మూడ్‌లో ఉన్న ఈ బ్యూటీ మాల్దీవుల్లో సముద్ర తీరాన సేద తీరుతూ ఉన్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

మూడింట రెండొంతుల పన్ను రిటర్నుల్లో చెల్లింపులు నిల్లు

న్యూఢిల్లీ: ఆదాయం పన్ను (ఐటీ) రిటర్న్‌లు సమర్పించే వారిలో మూడింట రెండొంతుల మంది చెల్లించిన పన్ను సున్నా అని కేంద్రం వెల్లడించింది. వీరి సంఖ్య 2019-20 ఆర్థికతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి దాదాపు రెట్టింపైంది. లోక్‌సభలో పన్ను చెల్లింపుదారులపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖిత పూర్వకంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మంత్రి సమర్పించిన డేటా ప్రకారం.. 2019-20లో 6.48 కోట్ల మంది ఐటీ రిటర్న్‌లు సమర్పించగా.. అందులో సున్నా పన్ను బకాయితో దాఖలైన రిటర్నులు 2.9 కోట్లు. అంటే మొత్తం రిటర్న్‌ల్లో 44.75 శాతానికి సమానం. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 నాటికి 8.39 కోట్ల మంది రిటర్న్‌లు ఫైల్ చేశారు. అందులో 5.58 కోట్ల(66.5 శాతం) మంది సున్నా పన్ను బకాయితో రిటర్న్‌లు సమర్పించినట్లు మంత్రి తెలిపారు.

ఆసుపత్రుల విభాగంలోకి అదానీ, బజాజ్

ముంబై: అదానీ, బజాజ్ గ్రూప్‌లు తాజాగా ఆసుపత్రుల వ్యాపారంలోకి ప్రవేశించబోతున్నాయి. రూ.6,000 కోట్ల పెట్టుబడులతో ముంబై, అహ్మదాబాద్‌లో ఒక్కొక్కటీ 1,000 పడకల సామర్థ్యంతో కూడిన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయబోతున్నట్లు అదానీ గ్రూప్ ప్రకటించింది. బజాజ్ గ్రూప్ సైతం రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడులతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	111
వరంగల్	97	గుంటూరు	116
కరీంనగర్	97	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	87
కర్నూలు	97	నెల్లూరు	92
విశాఖపట్నం	103	అనంతపురం	92
గోదావరి	111		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

కార్పొరేట్ నగరి



హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు భారీ డిమాండ్

- 2030 నాటికి 20 కోట్ల చదరపు అడుగులు
- సీబీఆర్‌ఈ-హైసియా అంచనా

హైదరాబాద్: భాగ్యనగరంలో కార్యాలయ స్థలాలకు భారీగా డిమాండ్ నెలకొంది. 2030 నాటికి నగరంలో ఆఫీస్ స్పేస్ 20 కోట్ల చదరపు అడుగులకు చేరుకోవచ్చని సీబీఆర్‌ఈ సౌత్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్- హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) సంయుక్తంగా మంగళవారం విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది. దేశంలోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో హైదరాబాద్ వాటా 15 శాతంగా ఉండగా.. గ్రీన్ సర్టిఫైడ్ ఆఫీస్ స్పేస్‌లో 18 శాతం వాటా కలిగి ఉంది. అంతర్జాతీయ సంస్థల నుంచి భారీ డిమాండ్ నెలకొనడంతో 2014 నుంచి నగరంలో ఆఫీస్ స్పేస్ మూడు రెట్లకు పైగా పెరిగిందని, 2024 డిసెంబరు నాటికి దాదాపు 13.7 కోట్ల చదరపు అడుగులకు చేరుకుందని ఆ నివేదికలో వెల్లడించారు. హైదరాబాద్ గడిచిన కొన్నేళ్లలో అంతర్జాతీయ సంస్థలకు వేదికగా, సాంకేతిక హబ్‌గా మారిందని.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చెందగల సామర్థ్యం ఈ నగరానికి ఉందనడానికిదే నిదర్శనమని సీబీఆర్‌ఈ ఇండియా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా మార్కెట్ల చైర్మన్, సీఈఓ అన్షుమన్ మ్యాగజైన్ అన్నారు. సమృద్ధిగా మౌలిక వసతులతో పాటు కంపెనీల కార్యాలయ స్థలాల వైవిధ్యీకరణ, విరివిగా నిపుణుల లభ్యత వంటి అంశాలు భారత స్థిరాస్తి రంగంలో హైదరాబాద్‌ను కీలక మార్కెట్‌గా నిలిపాయన్నారు. ఐటీ, ఐటీఈఎస్ విభాగాల్లో బలంగా ఉండటంతో టెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) ఏర్పాటుకు హైదరాబాద్ టాప్ చాయిస్‌గా కొనసాగనుందన్నారు. ఇది నగరంలో కార్యాలయ స్థలాల గిరాకీని మరింత పెంచనుందన్నారు.

గత ఏడాది 1.23 కోట్ల చ.అ స్థలాల లీజు

హైదరాబాద్‌లో రియల్టీ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోందని, పర్యావరణహిత నిర్మాణాలపై దృష్టిపెరిగిందని సీబీఆర్‌ఈ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిప్సన్ పాల్ అన్నారు. హైదరాబాద్ వ్యాపారాలకు ప్రాధాన్య గమ్యంగా మారడంతో ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ పెరుగుతోందన్నారు. 2024లోనూ ఇదే జోరు కొనసాగిందని, 1.23 కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని కంపెనీలు లీజుకు తీసుకున్నాయి. నగరంలోని కార్యాలయ స్థలాల లీజులో టెక్నాలజీ కంపెనీల వాటా అత్యధికంగా 31 శాతంగా ఉంది. జీసీసీల ఏర్పాటు కోసం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో బెంగళూరు తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. టెక్నాలజీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఆర్థిక సేవల రంగ సంస్థలు ఎక్కువగా ఈ నగరాన్ని ఎంచుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. కృత్రిమ మేధ(ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగం హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్‌ను మరింత పెంచనుందని రిపోర్టు ప్రస్తావించింది.

వర్ధమాన సంవత్సరంలోనూ దేశంలోని 6 ప్రధాన నగరాల్లో (ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, చెన్నై) కార్యాలయ స్థలాలకు బలమైన డిమాండ్ నెలకొందని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సేవల సంస్థ కొలియర్స్ ఇండియా తాజా రిపోర్టు పేర్కొంది. మంగళవారం జరిగిన ఫిక్కీ 18వ రియల్ ఎస్టేట్ సదస్సులో ఈ నివేదికను విడుదల చేసింది. 2025లో ఈ ఆరు నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 6.5-7 కోట్ల చదరపు అడుగుల స్థాయిలో ఉండవచ్చని అంచనా వేసింది. 2024లో కంపెనీలు మొత్తం 6.64 కోట్ల చ.అ స్థలాన్ని లీజుకు తీసుకున్నాయని తెలిపింది. ఈ ఏడాది ఆఫీస్ స్పేస్ డిమాండ్ మొత్తంలో మూడో వంతు వాటా బెంగళూరుదే కానుందని కొలియర్స్ ఇండియా ఎండీ అర్పిత్ మెహ్రోత్రా అన్నారు. జీసీసీలు, ఇంజనీరింగ్, తయారీ సంస్థలు, కో-వర్కింగ్ స్పేస్ కంపెనీలు ఈ నగరంలో ఆఫీస్ స్పేస్ గిరాకీకి ప్రధాన చోదకం కానున్నాయని ఆయన అన్నారు. ఈ ఏడాది హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ మార్కెట్లలో 1-15 కోట్ల చ.అ చొప్పున స్థలం లీజుకు తీసుకోవచ్చని రిపోర్టు అంచనా. ముంబై, చెన్నై, పుణెలో 0.5-1 కోటి చ.అ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు కుదిరే అవకాశాలున్నాయని నివేదిక పేర్కొంది.

ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు టాప్



హైదరాబాద్: ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా పని చేస్తున్న యునికార్న్‌లు జనవరి నెలలో ఉద్యోగ నియామకాల్లో 25% వృద్ధిని సాధించాయి. ఉపాధి కల్పనలో 74% వృద్ధితో హైదరాబాద్ యునికార్న్‌లు అగ్రస్థానంలో ఉండగా 60% వృద్ధితో చెన్నై రెండో స్థానంలో ఉంది. జనవరి నెలలో నియామకాల ధోరణిపై నౌకరి జాబ్‌స్పీక్ ఇండెక్స్ ఈ విషయాలు ధ్రువీకరించింది. అయితే ఐటీ రంగం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టయితే నియామకాల్లో -1% తగ్గుదలతో ఫ్లాట్‌గా ఉంది. రంగాలవారీగా చూసినట్టయితే ఎఫ్ఎంసీజీ 16%, బీమా 15%, ఫార్మా 11% వృద్ధిని నమోదు చేశాయి. ఫ్రెషర్ల నియామకం 3% పెరిగి నిలకడగా ఉంది. రిటైల్ రంగం దీర్ఘకాలిక ప్రతికూల ధోరణి నుంచి బయటపడి నియామకాల్లో 1% వృద్ధిని నమోదు చేసింది. బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్ వంటి కీలక మార్కెట్లు ఇందుకు దోహదపడ్డాయి. ప్రధానంగా మిడ్ లెవెల్ ఉద్యోగ నియామకాలు జోరుగా సాగాయని ఆ నివేదిక తెలిపింది.

జీఎంఆర్‌తో మెల్‌బోర్న్ సంస్థ ఒప్పందం

శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి): విమానయాన రంగంలో నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ అండ్ జీఎంఆర్ ఏరో అకాడమీతో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు జీఎంఆర్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విమానయాన పరిశ్రమలోని కీలక రంగాల్లో డిమాండ్‌కు దీటుగా నిపుణులను అందుబాటులో ఉంచడానికి ఇది దోహదపడుతుందని వారన్నారు. విమానయానం, విమానాశ్రయ భద్రత కార్యకలాపాలు, కార్గో నిర్వహణ వంటి రంగాల్లో ఉభయ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్‌లో స్పెషలైజేషన్‌ను బ్యాచ్‌లను మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల రూపకల్పన వంటివి చేపటనున్నట్లు చెప్పారు. అలాగే ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశల ఒప్పందంపై కూడా సంతకాలు చేసిన్నట్లు చెప్పారు.

సైయెంట్ డీఎల్ఎంకు బోయింగ్ కాంట్రాక్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బోయింగ్ గ్లోబల్ సర్వీసెస్‌తో (బీజీఎస్) సైయెంట్ డీఎల్ఎం ప్రెసిషన్ మెషీన్డ్ విడిభాగాలు, అసెంబ్లీల ఉత్పత్తి కాంట్రాక్టు కుదుర్చుకుంది. తమ భాగస్వామ్యంలో ఇది ఒక మైలు రాయి అని సైయెంట్ డీఎల్ఎం సీఈఓ ఆంథోని మాంటల్బానో అన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో సైయెంట్ డీఎల్ఎం విశ్వసనీయమైన భాగస్వామి అన్న విషయాన్ని ఈ కాంట్రాక్టు నిరూపిస్తున్నదని చెప్పారు.

66 పైసలు బలపడిన రూపాయి

దేశీయ స్టాక్ మార్కెట్ భారీ నష్టాలతో ముగిసినా రూపాయి మారకం రేటు మంగళవారం కొద్దిగా కోలుకుంది. సోమవారంతో పోలిస్తే డాలర్‌తో 66 పైసలు మెరుగుపడి రూ.86.79 వద్ద ముగిసింది. గత రెండేళ్లలో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒకే రోజు ఈ స్థాయిలో పుంజుకోవడం ఇదే మొదటిసారి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,380 ▲	80,010 ▲	1,07,000 ▲
విజయవాడ	88,500 ▲	82,500 ▲	98,000 ▼
విశాఖపట్నం	85,410 ▼	78,290 ▼	94,350 ▼
రాజమండ్రి	87,350 ▲	80,100 ▲	97,800 ▼
ప్రొద్దుటూరు	88,300 ▲	81,770 ▲	95,700 ▼
ముంబై	85,480 ▼	78,300 ▼	94,170 ▼

2025లో రూ.1.64 లక్షల కోట్లు

- ప్రకటనల ఆదాయంపై గ్రూప్‌ఎం నివేదిక

ముంబై: ఈ ఏడాది భారత మీడియా విభాగాల ప్రకటనల ఆదాయ వృద్ధి 7 శాతానికి తగ్గవచ్చని ప్రముఖ మీడియా ఏజెన్సీ గ్రూప్‌ఎం అంచనా వేసింది. 2024లో ఈ వృద్ధి 8.8 శాతంగా నమోదైందని రిపోర్టులో పేర్కొంది. 2025లో దేశంలోని అన్ని మీడియా విభాగాలకు ప్రకటనల ద్వారా మొత్తం రూ.1,64,137 కోట్ల ఆదాయం సమకూరవచ్చని గ్రూప్‌ఎం అంటోంది. 2024లో నమోదైన రూ.1,53,407 కోట్ల ఆదాయంతో పోలిస్తే ఇది 7 శాతం అధికం. నివేదికలోని మరిన్ని విషయాలు..

- ప్రపంచంలోని అతిపెద్ద అడ్వర్టైజ్‌మెంట్ మార్కెట్లలో భారత్ 9వ స్థానంలో ఉండగా.. అమెరికా, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) టాప్-3 స్థానాల్లో ఉన్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా యాడ్ రెవెన్యూ వృద్ధి ఈ ఏడాదిలో 7.7 శాతానికి పరిమితం కానుంది. 2024లో ఇది 9.5 శాతంగా నమోదైంది.
- భారత్‌లో డిజిటల్ ప్రకటనల ఆదాయం వేగంగా పెరుగుతోంది. ఈ ఏడాది డిజిటల్ యాడ్ రెవెన్యూ వార్షిక ప్రాతిపదికన 11.5% వృద్ధితో రూ.లక్ష కోట్లకు చేరుకోవచ్చని అంచనా.
- దేశంలో మొత్తం ప్రకటనల ఖర్చులో 60 శాతం వాటా డిజిటల్ యాడ్స్‌దే. ప్రపంచవ్యాప్తంగా ఈ వాటా 82 శాతంగా ఉంది.
- టీవీ ప్రకటనల ఆదాయం ఈ ఏడాదిలో 1% తగ్గి రూ.42,431 కోట్లకు పరిమితం కావచ్చని అంచనా. 2024లో ఈవిభాగ ప్రకటనల రెవెన్యూ రూ.42,859 కోట్లుగా నమోదైంది. టీవీ యాడ్ రెవెన్యూలో 12.6%వాటా స్ట్రీమింగ్ టీవీలదే.
- 2025లో పత్రికల ప్రకటనల ఆదాయం 4 శాతం పెరిగి రూ.15,947 కోట్లుగా నమోదుకావచ్చని అంచనా. మొత్తం ప్రకటనల ఆదాయంలో ఈ విభాగ వాటా 10 శాతంగా ఉండనుంది.

ఐపీఓలపై స్టార్టప్‌ల దృష్టి

- పెరగనున్న నియామకాలు.. • ఇన్నోవెన్ క్యాపిటల్

న్యూఢిల్లీ: నిధుల సమీకరణ లేదా పెట్టుబడుల ఉపసంహరణ కోసం అనేక స్టార్టప్ కంపెనీలు ఈ సంవత్సరం ఐపీఓ మార్కెట్‌వైపు చూస్తున్నాయి. అంతర్జాతీయంగా కొన్ని సవాళ్లున్నా ఈ సంవత్సరం ఈ కంపెనీల నిధుల సమీకరణకు పెద్ద ఇబ్బందులేమీ ఉండక పోవచ్చని ఇన్నోవెన్ క్యాపిటల్ అనే సంస్థ తన తాజా 'ఇండియా స్టార్టప్ ఔట్‌లుక్ నివేదికలో తెలిపింది. ఈ సర్వేలో పాల్గొన్న 100 స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లలో 47 మంది ఈ సంవత్సరం నియామకాల జోరు పెరుగుతుందని చెప్పారు. అయితే నిధుల సమీకరణలో సమస్యలు ఉండవన్న 79 శాతం మంది చెప్పగా ఐపీఓల ద్వారా పెట్టుబడుల ఉపసంహరణకు 73 శాతం స్టార్టప్ కంపెనీల ప్రమోటర్ల ఆసక్తి ప్రదర్శించారు. వచ్చే రెండు మూడేళ్లలో తమ వ్యాపార మోడల్స్‌పై ఏఐ ప్రభావం ఉంటుందని 28 శాతం స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లన్నారు. 83 శాతానికిపైగా స్టార్టప్ కంపెనీల నాయకత్వ స్థానాల్లో మహిళలు 20 శాతం కూడా లేరని ఆ సర్వేలో తేలింది.

స్పోర్ట్స్

నందినికి స్వర్ణం


నందిని


నిత్య

- నిత్య, నిషికకు కాంస్యాలు
- నెట్‌బాల్ మహిళల జట్టుకు రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు ఒకే రోజు నాలుగు పతకాలు కొల్లగొట్టారు. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో హెప్టాథ్లాన్‌లో అగసర నందిని 5,601 పాయింట్లతో పసిడి పతకాన్ని ముద్దాడింది. 200 మీటర్ల పరుగులో జి.నిత్య (హైదరాబాద్) 23.76 సెకన్లలో రేసును ముగించి కాంస్యం అందుకుంది. విశాఖ ఎక్స్‌ప్రెస్ యర్రా జ్యోతి 23.35 సెకన్లలో స్వర్ణం గెల్చుకుంది. ఇక ఆర్టిస్టిక్ ఆల్‌రౌండ్ జిమ్నాస్టిక్స్‌లో తెలంగాణ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ 44.767 పాయింట్ల కాంస్యం పతకం సాధించింది. మహిళల నెట్‌బాల్ ఫాస్ట్ 5లో తెలంగాణ రజతం అందుకుంది.


జ్యోతి

తదుపరి క్రీడలకు మేఘాలయ ఆతిథ్యం

న్యూఢిల్లీ: 39వ జాతీయ క్రీడలకు మేఘాలయ ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉష.. ఆ రాష్ట్ర సీఎం కాన్రాడ్ సంగ్మాకు లేఖ రాశారు. 2027 ఫిబ్రవరి/మార్చిలో క్రీడలు జరిగే అవకాశం ఉంది. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల ముగింపోత్సవంలో ఐవోఏ జెండాను మేఘాలయకు అందించనున్నారు.


పతకాలతో నెట్‌బాల్ జట్టు



సీనియర్ జట్టుకు వరల్డ్‌కప్ అందించాలి

క్రికెటర్ త్రిష

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత సీనియర్ మహిళల జట్టుకు ప్రపంచకప్ అందించడమే తన ఆశయమని అండర్-19 టీ20 వరల్డ్‌కప్ స్టార్, హైదరాబాద్ యువ ఆల్‌రౌండర్ గొంగడి త్రిషా రెడ్డి వెల్లడించింది. మంగళవారం ఏఆర్‌కే ఫౌండేషన్ త్రిషను ఘనంగా సత్కరించింది. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, ఏఆర్‌కే గ్రూప్ చైర్మన్ రామిరెడ్డి త్రిషపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ మహిళల సీనియర్ కేటగిరీలో టీమిండియా ఇప్పటివరకు వన్డే, టీ20 వరల్డ్‌కప్‌లను నెగ్గలేదు, ఆ వెలితిని తీర్చి ప్రపంచకప్ అందించడమే తన ఆశయమని త్రిష చెప్పింది. త్రిష వంటి క్రికెటర్లు అరుదుగా లభిస్తారని, ఆమె మరింత ఎత్తుకు ఎదగాలని గోపీచంద్ ఆకాంక్షించాడు. త్రిషను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయికి చేరాలని ఎమ్మెస్కే సూచించాడు.

యూఎస్ ఓపెన్ 'మిక్స్‌డ్'లో మార్పులు

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్రేజ్‌ను పెంచేందుకు నిర్వాహకులు వినూత్న ప్రయోగం చేయనున్నారు. మెయిన్ డ్రా ఆరంభానికి వారం ముందే పునర్ వ్యవస్థీకరించిన ఫార్మాట్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌ను నిర్వహించనున్నారు. అంతేకాకుండా స్టార్ ప్లేయర్లను ఆకర్షించేందుకు ప్రైజ్‌మనీని భారీగా రూ. 8.67 కోట్లకు పెంచారు. యూఎస్ ఓపెన్ సింగిల్స్ మెయిన్ డ్రా ఆగస్టు 24న ఆరంభం కానుంది. అయితే, మిక్స్‌డ్ డబుల్స్‌ను మాత్రం రెండు రోజుల్లో ముగిసే విధంగా ఆగస్టు 19-20 తేదీల్లో షెడ్యూల్ చేశారు. మొత్తం 16 జట్లు మాత్రమే తలపడతాయి.

సెమీస్‌లో ముంబై×విదర్భ

గుజరాత్ కూడా.. రంజీ ట్రోఫీ

కోల్‌కతా: డిఫెండింగ్ చాంప్ ముంబై, గతేడాది రన్నరప్ విదర్భతో పాటు గుజరాత్ రంజీ ట్రోఫీ సెమీస్‌కు దూసుకెళ్లాయి. కెప్టెన్ రహానె (108) సెంచరీతో అదరగొట్టగా.. పేసర్ రాయ్‌స్టన్ డయాస్ (5/39) ప్రత్యర్థి వెన్ను విరవడంతో.. హరియాణాతో క్వార్టర్స్‌లో ముంబై 152 పరుగుల తేడాతో గెలిచింది. ఆటకు నాలుగోరోజైన మంగళవారం ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 339 పరుగులకు ఆలౌటై, 354 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. ఛేదనలో హరియాణా 201 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 315, హరియాణా 301 పరుగులు చేశాయి. మరో క్వార్టర్స్‌లో విదర్భ 198 రన్స్‌తో తమిళనాడును చిత్తు చేసింది. ఈనెల 17 నుంచి జరిగే సెమీస్‌లో ముంబైతో విదర్భ తలపడనుంది. ఇంకో క్వార్టర్స్‌లో గుజరాత్ జట్టు ఇన్నింగ్స్ 98 పరుగుల తేడాతో సౌరాష్ట్రను చిత్తు చేసింది.

చాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరం

- హర్షిత్ రాణాకు చోటు
- స్పిన్నర్ వరుణ్‌కు సైతం



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి ఝలక్ తగిలింది. వెన్ను నొప్పి నుంచి కోలుకోకపోవడంతో స్టార్ పేసర్ బుమ్రా ఈ మెగా టోర్నీకి దూరమయ్యాడు. మంగళవారం రాత్రి ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. సీటీ కోసం తమ తుది జట్లను ప్రకటించేందుకు మంగళవారమే తుది గడువుగా ఉంది. దీంతో బుమ్రా స్థానంలో మరో పేసర్ హర్షిత్ రాణాను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో జరిగిన ఆఖరి టెస్టులో బుమ్రా గాయపడిన విషయం తెలిసిందే. అయితే తను ఇంకా మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేదని బోర్డు పేర్కొంది. బుమ్రా లేకపోవడంతో జట్టు బౌలింగ్ బలహీనంగా మారినప్పటికీ దేశవాళీ, ఐపీఎల్‌లో విశేషంగా రాణించిన రాణాపై సెలెక్టర్లు నమ్మకముంచారు. మరోవైపు ప్రాథమిక జట్టులో జైస్వాల్ ఉన్నప్పటికీ.. అతడి స్థానంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి సీటీ జట్టులో చోటు కల్పించారు. ఇక నాన్ ట్రావెలింగ్ రిజర్వ్ ఆటగాళ్లలో సిరాజ్, దూబేలతో పాటు జైస్వాల్ ఉండనున్నాడు.

భారత్ తుది జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, పంత్, హార్దిక్, అక్షర్, సుందర్, కుల్దీప్, రాణా, షమి, అర్ష్‌దీప్, జడేజా, వరుణ్.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

జోష్‌లో టీమిండియా • కోహ్లీ ఫామ్‌పై దృష్టి • ఇంగ్లండ్‌తో ఆఖరి వన్డే నేడు

మ.1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



అహ్మదాబాద్: వరుసగా రెండు వన్డేల్లో అద్భుత విజయాలు సాధించిన టీమిండియా ఇప్పుడు క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. దీంట్లో భాగంగా బుధవారమిక్కడి నరేంద్ర మోదీ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగే ఆఖరిదైన మూడో వన్డేలో తలపడనుంది. రెట్టించిన ఉత్సాహంతో ఉన్న రోహిత్ సేన ఈ మ్యాచ్‌ను కూడా ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. తద్వారా ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో సగర్వంగా బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. అటు వరుసగా టీ20, వన్డేల్లో సిరీస్‌లను కోల్పోయిన బట్లర్ సేనకు ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు మెకల్లమ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాక ఆ జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తోంది. బజ్‌బాల్ గేమ్‌ను అలవాటు చేసుకున్న ఈ టీమ్ భారత్‌లో తమ స్థాయికి తగ్గ ఆటతీరును కనబర్చడం లేదు. కనీసం నేటి మ్యాచ్‌లోనైనా గెలిచి ఓదార్పు విజయంతో సీటీలో అడుగుపెట్టాలనుకుంటోంది. ఏదేమైనా సీటీ ముందు ఇరు జట్లకు ఇదే ఆఖరి సన్నాహకం కావడంతో ఎలాంటి అలక్ష్యం లేకుండా పోరాడాలనుకుంటున్నాయి. ఇక లక్షకు పైగా సామర్థ్యం కలిగిన స్థానిక స్టేడియంలో భారత జట్టు చివరిసారి వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆడి ఓడింది.

బౌలింగ్ బలహీనంగా..

రెండో వన్డేలో ఇంగ్లండ్ బ్యాటర్లు విశేషంగా రాణించారు. టాప్-6 ఆటగాళ్ల జోరుతో స్కోరు 300 దాటగలిగింది. కానీ భారీస్కోరును కాపాడుకునే క్రమంలో బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. భారత్ అలవోకగా లక్ష్యాన్ని పూర్తి చేయగలిగింది. కటక్‌లో ఛేజింగ్ జట్టుకు విజయావకాశాలు ఉంటాయని తెలిసి కూడా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవడం ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టింది. అలాగే పేసర్ ఆర్చర్‌కు విశ్రాంతినివ్వడమూ దెబ్బతీసింది. కాగా, ఈ మ్యాచ్‌లో ఆర్చర్‌తో పాటు బ్రైడన్ కార్స్‌ను ఆడించే అవకాశం ఉంది. స్పిన్నర్ ఆదిల్ రషీద్ మాత్రం నిలకడగా రాణించగలుగుతున్నాడు.

మార్పులుంటాయా?

సిరీస్‌ను ఇప్పటికే 2-0తో వశం చేసుకున్న భారత్ నామమాత్రమైన ఆఖరి మ్యాచ్ కోసం ఎలాంటి కూర్పుతో దిగనుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ముందు రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లకు ప్రాక్టీస్ లభిస్తే బావుంటుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో వికెట్ కీపర్ రిషభ్ పంత్, పేసర్ అర్ష్‌దీప్, స్పిన్నర్ సుందర్‌లను ఆడిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. అయితే పంత్ జట్టులోకి రావాలంటే రాహుల్‌ను తప్పించాలి. అతనిప్పటికే ఆరో నెంబర్‌లో ఆడి ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. ఇక అర్ష్‌దీప్, సుందర్‌లను కూడా ఆడించేందుకు కోచ్ గంభీర్ సిద్ధంగా ఉన్నాడా? లేడా? అనే విషయంలో స్పష్టత లేదు. ఇక స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫామ్ ఒక్కటే జట్టును ఆందోళనపరుస్తోంది. గాయంతో తొలి వన్డేకు దూరమైన అతను రెండో మ్యాచ్‌లో ఐదు రన్స్‌కే పరిమితమయ్యాడు. అంతకుముందు ఆసీస్ టూర్‌లోనూ విఫలమయ్యాడు. దీంతో నేటి మ్యాచ్ అతడికి అగ్నిపరీక్ష కానుంది. కెప్టెన్ రోహిత్ సూపర్ సెంచరీ టీమిండియాలో జోష్‌ను నింపింది. విరాట్ సైతం పరుగుల బాట పడితే చాంపియన్స్ ట్రోఫీ ముందు జట్టుకు తిరుగులేని ఆత్మవిశ్వాసం లభించినట్టవుతుంది. బౌలింగ్‌లో పేసర్లు హర్షిత్, షమిలతో పాటు స్పిన్నర్లు జడేజా, అక్షర్, వరుణ్ సమష్టిగా రాణిస్తున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, శ్రేయాస్, రాహుల్/పంత్, హార్దిక్, జడేజా/సుందర్, అక్షర్, వరుణ్, రాణా/అర్ష్‌దీప్, షమి.

ఇంగ్లండ్: డకెట్, సాల్ట్, బాంటన్, రూట్, బ్రూక్, బట్లర్ (కెప్టెన్), లివింగ్‌స్టోన్, కార్స్, ఆర్చర్, రషీద్, ఉడ్.

పిచ్

ఈ వికెట్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. బౌండరీ విస్తీర్ణం కూడా పెద్దది. తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు కేవలం 237 మాత్రమే. అలాగే స్పిన్నర్లకు ఎక్కువగా అనుకూలిస్తుంటుంది. మంచు ప్రభావం ఎక్కువే. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

ఫిక్సింగ్ ఆరోపణలతో బంగ్లా మహిళా క్రికెటర్‌పై నిషేధం

దుబాయ్: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో బంగ్లాదేశ్ ఆఫ్ స్పిన్నర్ షొహెలి అక్తర్‌పై ఐసీసీ ఐదేళ్ల నిషేధం విధించింది. 36 ఏళ్ల షొహెలి బంగ్లా తరఫున రెండు వన్డేలు, 13 టీ20ల్లో ప్రాతినిథ్యం వహించింది. 2023లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్ సందర్భంగా షొహెలి మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు ప్రయత్నించినట్టు ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) విచారణలో తేలింది. ఆ టోర్నీలో తలపడ్డ బంగ్లా జట్టులో షొహెలి సభ్యురాలు కానప్పటికీ, మ్యాచ్‌లు ఫిక్స్ చేయాలంటూ సహచర క్రికెటర్‌కు ఆమె డబ్బు ఆశజూపింది. ఈనెల 10 నుంచి షొహెలిపై నిషేధం అమల్లోకి రానుంది. దీంతో ఫిక్సింగ్ ఆరోపణలతో నిషేధానికి గురైన తొలి మహిళా క్రికెటర్‌గా షొహెలి అక్తర్ అపఖ్యాతిని మూటగట్టుకుంది.

ఇందిరమ్మ ఇంటికి శాటిలైట్ లింక్.!

- నిర్మాణం పూర్తయ్యే వరకు పర్యవేక్షణ
- దశల వారీ నిర్మాణం తెలుసుకునే అవకాశం
- అక్రమాలకు, అవకతవకలకు కృత్రిమ మేధతో చెక్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి పథకంలో రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకోనుంది. ఇంటి నిర్మాణం కోసం ముగ్గులు పోసే దగ్గరి నుంచి ఇల్లు పూర్తయ్యే వరకు దశలవారీగా టెక్నాలజీ ఆధారంగానే పర్యవేక్షించనుంది. దీని ప్రకారమే నాలుగు దశల్లో ఆర్థిక సాయాన్ని అందించనుంది. గతంలో మాదిరిగా ఇండ్ల నిర్మాణాల్లో అవకతవకలు, అక్రమాలకు అవకాశం లేకుండా ఉండేందుకు గృహ నిర్మాణ సంస్థ సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఇందుకోసం కృత్రిమ మేధ(ఏఐ), శాటిలైట్ సేవలను వినియోగించనుంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇంటి కోసం ప్రభుత్వానికి వచ్చిన దరఖాస్తుల పరిశీలనలోనూ కృత్రిమ మేధను వినియోగిస్తున్న అధికారులు, ఇకపై ఇళ్ల నిర్మాణాల్లోనూ దీనిని ఉపయోగించనున్నారు. దీని ద్వారా కచ్చితమైన ఫలితాలు వస్తుండడంతోనే అధికారులు ఈ నూతన సాంకేతికతపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఇంటి మంజూరు నుంచి నిర్మాణం పూర్తై లబ్ధిదారులకు ఆర్థికసాయం పూర్తిగా అందేవరకు ఎక్కడా అక్రమాలకు, అవినీతికి అవకాశం లేకుండా ఇది ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

శాటిలైట్, ఏఐ వినియోగం ఇలా

ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మించబోయే ఇంటికి ముగ్గులు పోసిన తరువాత ఆ స్థలానికి అక్షాంక్ష, రేఖాంక్ష సంఖ్యలను ఖరారు చేస్తారు. అనంతరం వాటిని శాటిలైట్‌కు అనుసంధానం చేస్తారు. అలా అనుసంధానం అయిన నిర్మాణాల పర్యవేక్షణ మొత్తం ఆన్‌లైన్ విధానంలో ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అవకాశం ఉంది. ఇది ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండడంతో ఉన్నతాధికారులు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. ఇంటి నిర్మాణానికి అందించే నాలుగు దఫాల ఆర్థిక సాయాన్ని ఏయే దశల్లో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందో ఆ దశలను ఆన్‌లైన్ పొందుపర్చుతారు. నిజమైన అర్హులు, వారు నిర్మించుకునే ఇంటికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాతే బిల్లులు అందనున్నాయి.

ప్రతి మహిళకు రేవంత్ బాకీ రూ.35 వేలు

- తులం బంగారం, స్కూటీ హామీలు ఏమయ్యాయి?
- మహిళా దినోత్సవం లోపు కార్యాచరణ ప్రకటించాలి
- లేకుంటే ప్రజా ఉద్యమం: ఎమ్మెల్సీ కవిత హెచ్చరిక



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చొప్పున ఇప్పటివరకు రూ.35,000 రేవంత్ సర్కార్ బాకీ పడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. 'మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చొప్పున డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా కూడా ఆ హామీని అమలు చేయకపోవడం దారుణం. 14 నెలల డబ్బు రూ.35,000 చొప్పున రాష్ట్రంలోని ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడింది. మహిళా దినోత్సవం లోపు (మార్చి 8) హామీల అమలుపై కార్యాచరణ ప్రకటించాలి' అని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, ఆడపిల్లలందరికీ ఉచితంగా స్కూటీలు అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని, ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

పదేళ్ల మీ పాలన..
ఏడాది మా పాలనపై చర్చకు సిద్ధమా?

- కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సవాల్



పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పార్టీ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. దీనిపైనా తాను చర్చకు సిద్ధమన్నారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణలపైనా చర్చకు ఎక్కడికి రమ్మన్నా వస్తానన్నారు. ఉత్తర కుమార ప్రగల్భాలు కట్టిపెట్టి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల తరహాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ గాడిద గుడ్డు వస్తుందని తెలిసే.. బీఆర్ఎస్ ఇంతవరకు అభ్యర్థులను ప్రకటించలేదన్నారు.

పీఏసీ సమావేశం నుంచి..
మరోమారు బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ(పీఏసీ) చైర్మన్‌గా అరికెపూడి గాంధీ నియామకాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కమిటీ సభ్యులు మరోమారు కమిటీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వైద్య, ఆరోగ్యశాఖ పద్దులపైన సమీక్షించేందుకు ఆ శాఖ అధికారులతో మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో అరికెపూడి గాంధీ అధ్యక్షతన పీఏసీ సమావేశమైంది. అయితే సమావేశం ప్రారంభం అయ్యాక.. అరికెపూడిని పీఏసీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, ఎల్. రమణలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. పీఏసీ ఏర్పాటయ్యాక ఇప్పటికి రెండు సార్లు సమావేశం జరుగగా.. రెండు సమావేశాల నుంచీ బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. కాగా, బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్ తర్వాత వైద్య, ఆరోగ్యశాఖ పద్దులపైన పీఏసీ చైర్మన్ అరికెపూడి, సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల, భానుప్రసాదరావులు దాదాపు మూడు గంటల పాటు సమీక్ష జరిపారు.

ఏసీబీ వలలో ధారూరు ఎస్ఐ

- ఉత్తమ అవార్డు అందుకున్న 15 రోజుల్లోనే ఘటన

ధారూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఓ కేసులో రూ.50 వేల లంచం డిమాండు చేసి రూ.30 వేలు తన ప్రైవేట్ డ్రైవర్ ద్వారా తీసుకుంటున్న ధారూరు ఎస్ఐని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని ఎస్ఐ, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా ధారూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. ఏసీబీ అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. మండల పరిధిలోని నాగసమందర్ గ్రామానికి చెందిన ఉప్పరి హన్మంతు, ఉప్పరి గోపాల్ దాయాదులు. ఇద్దరి భూ తగాదాల్లో హన్మంతు వర్గం గోపాల్ వర్గంపై దాడి చేసి గాయపర్చింది. ఈ వివాదంలో గోపాల్ వర్గానికి చెందిన ఏడుగురిపై కేసులు నమోదయ్యాయి. కాగా ఈ కేసులో ఒకరిని తప్పించడానికి, విగతా ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇవ్వటానికి రూ.70 వేల లంచం డిమాండు చేశాడు ధారూరు ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్. చివరకు రూ.50 వేలకు బేరం కుదుర్చుకున్నారు. ఒప్పందంలో భాగంగా మంగళవారం రూ.30 వేలు ఇచ్చేందుకు గోపాల్ ఎస్ఐ వద్దకు రాగా డ్రైవర్ బీరప్పకు ఇవ్వాలని సూచించాడు. దీంతో డ్రైవర్ బీరప్పకు రూ.30 వేలు ఇవ్వగా అనంతరం ఆ డబ్బులను ఎస్ఐకి అందిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ నుంచి రూ.30 వేలు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. జనవరి 26న గణతంత్ర వేడుకల్లో కలెక్టర్, జిల్లా ఎస్పీ నుంచి ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న 15 రోజుల్లో ఏసీబీ అధికారులకు పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది.



బీర్ల ధరలు పెరిగాయ్

(మొదటిపేజీ తరువాయి)

పెరిగాయి. ఒక్కో బీరు ధర సగటున రూ.35 మేర పెరిగింది. ఉదాహరణకు సోమవారం దాకా రూ.150 ఉన్న కింగ్‌ఫిషర్ లైట్ బీరు సీసా ధర 15 శాతం పెంపుతో రూ.172.50 అవుతుంది. కానీ, దగ్గరి దశాంశ రూపాయికి సవరించడంతో ఆ సీసా ధర రూ.180కి చేరింది. మిగిలిన బ్రాండ్ల బీర్ల ధరలు కూడా ఇలానే పెరిగాయి. కాగా, రాష్ట్రంలో ప్రతి నెలా 41లక్షల కేసులు (ఒక కేసులో 12సీసాలు) అంటే సుమారు 4.92కోట్ల బీర్లు అమ్ముడవుతాయి. అంటే ప్రతి నెలా దాదాపు 5 కోట్ల బీర్లు అమ్ముతారు. ఒక్కో బీరు ధర సగటున రూ.35 పెరిగిందంటే రూ.175 కోట్లు అదనంగా వస్తుంది. అయితే, ఈ పెంచిన ధరల్లో బీర్ల తయారీదారులకు ఒక్క కేసుకు పెరిగేది రూ.42 మాత్రమే. ఇప్పటివరకు కింగ్ ఫిషర్ లైట్ బీరు ఒక కేసుకు ప్రభుత్వం తయారీదారుకు రూ.290 చెల్లిస్తుండగా.. పెరిగిన రూ.42తో కలిపి ఇకపై రూ.332 చెల్లిస్తుంది. ఈ లెక్కన బీరు తయారీ దారులకు పెరిగిన ధర ఒక బీరుకు రూ.3.50 మాత్రమే. ఇది కాక దుకాణ యజమానులకు చెల్లించే కమీషన్ పోను ప్రభుత్వానికి ప్రతి నెలా సుమారు రూ.150 కోట్లు అదనపు ఆదాయంగా సమకూరనుందని అంచనా.

బీరు (650ఎంఎల్)	పాత ధర	ప్రస్తుత ధర
కేఎఫ్ లైట్	150	180
కేఎఫ్ ప్రీమియం	160	190
హేవార్డ్స్	160	190
కేఎఫ్ అల్ట్రా	210	250
బడ్వైజర్ లైట్	210	250
కేఎఫ్ అల్ట్రా మ్యాక్స్	220	260
బడ్వైజర్ మ్యాగ్నం	220	260
టూబర్గ్ స్ట్రాంగ్	220	260
నాకౌట్	160	190
రాయల్ చాలెంజ్	150	180

మంత్రివర్గ విస్తరణపై కదలిక



(మొదటిపేజీ తరువాయి)

సేకరించిన ఇతరత్రా సమాచారం, సామాజిక సమీకరణాలు, ఉమ్మడి జిల్లాల వారీ ప్రాతినిధ్యం తదితరాలను పరిగణనలోకి తీసుకుని కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఈ దఫా విస్తరణలో నలుగురికే చాన్స్ ఉండవచ్చని అంటున్నారు. మరో వారం పది రోజుల్లో ఈ కసరత్తు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని, రాని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే విస్తరణ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, అధిష్ఠానం వద్ద జరిగిన సమీక్షలో మాదిగ (ఉపకులం) కోటా కింద స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై చర్చించారు. మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి పేరుపై చర్చ జరిగింది. రెడ్డి సామాజికవర్గంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెలమ సామాజిక వర్గం నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, ముదిరాజ్ సామాజికవర్గం నుంచి వాకిటి శ్రీహరి, లంబాడా వర్గం నుంచి బాలునాయక్ పేర్లపై ప్రధానంగా అభిప్రాయ సేకరణ జరిగినట్లు తెలుస్తోంది.

వాకిటి శ్రీహరికి బెర్తు ఖాయం!

లోక్‌సభ ఎన్నికల సమయంలో ముదిరాజ్ సామాజికవర్గ నేతను మంత్రివర్గంలోకి తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి బెర్తు ఖరారైనట్లేనని చెబుతున్నారు. మాదిగ వర్గం నుంచి కడియం శ్రీహరి పేరు పరిశీలనలో ఉన్నా.. ఆయనపై ప్రస్తుతం అనర్హత కత్తి వేలాడుతోంది. ఈ నెల 18న సుప్రీంకోర్టు స్పందనను బట్టి నిర్ణయం ఉంటుందని అంటున్నారు. ఇక వివేక్ కుటుంబానికి ఇప్పటికే ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి ఉండడం ఆయనకు అవరోధంగా మారింది. పైగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే చెందిన ప్రేమ్‌సాగర్‌రావు.. వివేక్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మద్దతుతో ఆయన తన వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదిస్తున్నారు.

నల్లగొండ జిల్లాతో పీటముడి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలునాయక్‌ల పేర్లపై నిర్ణయం తీసుకునే విషయంలో అధిష్ఠానం ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఎస్టీ లంబాడా నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని అధిష్ఠానం భావిస్తోంది. ఆ వర్గంలో సీనియర్‌గా బాలునాయకే కనిపిస్తున్నారు. అయితే అధికారంలోకి వస్తే మంత్రివర్గంలోకి తీసుకుంటామనే హామీ మేరకే రాజగోపాల్‌రెడ్డి పార్టీలో తిరిగి చేరారని, ఆ హామీని నెరవేర్చాలంటూ ఆయన పట్టు బడుతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఆయన సోదరుడు వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉండడం, జిల్లాకు చెందిన బాలునాయక్ రేసులో ఉండడంతో వారిద్దరిపై అధిష్ఠానం తర్జనభర్జన పడుతోంది. కాగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి టి.రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రివర్గంలో చోటుకోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. హామీలు, సామాజిక సమీకరణలు, రేవంత్, భట్టి, మహేశ్‌గౌడ్, ఉత్తమ్‌ల అభిప్రాయాలతో ముడిపడి ఉన్నందున.. జటిలంగా ఉన్నవాటిని పెండింగ్‌లో పెట్టి, ఈ దఫా విస్తరణలో నలుగురినే తీసుకునే అవకాశం ఉందని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

టీపీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, సీనియర్ అధికార ప్రతినిధులను అధిష్ఠానం వారంలోపే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి మూడు పేర్ల చొప్పున అధిష్ఠానానికి రేవంత్, భట్టి, మహేశ్‌గౌడ్, ఉత్తమ్ ఇచ్చినట్లు తెలిసింది. రెడ్డి, ఎస్సీ మాదిగ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ వర్గాల నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్లను తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. రెడ్డి సామాజికవర్గం నుంచి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిల పేర్లు పరిశీలనకు ఇచ్చారు. ఎస్సీ మాదిగ నుంచి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. లంబాడా వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్, టీపీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్ బెల్లయ్యనాయక్‌ల పేర్లు పరిశీలిస్తున్నారు. ముస్లిం మైనారిటీల నుంచి ప్రస్తుత కార్యనిర్వాహక అధ్యక్షుడు అజరుద్దీన్, నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్, పార్టీ నేత ఫహీం ఖురేషీల పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

ప్రతి జిల్లాకూ ప్రాతినిధ్యం..

ఈసారి అధికార ప్రతినిధులను పరిమిత సంఖ్యలో తీసుకోవాలన్న ఆలోచనలో ఉన్న అధిష్ఠానం.. కార్యనిర్వాహక అధ్యక్షులతోపాటుగా వారి నియామకాన్నీ జరపనుంది. టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకం విషయంలోనూ పార్టీ నాయకత్వం తర్జన భర్జన పడుతోంది. ప్రతి జిల్లాకూ ప్రాతినిధ్యం దక్కేలా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కూర్పు జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు, పదేళ్లుగా పార్టీనే అంటిపెట్టుకున్నవారి మధ్య వివాదం నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో పార్టీపై విమర్శలు చేసి.. బీఆర్ఎస్ పార్టీలో చేరిన అనేక మంది నాయకులు ఆ తర్వాత తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తమ పూర్వ పదవులు తిరిగి దక్కించుకునేదుకు వారు ప్రయత్నాలు చేస్తుండగా.. పార్టీలోనే ఉండి ఆయా పదవులు ఆశిస్తున్నవారు అభ్యంతరాలు చెబుతున్నారు. ఈ వివాదాలను పరిష్కరించేందుకు మరికొంత సమయం పట్టే ఆస్కారం ఉన్నందున.. ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకం మరికొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రాజ్‌తరుణ్-లావణ్య కేసులో... నార్సింగ్ డీఐ శ్రీనివాస్‌పై బదిలీ వేటు

- నేను చాలా గలీజ్... ఓ పోలీసు అధికారితో లావణ్య మాటలు వైరల్
- సంచలనం రేపుతున్న ఆడియో క్లిప్

నార్సింగ్/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజ్‌తరుణ్-లావణ్య కేసులో నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌పై బదిలీ వేటు పడింది. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కేసు విచారణ సమయంలో లావణ్య ఇంటికి వెళ్లిన శ్రీనివాస్.. ఆమెతో కుమ్మక్కై కేసును తప్పుదోవ పట్టించినట్లు ప్రాథమిక సమాచారం అందడంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతర్గత విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఈ కేసులో మస్తాన్ సాయి అరెస్టు తర్వాత ఆడియో టేపుల లీకులు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఒక్కో ఆడియో టేపులో ఒక్కో విషయం ఉండడంతో సోషల్ మీడియాలో సంచలనంగా మారుతోంది. తాజాగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బదిలీ కావడం వీటి ప్రభావమేనని వినిపిస్తోంది. మస్తాన్ సాయి నుంచి స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్క్‌లో నగ్న వీడియోలు, ఫొటోలతో పాటు ఆడియో క్లిప్‌లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఓ పోలీసు అధికారితో లావణ్యదిగా చెబుతున్న సంభాషణ ఆడియో క్లిప్ ఇప్పుడు వైరల్ అయింది. అందులో 'రావటం లేదని చెప్పాలా నీకు? వస్తా అంటే ఏమైతది.. ఇప్పుడు నీకు? వస్తా అంటే ఏం చేస్తరు? అవన్నీ మీకు ఎందుకు..? నాకు కావాలి!' అని ఆమె అంటే 'రావద్దు అర్థం చేసుకోండి' అని ఆ పోలీస్ అధికారి బదులిచ్చాడు. దానికి ఆమె స్పందిస్తూ 'అర్థం చేసుకోను... గలీజ్... నేను చాలా గలీజ్... నేను ఇప్పుడే వస్తా... మీరు డ్యూటీలో ఉన్నారు. పనిలో ఉండి కలవలేక అవ్వలేదు అంటే పర్వాలేదు.. నో ప్రాబ్లమ్! సరే... అప్పుడు దూరం నుంచి మిమ్మల్ని చూసి వెళ్లిపోతాను. నీ బతుకు నువ్వు చూసుకో... నీది నువ్వు చూసుకో... సంబంధం లేనట్టుగా ఉండు. జస్ట్ సరదాగా ఇన్ఫర్మేషన్ ఇచ్చేయండ'ని అడిగింది. దానికి ఆ పోలీసు అధికారి.. 'నీ గురించి ఇస్తాను.. ఇన్ఫర్మేషన్ ఇస్తాను... ఎక్స్‌క్లూజివ్ ఇస్తాను' అని బదులిచ్చాడు. దానికి ఆమె 'ఎలాగైతే కాప్స్‌తో ఉన్నానో.. మీతో అలాగే ఉంటాను. మనసులోనే ఉంచుకుంటాన'ని తెలిపింది.

రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన ఖరారు.. రద్దు

- ఆకస్మిక నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణుల్లో అయోమయం
- పార్లమెంట్ సమావేశాలా? పార్టీ అంతర్గత పరిణామాలా ? అని చర్చ



వరంగల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోకసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు అయింది. మంగళవారం జరగాల్సిన ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైన కాసేపటికే పర్యటన రద్దవ్వడం కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన షెడ్యూల్‌పై మంగళవారం ఉదయం పదిన్నర గంటలకు ప్రకటన వచ్చింది. దాని ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న రాహుల్.. ఆరు గంటలకు హెలికాప్టర్‌లో వరంగల్ వెళ్లాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనపై సంబంధిత వర్గాలతోనూ, తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై పార్టీ నేతలతో ఆయన మాట్లాడతారని పేర్కొన్నారు. అనంతరం రాత్రి 7.50గంటలకు వరంగల్ నుంచి తమిళనాడు ఎక్స్‌ప్రెస్(12622)లో చెన్నై వెళ్లాల్సి ఉంది. రాహుల్ గాంధీ వరంగల్ వస్తున్నారని తెలియడంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు కూడా చేశారు. కానీ, మధ్యాహ్నం 1.30 గంటలప్పుడు పర్యటన రద్దయిందని ప్రకటన వచ్చింది. ఈ పర్యటన రద్దుకు పలు కారణాలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్‌లో బుధవారం కీలకమైన అంశాలపై చర్చ ఉండటంతో రాహుల్ గాంధీ తన పర్యటనను రద్దు చేసుకున్నారని పలువురు నేతలు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో 31మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో రాహుల్ ప్రయాణానికి భద్రతా వర్గాలు అంగీకరించకపోవడంతో పర్యటన రద్దయిందనే మరికొందరు అంటున్నారు. ఇక, పార్టీలో అంతర్గత విభేదాల మూలంగా రాహుల్ తన పర్యటనను రద్దు చేసుకున్నారనే ప్రచారం కూడా ఉంది. టీపీసీసీ అధ్యక్షుడు మినహా ముఖ్యనేతలెవ్వరూ ఈ పర్యటనలో తనతో ఉండకూడదని రాహుల్ గాంధీ స్పష్టం చేసినట్లుగా తెలిసింది. అయితే, దీనివల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని రాష్ట్ర కమిటీ నుంచి వెళ్లిన నివేదికలతో రాహుల్ పర్యటన రద్దు చేసుకున్నారనే ప్రచారం పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతుంది.

కేంద్ర బడ్జెట్‌పై నేటి నుంచి విస్తృత ప్రచారం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రచార కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ ఆయా వర్గాలతో ఏర్పాటు చేసే సమావేశాలకు హాజరవుతారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఈ బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

హరీశ్‌రావు పాదయాత్ర

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేయాలనే డిమాండ్‌తో యాత్ర

- ఆ ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో వారం రోజులు.. 130 కిలోమీటర్లు
- గ్రామాల్లో రోజుకో సభ.. చివరి రోజు కేసీఆర్ హాజరు



హైదరాబాద్/సంగారెడ్డి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు త్వరలో పాదయాత్ర చేపట్టనున్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలనే డిమాండ్‌తో, ఆ ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో ఆయన ఈ యాత్ర చేపడుతున్నారు. రెండేళ్ల క్రితం 2022 ఫిబ్రవరి 21న నారాయణఖేడ్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కాగా, ఇటీవల ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో తనను కలిసిన పార్టీ నేతలతో కేసీఆర్ మాట్లాడుతూ.. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం పోరాడదామని శ్రేణులకు సూచించారు. ఈ బాధ్యతను సీనియర్ నేత హరీశ్‌రావుకు అప్పగించారు. అందుకు అనుగుణంగానే హరీశ్‌రావు పాదయాత్రకు సిద్ధమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ మేరకు పాదయాత్ర తేదీలను ప్రకటించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడితే.. ఎన్నికల తర్వాత పాదయాత్ర ప్రారంభిస్తారు. ఎన్నికలు ఏప్రిల్, మేలో ఉంటే.. ఈ నెలలోనే పాదయాత్ర మొదలుపెడతారు. ప్రతి రోజూ సుమారు 18 నుంచి 20 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగుతుంది. ఆరు రోజుల పాటు సుమారు 130 కిలోమీటర్ల యాత్ర కొనసాగించేలా షెడ్యూల్ రూపొందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఈ పాదయాత్ర సాగుతుంది. సర్వే పూర్తయి భూసేకరణ దశలో నిలిచిపోయిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టుల పనులను వెంటనే ప్రారంభించి జిల్లాలోని 397 గ్రామాల్లో దాదాపు 4లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని హరీశ్‌రావు కోరుతున్నారు.

సంగమేశ్వర ఆలయం వద్ద ప్రారంభం..

హరీశ్‌రావు పాదయాత్రను ఝరాసంగం మండలం కేతకి సంగమేశ్వర ఆలయం వద్ద ప్రారంభించి నారాయణఖేడ్‌లోని బసవేశ్వర విగ్రహం వద్ద ముగించనున్నట్లు సమాచారం. దాదాపు వారం రోజులపాటు పాదయాత్ర సాగేలా, ప్రతిరోజూ ఒక సభ నిర్వహించేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. పాదయాత్ర ముగింపు రోజు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు, దీనికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరు కానున్నట్లు సమాచారం. ఎత్తిపోతల ప్రాజెక్టుల పనులను ప్రారంభించే డిమాండ్‌తోపాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కూడా ఈ పాదయాత్రను హరీశ్‌రావు వినియోగించుకోనున్నట్లు చెబుతున్నారు.

ప్రజలు తిడుతున్నా రేవంత్‌కు రోషం లేదు

అన్నీ దులుపుకొని తిరుగుతున్నారు.. వేరేవాళ్లయితే బకెట్ నీళ్లల్లో దూకి చచ్చేవారు

- 30% కమిషన్ అంటూ డిప్యూటీ సీఎంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపణ
- కాంగ్రెస్ సర్కార్ బీసీలను మోసగించింది: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తిడుతున్న తిట్లను వింటే పౌరుషం ఉన్న ఎవరైనా బకెట్ నీళ్లలో దూకి చచ్చేవాడని.. రేవంత్‌రెడ్డికి రోషంలేదు కాబట్టే అన్నీ దులుపుకొని తిరుగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో జరిగిన ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్యాణలక్ష్మి చెక్కులిస్తున్న ఓ మంత్రిని.. తులం బంగారం లేదని మహిళలు ప్రశ్నించారని, తమ స్కూటీ హామీ ఏమైందని కాలేజీ పిల్లలు పోస్టుకార్డు ఉద్యమం మొదలుపెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయామని అన్ని వర్గాల ప్రజలు అనుకుంటున్నారని, ఆ పార్టీ నాయకులను ప్రజలు గల్లా పట్టి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. సీఎం నియోజకవర్గంలోని పనులతో పాటు తెలంగాణలోని ప్రతిపని కాంట్రాక్టు ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రికే దక్కుతోందన్నారు. కాంట్రాక్టు మంత్రి, ఆయన కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి పని చేస్తున్నారని వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం 30% కమీషన్లు తీసుకొని పనులు చేస్తున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యేనే చెబుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ మంత్రి రుణమాఫీ కాలేదని చెప్తే.. సీఎం మాత్రం మొత్తం రుణ మాఫీ అయ్యిందని అబద్ధాలు చెబుతున్నారన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ కుతంత్రాలను గులాబీ దండు అడ్డుకుంటుందని చెప్పారు. ఖమ్మం జిల్లాలో 2014 తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అసాధారణ అభివృద్ధి చేసిందని, పువ్వాడ అజయ్ వంటి మంచి నాయకుడు ఓడిపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. జిల్లాలోని ప్రత్యేక రాజకీయ సమీకరణల వల్ల బీఆర్ఎస్‌కు నష్టం జరిగిందన్నారు. ఓడిపోయినా ప్రజలకు కష్టంవస్తే.. బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు ఏడాది కాలంగా ప్రజలకు అండగా ఉంటున్నారన్నారు. ఖమ్మంలో ఇటీవల వరదలు వస్తే ప్రజలకు పువ్వాడ అజయ్ గుర్తుకొచ్చారని తెలిపారు. డిప్యూటీ సీఎం సహా ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నా.. వరదల సమయంలో వారితో పైసా ఉపయోగం లేకుండా పోయిందదన్నారు. కేసీఆర్ సీఎంగా లేకపోవడంతో ఎంతో నష్టపోయామన్న భావనతో ప్రస్తుతం తెలంగాణ ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. 42% రిజర్వేషన్, బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని, రూ.లక్షకోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు బీసీ జనాభాను తగ్గించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వర్గ ప్రజలను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ చేయించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా 51.5% ఉంటే.. రేవంత్ కులగణన సర్వేలో ఐదున్నర శాతం తగ్గించి 46% చూపించారన్నారు. రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఏడాది కాలంగా కేసులు పెట్టి వేధిస్తున్నా.. విచారణల పేరిట పిలిచి జైల్లో పెడతామని బెదిరిస్తున్నా.. ప్రజా సమస్యలపై రేవంత్‌రెడ్డితో పోరాడుతున్నామని, భవిష్యత్తులోనూ కొట్లాడతామని, త్వరలోనే ఖమ్మంలో పర్యటిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ వెల్లడించారు.

టెక్నాలజీ అంటే హైదరాబాద్ వైపు చూడాలి

గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా జీసీసీలు

ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారే సత్తా తెలంగాణకుంది: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : టెక్నాలజీ అంటేనే ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హెచ్ఐసీసీలో మంగళవారం జరిగిన 32వ హైసియా నేషనల్ సమ్మిట్ అండ్ అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హబ్‌గా హైదరాబాద్‌ను మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పుడు మరో అడుగు ముందుకేసి వాటిని గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లు(జీవీసీ)గా మార్చాలని సంకల్పించినట్లుగా వివరించారు. తెలంగాణ ఐటీ రంగం వార్షిక వృద్ధి రేటు 13% పైచిలుకు, ఐటీ ఎగుమతుల విలువ 32 బిలియన్ డాలర్లు, దేశీయ ఐటీ అవుట్‌పుట్ 5 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారే సత్తా తెలంగాణకు ఉందన్నారు. పెట్టుబడులు హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తున్నామన్నారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయా ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరారు. విదేశాలకు ముడి వస్తువులు, విడి భాగాలు సరఫరా చేయడానికే పరిమితం కాకుండా ఇక్కడే అంతిమ వినియోగ వస్తువులు తయారయ్యేలా చూడటమే తమ లక్ష్యమన్నారు.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లకు కులగుణన సర్వే ఫాంలను పంపాం

» జవాబు ఇచ్చిన తరువాతనే మాట్లాడండి: పొన్నం



కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): "కులగణనలో భాగంగా సర్వేకు వెళ్లిన అధికారులకు బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఎలాంటి వివరాలు ఇవ్వలేదు. ఇప్పుడైనా వాళ్ల కుటుంబ, ఆస్తులు, ఇతర వివరాలు అందజేయాలని కోరుతూ సర్వే ఫాంలను పోస్ట్ ద్వారా ఆ ముగ్గురు నేతలకు పంపిస్తున్నా" అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ముందు బీఆర్ఎస్ అగ్రనేతలు వారి వివరాలు అందజేసిన తరువాతనే కులగణనపై మాట్లాడాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. కులగణనను అడ్డుకుంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను సమర్పించిన బీజేపీకి, సర్వేలో పాల్గొనని బీఆర్ఎస్ నేతలకు కులగణనపై మాట్లాడే నైతిక అర్హత లేదని ఆయన అన్నారు.

ఇంటింటికీ ఫైబర్‌నెట్‌కు ప్రభుత్వం కృషి

» టీ-ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ వెల్లడి

» హాజీపల్లిలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ ఫైబర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టీ-ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ తెలిపారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామంలో ఫైబర్‌నెట్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు అమలు చేయనున్నామని ఆయన తెలిపారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి పైలట్ ప్రాజెక్టు అమలుకు హాజీపల్లిని ఎంపిక చేసి, వెంటనే కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి ఇంటికీ ఫైబర్‌నెట్ సేవలు అందుతాయని, తద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం లభిస్తుందని తెలిపారు. గ్రామంలో 274 ఇళ్లు ఉన్నాయని, ప్రస్తుతం 80 ఇళ్లకు ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చామని, మిగతా ఇళ్లకు త్వరలో ఇస్తామని వివరించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్ఠాత్మకం

» క్యాడర్, లీడర్ అప్రమత్తంగా ఉండాలి

» కరీంనగర్ జిల్లా నేతలతో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్ఠాత్మకమని, పార్టీ నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి పనిచేయాలని కరీంనగర్ జిల్లా నేతలకు ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈ ఎన్నికల్లో గెలిచి.. అదే ఊపుతో స్థానిక సంస్థల ఎన్నికలకూ సమాయత్తం కావాలన్నారు. స్థానిక ఎన్నికల్లో జడ్పీటీసీ, సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నాయకులను ఈ ఎన్నికల్లో భాగస్వాములను చేయాలని చెప్పారు. తద్వారా రేపటి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించడం సులభతరమవుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతి ఓటూ కీలకమేనని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాగాన్ని భాగస్వామ్యం చేయగలిగితే గెలుపు నల్లేరుపై నడకే అవుతుందని అన్నారు.

కేరళ తరహాలో పంచాయతీల బలోపేతం

» పాలక మండళ్లు ఏర్పడేలోపు కార్యాచరణ ప్రణాళిక: సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో రాష్ట్రంలో కూడా గ్రామ పంచాయతీల పురోభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. పంచాయతీ కార్యకలాపాల్లో మహిళా స్వయం సహాయక బృందాల సహకారం తీసుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని అన్నారు. మంగళవారం సచివాలయంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ (సీఆర్ఐఎస్‌పీ) సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో సీఆర్ఐఎస్‌పీ మెంబర్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన.. మంత్రి సీతక్క సమక్షంలో పరస్పర ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళా సంఘాలు, గ్రామ పంచాయతీల మధ్య సమన్వయం సాధిస్తే గ్రామాల్లో అద్భుతాలు సృష్టించగలమని కేరళలో అమలు చేసి చూపించారన్నారు. ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రివర్గ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీతక్క చెప్పారు.

స్థానిక ఎన్నికల నిర్వహణ రిజర్వేషన్ల ఖరారే ముఖ్య ఎజెండా

» నేడు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలతో కీలక సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ, స్థానిక సంస్థలైన జిల్లాపరిషత్, మండల పరిషత్‌ల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు కనబడుతోంది. రెండు రోజుల కిందట డెడికేషన్ కమీషన్ రాష్ట్ర ప్రభుత్వానికి అందించిన నివేదిక ఆధారంగా.. రిజర్వేషన్ల స్థిరీకరణపై ప్రభుత్వ విభాగాలు కసరత్తు మొదలుపెట్టాయి. అందులో భాగంగానే పంచాయతీరాజ్ శాఖ ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల ఖరారు ప్రధాన ఎజెండాగా జిల్లాల అధికారులతో సమావేశం కానుంది. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, ఆర్డీవోలతో బుధవారం ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో కీలక సమావేశాన్ని నిర్వహించనున్నారు. కాగా, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాల ఆధారంగా సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష జరపనున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్ల ఖరారు, పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలపై ఇందులో చర్చించనున్నట్లు సమాచారం.

సీతారామపై కాళేశ్వరం ఎఫెక్ట్

బ్యారేజీల డిజైన్ల పునఃపరిశీలనకు.. నిర్ణయించిన టీఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల ప్రభావం సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుపై పడింది. మేడిగడ్డ కుంగిపోవడానికి డిజైన్లు, నిర్మాణం, నాణ్యత నియంత్రణ, డిజైన్‌కు తగ్గట్లుగా నిర్మాణం జరుగకపోవడం కారణమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) ప్రాథమిక విచారణలో నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే.! తాజాగా సీతారామ ప్రాజెక్టుకు చెందిన డిజైన్లను పునఃపరిశీలించాలని కేంద్ర జలవనరులు/నది అభివృద్ధి/గంగా పునరుజ్జీవన పథక విభాగానికి చెందిన సలహా మండలి 157వ సమావేశం నిర్ణయం తీసుకుంది. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో డిజైన్ల విషయంలో సీడబ్ల్యూసీతో పునఃపరిశీలన చేయించేలా సిఫారసుకు నిర్ణయించారు. నెలరోజుల తర్వాత మళ్లీ టీఏసీ భేటీ జరుగనుంది. కాగా.. ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దంటూ ఆంధ్రప్రదేశ్ చాలా రోజులుగా కోరుతున్న విషయం విదితమే. తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరిపై ఒప్పందం కుదిరేదాకా లేదా ట్రిబ్యునల్ నీటి పంపకాలను తేల్చేదాకా సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు డీపీఆర్‌ను తదుపరి క్లియరెన్స్‌ల కోసం కేంద్ర జలవనరుల సంఘానికి పంపించరాదని గోదావరి బోర్డును కోరుతూ గతంలో ఏపీ లేఖ రాసింది.

వేసవిలో.. విద్యుత్తు అంతరాయం ఉండొద్దు

» రెప్పపాటు కూడా కరెంట్ కట్ కావొద్దు

» ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): "వేసవి నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్తు అంతరాయం ఉండొద్దు. రెప్పపాటు కాలం కూడా కరెంట్ కట్ కావొద్దు. వేసవి డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా ఉండాలి" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో టీజీఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యావసరమైన విద్యుత్తును నిరవధికంగా అందజేయాలని సూచించారు. వేసవి ప్రణాళికపై అన్ని స్థాయుల్లో సమావేశాలు నిర్వహించుకుని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. "ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్తు ఎమర్జెన్సీ వాహనాల సేవలను గ్రామాలకు కూడా విస్తరించాలి. నిర్మాణంలో ఉన్న సబ్-స్టేషన్లను మార్చి 1లోగా పూర్తిచేయాలి" అని సూచించారు. మూడేళ్లుగా సబ్-స్టేషన్లపై పెరుగుతున్న లోడ్ భారం వివరాలపైనా భట్టి సమీక్ష జరిపారు. బాగా పనిచేసే వారికి ప్రోత్సాహకంగా అవార్డులు ఇచ్చే విధానాన్ని ప్రారంభించాలన్నారు. "ఇటీవల భారీ వరదల సమయంలోనూ.. అర్ధరాత్రిళ్లు కూడా విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. అలాంటి వారికి గుర్తింపునివ్వాలి. విద్యుత్తు రంగంలో వస్తున్న మార్పులపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలి. డయల్ 1912పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. అందుకోసం ఎస్సెమ్మెస్ ద్వారా ప్రచారం చేయాలి" అని వ్యాఖ్యానించారు.

మాదిగలకు మేలే లక్ష్యం

అందుకే ఎస్సీల వర్గీకరణ చేపట్టాం.. న్యాయపరమైన చిక్కుల్లేకుండా చేశాం

» ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే.. సబ్ కమిటీ, కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలి

» మందకృష్ణ మాదిగతో భేటీలో సీఎం రేవంత్

» కులాల కూర్పులో శాస్త్రీయత పాటించలేదు

» సవరణల తరువాత చట్టబద్ధత కల్పించాలి

» సీఎం రేవంత్ నిబద్ధత అభినందనీయం

» ఆయనకు సోదరుడిగా ఉంటా: మందకృష్ణ



హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగతో సమావేశమైన సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మాదిగలు, అందులోని ఉపకులాలకు మేలు చేయాలనే మంచి లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగతో అన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికలో లోపాలున్నాయని, సవరణలు చేయాల్సి ఉందని తెలుపుతూ ఇదే అంశంపై సమయం ఇస్తే కలిసి మాట్లాడుతానంటూ మందకృష్ణ సోమవారం సీఎంకు లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కృష్ణను ఆహ్వానించగా.. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపకులాల వర్గీకరణలోని లోపాలను మందకృష్ణ.. సీఎం రేవంత్‌కు వివరించారు. కులాల కూర్పులో కమిషన్ శాస్త్రీయతను పాటించలేదని, అందువల్ల కొన్ని కులాల గ్రూపులు మారిపోయాయని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీలను 4 గ్రూపులు (ఏ, బీ, సీ, డీ)గా వర్గీకరించాలని కోరారు. ఒకవేళ వెనకబాటుతనం ఆధారంగా వర్గీకరణ చేస్తే దాని ప్రకారమే ఇప్పుడున్న మూడు గ్రూపులకు అదే సూత్రాన్ని వర్తింపజేయాలన్నారు. ఎస్సీ కులాల్లో అతిపెద్ద జనాభాగా ఉన్న మాదిగలకు కేటాయించిన రిజర్వేషన్ శాతంలో అన్యాయం జరిగిందన్నారు. అదే సమయంలో జనాభాలో రెండో స్థానంలో ఉండి, అభివృద్ధి చెందిన మాలలకు మాత్రం వారి జనాభా నిష్పత్తి కంటే ఎక్కువగా కోటా ఇచ్చారని తెలిపారు.

గ్రూపుల్లో మార్పులు చేయాలి..

గ్రూపు-1లో చేర్చిన మన్నె, కొలుపులవాండ్లు, పంబాడ, పంబాలా, ముండాల, సంబన్ కులాలు గతంలో గ్రూపు-బీ, సీలో ఉన్నాయని, వీటిని ఇప్పుడు గ్రూపు-3లో చేర్చాలని మందకృష్ణ అన్నారు. మధ్యస్తంగా లబ్ధిపొంది ఇప్పుడు గ్రూపు-2 జాబితాలో ఉన్న ఎల్లమ్మల్వార్, ఎల్లమ్మలవాండ్లు, పంచమ, పరయ కులాలు గతంలో గ్రూపు-సీ, డీలో ఉన్నాయని, వీటిని ఇప్పుడు గ్రూపు-3లో చేర్చాలని కోరారు. ఇక గ్రూపు-3లో చేర్చిన ధోర్ కులాన్ని, గ్రూప్-1లో చేర్చిన మాంగ్ గరోడి కులాన్ని గ్రూప్-2లో చేర్చాలన్నారు. ఇక గ్రూపు-3లో ఉన్న పాకి, మోటి, తోటి, రెల్లి కులాలను గ్రూపు-1లో చేర్చాలని తెలిపారు. ఎస్సీ జనాభాలో 4వ స్థానంలో ఉన్న బేడబుడ్గ, జంగం కులానికి మరికొన్ని కులాలను కలిపి వాటి జనాభాతో ఏర్పాటుచేసిన గ్రూప్-1 విధంగానే.. జనాభాలో 3వ అతిపెద్ద జనాభా కలిగి ఉన్న నేతకాని కులానికి మహార్, హోలియదాసరితో పాటు మరికొన్ని కులాలను కలిపి గ్రూపు-3గా ఏర్పాటుచేయాలని కోరారు. ఇక సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అత్యంత ప్రయోజనాలు పొందిన మాల, వారి ఇతర కులాలను కలిపి గ్రూపు-4గా ఏర్పాటు చేయాలని సూచించారు. తీర్మానంలో ఈ సవరణలను చేసిన తరువాత వర్గీకరణకు చట్టబద్ధత తీసుకురావాలన్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై సీఎం రేవంత్ నిబద్ధతను మందకృష్ణ అభినందించారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి సోదరుడిగా ఉంటానన్నారు.

ఎస్సీల వర్గీకరణ తీర్మానంలో ఉన్న లోపాల గురించి మందకృష్ణ వివరించిన అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఎస్సీల వర్గీకరణ కోసమే అసెంబ్లీ చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీతో పాటు ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కమిషన్ ఇచ్చిన నివేదికను క్యాబినెట్‌లో చర్చించి అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తద్వారా ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామన్నారు. ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే సబ్ కమిటీతోపాటు, కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా వర్గీకరణకు తీర్మానం చేయాలని సీఎం రేవంత్ గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అసెంబ్లీలో కొట్లాడిన విషయాన్ని సమావేశానికి వచ్చిన ప్రతినిధులు గుర్తుచేశారు.

అభ్యంతరాలను కమిషన్‌కు చెప్పాలి..

ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేశ్‌మాదిగ, మాజీ ఎంపీ వెంకటేశ్ నేత తదితరులు పాల్గొన్నారు. అనంతరం మందకృష్ణ.. సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కాగా, ఎమ్మార్పీఎస్ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరుల కోసం భారీ స్తూపాన్ని నిర్మించాలని మందకృష్ణ కోరారు. అందులో వారి స్మృతులతో ఒక మ్యూజియంను ఏర్పాటుచేయాలని, అందుకు హైదరాబాద్ నడిబొడ్డున 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని అన్నారు. అలాగే మాదిగ అమరుల కుటుంబాల్లో ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం, పక్కా ఇల్లు, రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని, వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని భేటీ అనంతరం సీఎం రేవంత్‌కు మందకృష్ణ లేఖ రాశారు.

బినామీలకు పరిహారం!

(మొదటిపేజీ తరువాయి)

గాను 4000ఎకరాలు సేకరించారు. మరో 2వేల ఎకరాలపై కోర్టు కేసులు నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పట్టా భూమికి ఎకరాకు రూ.12.50 లక్షలు, అసైన్డ్ భూమికి రూ.8లక్షల చొప్పున పరిహారం పొందారు. దీంతోపాటు ఎకరం భూమి ఇచ్చిన రైతులకు 121గజాల ప్లాట్లనూ ఇచ్చారు. ప్లాట్లను పొందినవారిలో ఎక్కువగా బినామీలే ఉన్నారని మండలంలో ప్రచారం జరుగుతోంది.

బీఆర్ఎస్ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి..

మేడిపల్లిలో 1,601 మంది, నానక్‌నగర్‌లో 359, తాటిపర్తిలో 545, కుర్మిద్దలో 1240 మంది రైతులకు ప్లాట్లను కేటాయిస్తూ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఆయా గ్రామాలకు, అసలు మండలానికే సంబంధం లేని వ్యక్తులు భూపరిహారంతోపాటు ప్లాట్‌ను పొందినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. గ్రామాల్లో అసైన్డ్ భూమి సెంటు కూడా లేని వ్యక్తులకూ పరిహారం అందిందన్న ఆరోపణలు ఉన్నాయి. అసైన్డ్ భూములను వారే అనుభవిస్తున్నారంటూ అప్పట్లో బీఆర్ఎస్ నేతలు తమ అనుచరులు, బినామీల పేర్లు రాయించారని స్థానికులు చెబుతున్నారు. ఫార్మాసిటీ కోసం వారి భూమిని సేకరించిందంటూ అప్పట్లో అధికార పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి చేసి, పరిహారం సొమ్ము, ప్లాట్ ఇప్పించినట్లు సమాచారం. ఇలా పరిహారం పొందిన బినామీలకు 121 గజాల ప్లాట్ కూడా ఇచ్చారు. ఆ ప్లాట్లను కూడా చాలా మంది అమ్మేసి, సొమ్ము చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాంటి బినామీలకు గతంలో అధికారులు పరిహారం ఎలా ఇచ్చారు? ప్లాట్ ఎలా కేటాయించారు? అని టీజీఐఐసీ అధికారులు ప్రస్తుతం ఆరా తీస్తున్నారు. బినామీల విషయమై ఇంటెలిజెన్స్ శాఖ కూడా విచారణ చేసి ప్రభుత్వానికి సమాచారం అందించినట్లు తెలిసింది. పరిహారం, ప్లాట్ల తతంగంపై రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. సెంటు భూమి కూడా లేని బినామీలకు పరిహారం, ప్లాట్ ఇచ్చారంటూ గతంలోనే కాంగ్రెస్ నాయకులు నాటి కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అప్పట్లో అధికారులు ఈ అంశాన్ని పట్టించుకోలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో బినామీల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. బినామీల బాగోతాన్ని ఉన్నతాధికారులకు వివరించి, రికవరీ చేయించడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

యూజీసీ మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం: ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన నూతన మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ దుయ్యబట్టింది. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, జాతీయ ప్రధానకార్యదర్శి దినేష్ సిరంగరాజ్ డిమాండ్ చేశారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ తయారీకి 4-5 కంపెనీలు సిద్ధం

సాంకేతిక బిడ్లను తెరిచిన రోడ్లు, భవనాల శాఖ

» టెండర్ ఎవరికి ఇచ్చేదీ వారం రోజుల్లోగా ఖరారు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం రహదారికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అందించేందుకు నాలుగైదు కంపెనీలు ముందుకొచ్చాయి. దక్షిణభాగం డీపీఆర్ కోసం రోడ్లు, భవనాల శాఖ జనవరి 20న టెండర్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి.. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు సాంకేతిక (టెక్నికల్)బిడ్‌లను అధికారులు తెరిచి దాఖలైన టెండర్లను పరిశీలించారు. టెక్నికల్ బిడ్‌లలో అర్హులుగా తేలినవారి జాబితాను తయారు చేసి.. నిబంధనలకు అనుగుణంగా ఉన్న కంపెనీకి పనులను అప్పగించనున్నారు. ఈ ప్రక్రియ నిర్వహణ, కంపెనీ ఖరారుకు దాదాపు వారం పట్టే అవకాశం ఉందని తెలిసింది. ఆసక్తి చూపిన సంస్థల్లో ఒకటి రెండు కంపెనీలను కలిపి కూడా పనులు అప్పగించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అయితే అనుకున్న దానికంటే అదనంగా 11 కిలోమీటర్ల మేర రహదారి దూరం పెరగడంతో.. దాన్ని కూడా కలిపి 200 కిలోమీటర్లకు డీపీఆర్ ఇవ్వాలని అధికారులు పేర్కొన్నారు. దానిని కేంద్రానికి సమర్పించి దాని ప్రకారం రహదారి నిర్మాణం చేపట్టాల్సిందిగా కోరాలనే భావనలో రాష్ట్ర సర్కారు ఉంది. అందుకే డీపీఆర్ తయారీకి టెండర్లను ఆహ్వానించింది. కేంద్రం అందుకు సుముఖత వ్యక్తం చేయకపోతే తాము నిర్మించేందుకైనా ఈ డీపీఆర్ ఉపయోగపడుతుందని భావిస్తున్నట్టు సమాచారం. కాగా దక్షిణభాగం రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు, వాటి సేకరణ, ప్రాజెక్టు మానిటరింగ్ కోసం ప్రత్యేకంగా టెండర్లను ఆహ్వానించి.. ఫిబ్రవరి 25 తుదిగడువుగా ప్రకటించారు.

తేలనున్న వివరాలు..

రహదారి మార్గం (అలైన్‌మెంట్) దగ్గరి నుంచి రోడ్డు నిర్మాణ విధానం సహా పలు అంశాలు సమగ్ర ప్రాజెక్టు నివేదికలో తేలనున్నాయి. రహదారి నిర్మాణం, మార్గమధ్యంలో నిర్మించే వెహికల్ అండర్ పాస్, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, క్రాసింగ్, జంక్షన్‌లు, ఎక్కడెక్కడ టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందనేది తెలియనుంది. ఆ మార్గంలో ఏమైనా గ్రామాలు, ఆవాసాలు ఉన్నాయా? ఉంటే అక్కడ ఎంతమంది నివసిస్తున్నారు? చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయి? సాగు, అటవీ భూములు తదితర వివరాలను సేకరిస్తారు. రోడ్డు నిర్మాణానికి సేకరిస్తున్న భూముల వివరాలతో పాటు నిర్మాణ వ్యయ అంచనాలు కూడా సమగ్ర ప్రాజెక్టు నివేదికలో తెలియనున్నాయి. దీంతోపాటు ఈ రహదారిని ఏ పద్ధతిలో నిర్మించాలి, ఏ విధానంలో నిర్మిస్తే లాభదాయకంగా ఉంటుందన్న అంచనాలు కూడా తెలుస్తాయి.

ఆరోగ్యశ్రీలో అక్రమ నియామకాలు!

నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కోఆర్డినేటర్ల నియామకం.. తాజాగా 5 జిల్లాల్లో పోస్టుల భర్తీ

» ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో వసూలు

» 70 ఏళ్ల రిటైర్డ్ వైద్యుడికీ పోస్టు

» ఈ దందా వెనుక ఆరోగ్యశ్రీ ట్రస్టులో ఇద్దరు-ముగ్గురు అధికారుల హస్తం

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయం అక్రమాలకు కేంద్రంగా మారింది. కార్యాలయంలో ఇద్దరు ముగ్గురు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఐదు జిల్లాలకు ఆరోగ్యశ్రీ సమన్వయకర్త(కోఆర్డినేటర్)లను నిబంధనలకు విరుద్ధంగా నియమించిన వైనం బయటపడింది. ఈ నియామకాల వెనక లక్షల రూపాయలు చేతులు మారాయని తెలిసింది. వాటిలో నాలుగు జిల్లాల్లో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కాబట్టి ఎటువంటి నియామకాలు చేపట్టరాదు. కానీ, ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలోని కొందరు అధికారులు ఆ నియామకాలను గుట్టుచప్పుడు కాకుండా కానిచ్చేశారు. వాస్తవానికి ఆరోగ్య సమన్వయకర్తల నియామకం చేపడితే ముందుగా నోటిఫికేషన్ ఇవ్వాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులతో ఆ పోస్టులను భర్తీ చేస్తారు. ఈ పోస్టులకు వైద్యులు మాత్రమే అర్హులని, వారు ఏ ఆస్పత్రుల్లోనూ ప్రాక్టీసు చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయి. కానీ రెండు జిల్లాల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులుగా పనిచేస్తున్న వారిని ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తలుగా నియమించారు. నాలుగైదు రోజుల క్రితం వారికి నియామక లేఖలు ఇచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే నియామకాలు చేపట్టారని సమాచారం. అలాగే, దక్షిణ తెలంగాణలోని ఓ జిల్లాకు 70 ఏళ్లు పైబడిన ఓ వైద్యుడికి ఆరోగ్యశ్రీ జిల్లా సమయన్వకర్త పోస్టును కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఆ వయసులో ఆయనకు ఎందుకు కోఆర్డినేటర్ పోస్టు అప్పగిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ నియామకాల వెనక లక్షల రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎపిడిమాలజిస్టు అయిన ఆ రిటైర్డ్ డాక్టర్‌ను తీసుకునే విషయంలో ఈ మొత్తం భారీగా ఉన్నట్లు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ సొమ్మంతా ట్రస్టు కార్యాలయంలోని ఇద్దరు అధికారుల జేబుల్లోకి వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రధాన కార్యాలయంలోనూ నిబంధనలకు విరుద్ధంగా ఓ కీలక పోస్టును భర్తీ చేసినట్లు సమాచారం. ఉద్యోగుల ఆరోగ్య పథకంలో ఓ పోస్టును ట్రస్టుకు సంబంధం లేని, ఓ ప్రైవేటు వ్యక్తిని తీసుకొచ్చి కట్టబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నియామకాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ట్రస్టు వర్గాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.

అంత డిమాండ్ ఎందుకంటే..

ఆరోగ్యశ్రీ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు వీలుగా ప్రతి జిల్లాకు సమన్వయకర్తలను నియమిస్తారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు వివిధ శస్త్రచికిత్సలకు నిర్దేశించిన చార్జీలకంటే ఎక్కువ వసూలు చేస్తుంటాయి. ఈ విషయాన్ని ముందే పేషెంట్లకు చెప్పి.. అంగీకరిస్తేనే ఆపరేషన్ చేస్తారు. అధికంగా డబ్బులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. బాధితులు సంబంధిత జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్తలకు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు వచ్చిన ఆస్పత్రులపై చర్యలు తీసుకునే అధికారం సమన్వయకర్తకు ఉంటుంది. జిల్లాలో ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులపై పర్యవేక్షణ బాధ్యత కూడా సమన్వయకర్తే చూస్తారు. దీంతో వారితో సమస్య ఎందుకని కొన్నిచోట్ల ప్రైవేటు ఆస్పత్రులన్నీ కలిసి ప్రతి నెలా లక్షల్లో ముట్టచెబుతుంటాయి. ఒక్కో ప్రైవేటు ఆస్పత్రి 10వేల నుంచి 30 వేల వరకు ఇస్తుంటాయని ఓ ప్రైవేటు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో రూ. 79.20 కోట్లు ఎస్‌బీఐకి అప్పగింత

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ముసద్దీలాల్ జువెలర్స్‌కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జప్తు చేసిన చరాస్తుల్లో రూ. 79.20 కోట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)కి అప్పగించారు. కోర్టు ఆదేశాల మేరకు ఈడీ అధికారులు ఈ ప్రక్రియ పూర్తిచేశారు. పాత పెద్ద నోట్ల రద్దు సమయంలో ముసద్దీలాల్ జువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మరికొందరిపై ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్(పీఎంఎల్‌ఏ) చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా ముసద్దీలాల్ జువెలర్స్‌కు సంబంధించిన స్థిర, చర ఆస్తుల్ని ఈడీ అధికారులు జప్తు చేశారు. అయితే ముసద్దీలాల్ జువెలర్స్ నిర్వాహకులు ఎస్‌బీఐ నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించలేదు. 2019 జులై నుంచి ఆ రుణాలు ఎన్‌పీఏగా మారాయి. ఆ సంస్థ ఎస్‌బీఐకి మొత్తం 120 కోట్లు బకాయి పడింది. దీంతో నాంపల్లి పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టును బ్యాంకు అధికారులు ఆశ్రయించారు. విచారణ అనంతరం ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో 79.20 కోట్లు ఎస్‌బీఐకి మళ్లించేలా కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

మెట్రో కారిడార్-6 పనులు ఆపండి

» హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు రెండో దశలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న కారిడార్- 6 పనులు ఆపాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎఫ్) సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ రహీమ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కారిడార్‌లో ఛార్మినార్, ఫలక్‌నుమా వంటి వారసత్వ కట్టడాలు ఉన్నాయని, వీటిపై మెట్రో రైలు ప్రభావం ఎంత ఉంటుందో తెలిపేలా హెరిటేజ్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ జరగలేదని తెలిపారు. వారసత్వ కట్టడాలను రక్షించి ప్రత్యామ్నాయ మార్గంలో మెట్రో నిర్మించాలని కోరారు. ఈ పిటిషన్ మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది.

డంపింగ్ యార్డ్ కోసం ప్రైవేటు భూముల చదును

» ప్యారానగర్ భూములపై వివాదం

» మళ్లీ నోటీసులు ఇచ్చి సర్వే చేయాలని హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేయతలపెట్టిన చెత్త డంపింగ్ యార్డు కోసం తమ పట్టా భూములను చదును చేస్తున్నారని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. తమకు నోటీసులు ఇవ్వకుండానే చెట్లు కొట్టడం, చదును చేయడం వంటి పనులు చేపట్టడం అక్రమమని పేర్కొంటూ హైదరాబాద్ మలక్‌పేట్‌కు చెందిన రమాదేవి సహా ఆరుగురు పట్టాదారులు ఈ పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్లకు తాజాగా నోటీసులు జారీ చేసి, సర్వే చేపట్టాలని ఆదేశిస్తూ విచారణను ముగించింది.

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి వీసీ జనార్దన్ రావు హత్య కేసు నిందితుడు

ఎర్రగడ్డ/సైదాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వెల్జన్ ఇండస్ట్రీస్ అధినేత వీసీ జనార్దన్ రావును దారుణంగా హత్య చేసిన ఆయన మనవడు కీర్తితేజను చంచల్‌గూడ జైలు నుంచి ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తరలించారు. ఈనెల 6వ తేదీన జనార్దన్ రావును కీర్తితేజ హత్య చేసిన విషయం తెలిసిందే. అయితే.. అతడు ఉద్దేశపూర్వకంగానే హత్య చేశాడా.. లేదా మానసిక పరిస్థితి సరిగా లేక ఈ దారుణానికి పాల్పడ్డాడా? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి జైలు అధికారులు అతడిని ఆస్పత్రికి తరలించారు. అవుట్ పేషెంట్‌గానే ఆస్పత్రిలోని ఓపీలో పరీక్షలు నిర్వహించారు. అనంతరం అతడిని చంచల్‌గూడ జైలుకు తీసుకెళ్లారు. కాగా, కీర్తితేజ వెంట ఎవరూ లేకపోవడం, ఒక్కడే ఆస్పత్రికి రావడంతో అతడి మానసిక పరిస్థితిని తెలుసుకోవడానికి పలు రకాలుగా ప్రశ్నించామని వైద్యులు తెలిపారు. తన మానసిక పరిస్థితి బాగానే ఉందని, తనకు మానసిక వ్యాధి లాంటివి ఏమీ లేవని కీర్తితేజ తెలిపినట్లు పేర్కొన్నారు. అతడి మానసిక పరిస్థితిని పూర్తిగా తెలుసుకోవడానికి సైకోమెట్రీ టెస్ట్ చేయవలసి ఉంటుందని తెలిపారు.

తెలంగాణ నుంచి ఝార్ఖండ్‌కు 16వేల కిలోల అమ్మోనియం నైట్రేట్

» పశ్చిమ బెంగాల్‌లో లారీ సీజ్.. ముగ్గురి అరెస్టు

కోల్‌కతా, ఫిబ్రవరి 11 : తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా నుంచి ఝార్ఖండ్‌లోనే దేవ్‌గఢ్‌కు 16,000 కిలోల పేలుడు పదార్థం.. అమ్మోనియం నైట్రేట్‌ను తరలిస్తున్న ఓ లారీని పశ్చిమ బెంగాల్ పోలీసులు పట్టుకున్నారు. అమ్మోనియం నైట్రేట్ తరలింపునకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో మంగళవారం ఉదయం లారీని సీజ్ చేశారు. డ్రైవర్, క్లీనర్ సహా ముగ్గురిని అరెస్టు చేసి రామ్‌పుర్హత్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. లారీలోని అమ్మోనియం నైట్రేట్ పేలితే భారీ నష్టం తప్పదని పోలీసులు పేర్కొన్నారు.



శ్రీల ప్రభుపాదుల విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న సాధువులు

హరే కృష్ణ ఉద్యమ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదులకు విశ్వగురు బిరుదు

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్, హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపకులు ఎ. సి. భక్తి వేదాంతస్వామి శ్రీల ప్రభుపాదులుకు అఖిల భారతీయ అఖార పరిషత్.. విశ్వగురు బిరుదును ఇచ్చింది. ఈ బిరుదు పొందిన మొదటి వ్యక్తిగా శ్రీల ప్రభుపాదులు నిలిచారు. మహా కుంభమేళ సందర్భంగా ప్రయాగరాజ్‌లో సోమవారం శ్రీల ప్రభుపాదుల విగ్రహానికి పవిత్ర మంత్రోచ్చారణలతో అభిషేకం, పుష్పవృష్టి, హారతి, శుభసామగ్రి సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖార పరిషత్ అధ్యక్షులు మహంత్ రవీంద్ర పూరి, వివిధ అఖారాల నుంచి వచ్చిన మహామండలేశ్వరులు, కార్యదర్శులు, సీనియర్ సాధువులు పాల్గొన్నారు. గ్లోబల్ హరేకృష్ణ ఉద్యమం వైస్ ఛైర్మన్ చంచలపతి దాసు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీల ప్రభుపాదులు తరఫున గ్లోబల్ హరేకృష్ణ ఉద్యమం ఛైర్మన్, ఇస్కాన్ బెంగళూరు అధ్యక్షులు మధు పండిట్ దాసు విశ్వగురు బిరుదును అందుకున్నారు. ఈ సందర్భంగా మధు పండిట్ దాసు మాట్లాడుతూ.. శ్రీల ప్రభుపాదులును విశ్వగురు బిరుదుతో సత్కరించడం ఇస్కాన్‌కు ఆనందాన్ని ఇస్తుందన్నారు. శ్రీకృష్ణుని సందేశాన్ని ప్రచారం చేయడానికి ఆయన చేసిన మార్గదర్శక ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని మార్చాయన్నారు.

మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం..

ఏడుగురు నగర వాసుల దుర్మరణం

కుంభమేళా వెళ్లి వస్తుండగా జబల్‌పూర్ వద్ద దుర్ఘటన



బాలరాజు



మల్లారెడ్డి



ఆనంద్



సంతోష్‌కుమార్



శశికాంత్



వెంకటప్రసాద్



రవి కుమార్

హైదరాబాద్ సిటీ/ఉప్పల్/నాచారం/తార్నాక/మల్కాజిగిరి, శంకర్‌పల్లి, రఘునాథపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో పుణ్యస్నానాలకు వెళ్లిన ఏడుగురు నగరవాసులు రోడ్డు ప్రమాదం జరిగి విగతజీవులుగా తిరిగొచ్చిన ఉదంతమిది..! మృతుల్లో టెంపో ట్రావెలర్ డ్రైవర్ సహా.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు, మరో ముగ్గురు స్నేహితులు ఉన్నారు. ఇంకో ఇద్దరు మిత్రులు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో 30వ నంబరు హైవేపై మంగళవారం ఉదయం జరిగింది. జబల్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని నాచారం, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది.. నాచారం కార్తికేయనగర్‌కు చెందిన స్వర్ణకారుడు సంతోష్‌కుమార్(48), నాచారం రాఘవేంద్రనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శశికాంత్(38), దిల్‌సుఖ్‌నగర్ ముసారాంబాగ్‌కు చెందిన గోల్కొండ ఆనంద్‌కుమార్(47), సంతోష్ స్నేహితులు, నాచారం కార్తికేయనగర్‌కు చెందిన పాల వ్యాపారి మల్లారెడ్డి(60), శ్రీరాం బాలకిషన్, మెడికల్ దుకాణం నిర్వాహకుడు రొంపల్లి రవికుమార్(55), బ్యాంక్ ఆఫ్ బరోడా హిమాయత్‌నగర్ బ్రాంచిలో లాజిస్టిక్ మేనేజర్‌గా పనిచేసే తార్నాక గోఖలేనగర్‌కు చెందిన టి.వెంకట ప్రసాద్(49), కొత్తపేట్ న్యూమారుతీనగర్‌కు చెందిన సుంకోజు నవీనాచారి కలిసి.. నాచారం ఎర్రకుంటలో ఉంటున్న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం రామరాయిని బంగ్లా గ్రామస్థుడు కల్యారి బాలరాజు(30)కి చెందిన టెంపో ట్రావెలర్(ఏపీ29 డబ్ల్యూ1525)లో ఈ నెల 8న ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. ఆ రోజు ఆదివారం కావడం.. రద్దీ ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సోమవారం పుణ్యస్నానాలు ఆచరించాక.. హైదరాబాద్ తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో టెంపో ట్రావెలర్ రెండు సార్లు పంక్చర్ అయినట్లు సమాచారం. దీంతో.. కొందరు విమానంలో హైదరాబాద్ రావాలని నిర్ణయించుకుని, చార్జీలు ఎక్కువగా ఉండడంతో.. చివరి క్షణంలో విరమించుకున్నారు. మంగళవారం ఉదయం వీరి వాహనం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ సమీపంలోని సిహోరా పట్టణానికి చేరుకుంది. అప్పటికే అంతా బాగా అలసిపోవడంతో.. వాహనాన్ని ఎక్కడైనా నిలిపి, విశ్రాంతి తీసుకోవాలనుకున్నారు. అయితే, ఉదయం 8.30 సమయంలో.. ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన సిమెంట్ లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో డ్రైవర్ బాలరాజు, సంతోష్, శశికాంత్, ఆనంద్‌కుమార్, మల్లారెడ్డి, రవి, వెంకటప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు. నవీనాచారి కాలు ఫ్రాక్చర్ అవ్వగా, బాలకిషన్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వీరికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెడికల్ కాలేజీలో చికిత్స అందిస్తున్నారు. వీరిద్దరి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రాత్రి 10.30 సమయంలో మృతదేహాలకు పోస్టుమార్టం ప్రక్రియను పూర్తిచేశామని, రెండు అంబులెన్సుల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నామని చెప్పారు. తెలంగాణ, ఏపీతోపాటు.. కేంద్ర మంత్రులు ఫోన్లు చేశారని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని జబల్‌పూర్ కలెక్టర్ వివరించారు.

టెంపోను ఢీకొన్న కారు

ఈ ప్రమాదంలో.. టెంపోట్రావెలర్‌ను వెనక నుంచి తెలంగాణకు చెందిన ఓ కారు ఢీకొంది. అయితే.. ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో.. కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు.

అనాథలైన ఇద్దరు పిల్లలు

సంతోష్‌కుమార్ భార్య గత ఏడాది మృతిచెందారు. రెండ్రోజుల్లో ఆమె సంవత్సరీకం ఉండగా.. కుంభమేళా వెళ్లొచ్చాక కార్యక్రమాన్ని నిర్వహించాలని సంతోష్ భావించారు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో.. ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. పిల్లలిద్దరూ హాస్టల్‌లో ఉంటూ.. చదువుకుంటున్నారు. వారికి సంతోష్ మరణవార్త తెలియదని, విషయం ఎలా చెప్పాలోనంటూ సంతోష్ తల్లి విలపిస్తున్నారు.

స్వస్థలాల్లో విషాదాలు

మృతుల్లో సింహభాగం నాచారం ప్రాంతానికి చెందినవారు కాగా.. వారి స్వస్థలాల్లోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. సురకంటి మల్లారెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని ప్రొద్దుటూరు గ్రామం. కొన్నేళ్ల క్రితం మల్లారెడ్డి కుటుంబం నాచారానికి వలసవెళ్లి, పాల వ్యాపారం చేస్తూ స్థిరపడిందని గ్రామస్థులు తెలిపారు. డ్రైవర్ కల్యారి బాలరాజు స్వస్థలమైన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం రామరాయిని బంగ్లా గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలరాజు భార్య మహేశ్వరి, పిల్లలు చంద్రనీల, యశ్వంత్ విలపిస్తున్నారు.

సీఎం, కేంద్ర మంత్రుల దిగ్భ్రాంతి

జబల్‌పూర్ రోడ్డు ప్రమాదం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మృతదేహాలను హైదరాబాద్‌కు తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ ఈటల రాజేందర్ కూడా ఈ ఘటన దురదృష్టకరమైనదని వ్యాఖ్యానించారు.

అస్వస్థతకు గురై.. ఎల్లారెడ్డి వాసి మృతి



శంకర్ (ఫైల్)

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లిన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన మంగలి శంకర్(43) అస్వస్థతకు గురై మృతిచెందారు. వారం క్రితం ఆయన గ్రామస్థులతో కలిసి, కుంభమేళాకు వెళ్లారు. పుణ్యస్నానాలు ఆచరించాక.. ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో తోటి భక్తులు ఆయనను చికిత్స నిమిత్తం అలహాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం శంకర్ మృతిచెందారు.



భూదాన్ భూములపై విచారణ ప్రారంభించాం

» సమగ్ర నివేదిక సమర్పిస్తాం

» నాలుగు వారాల గడువు ఇవ్వండి

» హైకోర్టుకు సీఎస్ విజ్ఞప్తి

» రంగారెడ్డి కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ పట్టాల మంజూరుపై ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి హైకోర్టుకు తెలిపారు. ఈ భూములకు రంగారెడ్డి కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ ఉన్నప్పుడు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చారంటూ వచ్చిన ఆరోపణలపై సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేశారు. తెలంగాణ భూదాన్ అండ్ గ్రామ్‌దాన్ యాక్ట్ - 1965 సెక్షన్ 24 (ఏ) కింద కాంపిటెంట్ అథారిటీ అయిన రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి కం భూదాన్ యజ్ఞ బోర్డు ఛైర్మన్ సుమోటోగా కేసు నమోదు చేశారని తెలిపారు. ఆ కేసుకు సంబంధించి అందరు భాగస్వాములకు నోటీసులు జారీచేశారని తెలిపారు. తుది వాదనలు ఈనెల 15న జరగనున్నాయని పేర్కొన్నారు. కాంపిటెంట్ అథారిటీ వద్ద ప్రొసీడింగ్స్ ముగిసిన తర్వాత ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక అందజేస్తామని తెలిపారు. ఇందుకు నాలుగు వారాల పాటు గడువు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం తుది నివేదిక ఇస్తే కాంపిటెంట్ అథారిటీ చేపడుతున్న విచారణపై ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సమావేశాలు, సీఎంతో సమీక్ష సమావేశాల్లో పాల్గొంటున్నందున వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామ సర్వే నంబరు 182లో 10.29 ఎకరాల భూమికి సంబంధించి ఖాదర్ ఉన్నీసా బేగంకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చిన అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్, డీఆర్‌వో జ్యోతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నవాబ్ ఫరూఖ్ అలీఖాన్ ప్రభుత్వానికి ఫిర్యాదుచేశారు. ఆ భూమిలో తనకు వాటా ఉందని తెలిపారు. ఈ ఫిర్యాదుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. అమోయ్‌కుమార్ తరహాలో నిజాం నవాబు కూడా భూములు ధారాదత్తం చేయలేదని తీవ్రంగా వ్యాఖ్యానించింది. వ్యక్తిగత హోదాలో అమోయ్‌కుమార్, సీఎస్ కౌంటర్లు దాఖలు చేయాలని పలుమార్లు ఆదేశించారు. అయినా స్పందన లేకపోవడంతో ఫిబ్రవరి 10 నాటికి కౌంటర్ వేయకపోతే సీఎస్ వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంటుందని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే సీఎస్ ప్రస్తుతం అఫిడవిట్ దాఖలు చేస్తూ నాలుగువారాలు గడువు ఇవ్వాలని కోరారు. దీంతో విచారణ మార్చి 10కి వాయిదా పడింది.

బర్డ్ ఫ్లూ భయం

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి సవ్యసాచి ఘోష్ ఈ మేరకు కలెక్టర్లకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులతో జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలని, ఇతర రాష్ట్రాల నుంచి బర్డ్ ఫ్లూ కోళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకునేలా కార్యాచరణను రూ పొందించుకోవాలని కలెక్టర్లను కోరారు. అప్రమత్తమైన కలెక్టర్లు రాష్ట్రవ్యాప్తంగా 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. సరిహద్దు జిల్లాల్లో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం ఏపీ నుంచి కోళ్లను తీసుకువస్తున్న వాహనాలను అధికారులు తిరిగి వెనక్కి పంపించారు. ఏపీలో బర్డ్ ఫ్లూ వైరస్‌తో లక్షలాది కోళ్లు చనిపోయాయి. ఇదే సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలుప్రాంతాల్లో అంతుచిక్కని వైరస్‌తో 10-20 రోజుల వయసున్న కోడి పిల్లలు చనిపోయాయి. ఖమ్మంలోని కోళ్ల ఫారాలకు అధిక శాతం పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి కోడిపిల్లలు వస్తాయి. వీటి ద్వారా బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రవేశించే ముప్పు ఉండడంతో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యం లో అశ్వారావుపేట, అల్లిపల్లిలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి, ఏపీ నుంచి కోళ్లు రాకుండా చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఖమ్మంలో కోళ్ల పెం పకం దాదాపుగా నిలిచిపోయింది.



గద్వాలలో 33,030 కోళ్లు వెనక్కి

జోగుళాంబ గద్వాల జిల్లా సరిహద్దుల్లో 44వ నంబరు జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏపీ నుంచి రాష్ట్రంలోకి బ్రాయిలర్ కోళ్లను తరలిస్తున్న వాహనాలను వెనక్కి పంపించారు. 5 వాహనాల్లో తీసుకొస్తున్న 3,030 బ్రాయిలర్ కోళ్లను, 500 బాతులను, తమిళనాడు నుంచి రెండు కంటైనర్లలో కామారెడ్డి జిల్లాకు తరలిస్తున్న 30 వేల బ్రాయిలర్ చిక్స్ (చిన్నపిల్లల)ను వెనక్కి పంపారు. రెండు రోజులుగా మొత్తం 33,030 బ్రాయిలర్ కోళ్లు, 500 బాతులను వెనక్కి పంపినట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తెలంగాణ, ఏపీ సరిహద్దులో కోదాడ, వాడపల్లి, నాగార్జునసాగర్‌లో మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో కొద్ది రోజుల క్రితం కోళ్లు మృత్యువాత పడగా వాటి మరణానికి బర్డ్‌ఫ్లూ కారణం కాదని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ప్రకటించింది. మరోవైపు, బర్డ్ ఫ్లూ భయాలతో కో ళ్లఫారాల యజమానుల్లో ఆందోళన నెలకొంది. మార్కెట్‌లో చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి.

చికెన్‌కు 'వాట్సాప్' షాక్!

హైదరాబాద్‌లో రోజూ 6 లక్షల కేజీల చికెన్ తినేస్తారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకూ చికెన్ అమ్మకాలు, ధర బాగానే ఉన్నాయి. టీవీలు, సామాజిక మాధ్యమాల్లో వైర స్‌పై ప్రచారం మొదలైన వెంటనే జనం ఒక్కసారిగా భయపడ్డారు. సాయంత్రం 5 గంటలకు కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.200-210కి లభిస్తే, స్టాక్ మార్కెట్ కుప్పకూలినట్లుగా ఒక్క గంటలోనే అది రూ.170కి చేరింది. అంటే హైదరాబాద్ నగర వాసులు ఎంత భయపడ్డారో అర్థం చేసుకోవచ్చు. గుడ్లు తినకూడదు, చికెన్ తినకూడదంటూ వాట్సాప్‌లో చేస్తున్న ప్రచారం వల్ల పౌల్ట్రీ పరిశ్రమ పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో చికెన్ విక్రయాలు 30-40% తగ్గాయని వ్యాపారులు చెప్పారు.

గోదావరి జిల్లాలను వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ

ఏపీలోని గోదావరి జిల్లాలను బర్డ్‌ఫ్లూ వణికిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం, పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం వేల్పూరులోని కోళ్లఫారాల్లో ఉన్నట్టుండి వేలకొద్దీ కోళ్లు మరణించడం.. వాటి శాంపిళకలను పరీక్షించగా బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో పౌల్ట్రీ పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైంది.

మెడికల్ సీట్లలో 'స్థానికత' కేసును

విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయండి

» సుప్రీంకోర్టును కోరిన తెలంగాణ ప్రభుత్వం

» పరిశీలిస్తామన్న ద్విసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో స్థానికత అంశానికి సంబంధించిన కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని మంగళవారం తెలంగాణ ప్రభుత్వం కోరింది. పీజీ సీట్లకు స్థానికత వర్తించదని ఓ కేసులో ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టం చేయడం, ఏపీ అభ్యర్థులకూ తెలంగాణ స్థానికత వర్తిస్తుందని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వినతికి ప్రాధాన్యం ఏర్పడింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలు చేసిన తెలంగాణ ప్రభుత్వం.. సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా ఆ కేసును విస్తృత ధర్మాసనానికి పంపాలని కోరింది. గతంలో సుమారు వంద మంది ఏపీ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ వేసి... ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన తమకు కూడా ఆర్టికల్ 371(డి) ప్రకారం తెలంగాణలోని పీజీ మెడికల్ సీట్లలో స్థానికతను వర్తింపజేయాలని కోరారు. దీనిని అప్పుడే తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజనలో భాగంగా ఆర్టికల్ 371(డి) ప్రకారం పదేళ్లపాటు మాత్రమే ఏపీ విద్యార్థులకు తెలంగాణలో స్థానికతను వర్తింపజేయాలని స్పష్టంగా ఉందని తెలిపింది. ఈ నిబంధన ప్రకారం.. 9వ తరగతి నుంచి 12వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులకు మాత్రమే స్థానిక కోటా వర్తిస్తుంది అంటూ వాదనలు వినిపించింది. ఈ వాదనతో ఏకీభవించని హైకోర్టు... ఆర్టికల్ 371(డి) ప్రకారం రాయలసీమ, ఆంధ్ర రీజియన్‌లలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులకు తెలంగాణలో పీజీ మెడిటల్ సీట్ల కేటాయింపులో స్థానికతను వర్తింపజేయాలని తీర్పునిచ్చింది. ఆర్టికల్ 371(డి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వర్తిస్తున్నదని, అందులో సవరణలు చేసే వరకు ఏపీ, రాయలసీమ విద్యార్థులు తెలంగాణలో స్థానిక కోటాకు అర్హులేనని తెలిపింది. ఈ తీర్పును గతేడాది డిసెంబర్ 18న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై మరికొందరు కూడా పిటిషన్లు వేశారు. ఇవి మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ పీజీ మెడికల్ సీట్లలో ప్రవేశాలకు స్థానికతను వర్తింపజేయవద్దని గత నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. పీజీ వైద్యవిద్యలో రాష్ట్ర కోటా కింద 50 శాతం సీట్లను నివాస ఆధారంగా భర్తీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసిన విషయాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో తమ అప్పీలుపై విచారణను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని ధర్మాసనాన్ని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలంటే తొలుత తాము వాదనలు వినాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ తర్వాతే తెలంగాణ పిటిషన్‌పై ఏం చేయాలన్నది నిర్ణయిస్తామని తెలిపారు. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.